thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 108 | కరీంనగర్ శుక్రవారం, 27 జూన్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఈపీఎస్ కనీస పెన్షన్ రూ.3,000కు పెంపు

న్యూఢిల్లీ : పెన్షన్‌దార్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పనుందా? కనీస పెన్షన్‌ను పెంచే అవకాశాలు ఉన్నట్టు సూచనలు అందుతున్నాయి. ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్) కింద రానున్న నెలల్లో కనీస పెన్షన్‌ను రూ. 1,000 నుంచి రూ. 3,000కు పెంచే అవకాశం ఉన్నట్టు సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ప్రస్తుతం ఉద్యోగి జీతంలో 12 శాతాన్ని యజమానులు భవిష్య నిధికి చెల్లిస్తున్నారు. ఇందులో 8.33 శాతం ఉద్యోగుల పెన్షన్ స్కీం (ఈపీఎస)కు జమ అవుతుంది. మిగిలిన 3.67 శాతం ఉద్యోగుల భవిష్య నిధి (ఈపీఎఫ)లో చేరుతుంది. దీని ఆధారంగా ప్రస్తుతం రూ. 1,000 కనీస పెన్షన్‌గా చెల్లిస్తుండగా, దాన్ని నెలకు రూ. 3,000కు పెంచే అవకాశం ఉందని ఆ అధికారి తెలిపారు.

# రాజ్యాంగమే అత్యున్నతమైనది.. పార్లమెంట్ కాదు

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ సంచలన వ్యాఖ్యలు



చాలా మంది పార్లమెంట్ అత్యున్నతమైనది అంటారు కానీ.. తన దృష్టిలో భారత రాజ్యాంగ మే పరమోన్నతమైనదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అన్నారు. ఇవాళ ఆయన మహారాష్ట్రలోని అమరావతిలో తన సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ..సుప్రీం కోర్టు 'మౌలిక నిర్మాణ సిద్ధాంతం' ఆధారంగా ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ, పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరించే అధికారం ఉన్నప్పటికీ, దాని మౌలిక నిర్మాణాన్ని మార్చలేరని అన్నారు. ప్రతి ఒక్కరికీ నివసించేందుకు ఇల్లు ఉండాలి.. బుల్డోజర్ న్యాయంపై తాను ఇచ్చిన తీర్పు సరైనదేనని సమర్థించుకున్నారు. తాము విధులు నిర్వర్తి స్తున్నామని విషయాన్ని న్యాయమూర్తులు ఎల్లప్పుడు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం ప్రజాస్వామ్యంలోని మిగిలిన మూడు విభాగాలు భారత రాజ్యాంగానికి లోబడే పనిచేస్తాయని అన్నారు. తీర్పుల విషయంలో ప్రజలు ఏమనుకుంటున్నారన్నది న్యాయమూర్తులను ప్రభావితం చేయకూడదని.. స్వతంత్రంగా ఆలోచించాలని పేర్కొన్నారు. వాస్తవానికి తాను ఆర్కిటెక్ట్ కావాలనుకున్నప్పటికీ, తండ్రి తనను న్యాయవాదిగా చూడాలని కోరుకున్నారని బీఆర్ గవాయి తెలిపారు.




## రేవంత్ సర్కార్ మరో శుభవార్త.. ఆ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. ఆరోగ్యశాఖలో మరోసారి భారీగా ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. ఒకేరోజు మూడు వేర్వేరు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వడానికి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమైంది. ప్రభుత్వ ప్రకటనతో అసిస్టెంట్ ప్రొఫెసర్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్, స్పీచ్ ఫాథాలజిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో గడిచిన 17 నెలల్లో 8 వేలకుపైగా పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది.

మరో 3212 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1284 ల్యాబ్ టెక్నీషియన్, 1950 మల్టీ పర్పస్ ఫీమెల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ఆయా పోస్టుల ఫలితాలను విడుదల చేయడంతో మెరిట్ జాబితాలు సిద్ధమవుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మెడికల్ కాలేజీల్లోని పోస్టుల భర్తీకి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమైంది.

# ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమాకరం

## డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ.. గంజాయి, డ్రగ్స్ హబ్‌గా మారితే మనందరం విఫలమైనట్టేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన సదస్సులో సీఎం ప్రసంగించారు. తెలంగాణ గడ్డపై గంజాయి, డ్రగ్స్ వైపు చూస్తే వారి వెన్ను విరుస్తామని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే స్పష్టంగా చెప్పానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. "తెలంగాణ అంటే ఉద్యమాలు.. పోరాటాల గడ్డ. ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమానకరం. పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు విద్యార్థులపై డ్రగ్స్ ప్రభావం పడింది. డ్రగ్స్ మహమ్మారికి బలవుతున్నారు.

యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే దేశం మనుగడకే ప్రమాదం. ఒక దేశాన్ని దెబ్బతీయడానికి శత్రుదేశాలు ఏ మార్గాన్ని ఎంచుకుంటాయో చెప్పలేం. కొన్ని దేశాలు కొవిడ్‌ను ఎంచుకోవచ్చు.. మరికొన్ని దేశాలు డ్రగ్స్‌ను ఎంచుకోవచ్చు. మదక ద్రవ్యాలు తరలించే వారు తెలంగాణ సరహద్దులో అడుగు పెట్టాలంటే ఒకటికి వంద సార్లు ఆలోచించుకునేలా చర్యలు ఉండాలని మంత్రివర్గ సహచరులు,



పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చా. యుద్ధం, సైనికులు అంటేనే.. పంజాబ్ గుర్తుకు వచ్చేది. అలాంటి పంజాబ్ ఇవాళ డ్రగ్స్ మహమ్మారి వలలో చిక్కుకుంది. డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి యువతను సరైన మార్గంలో పెట్టాలి, అభివృద్ధి పథంవైపు నడిపించాలని స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణపతకం రాకపోవటం గురించి ఆలోచించాం. యువతకు సాంకేతిక నైపుణ్యం అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం.

డ్రగ్స్ నిర్మూలన బాధ్యత పౌరులపై కూడా ఉంది. పిల్లల ప్రవర్తనను గమనించేందుకు ప్రత్యేకమైన సిబ్బందిని నియమించుకోవాలి. సబ్జెక్ట్, పీఈటీలను నియమించుకున్నట్టే బిహేవియర్ అబ్జర్వర్స్‌ను నియమించుకోవాలి. చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లలో గంజాయి, డ్రగ్స్ కలిపి విక్రయిస్తున్నారు. గంజాయి అమ్మే వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. విద్యాసంస్థల్లో డ్రగ్స్ కనిపిస్తే యాజమాన్యాలదే బాధ్యత. డ్రగ్స్ నివారణకు ప్రత్యేకంగా 'ఈగల్' అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి పంట, సరఫరా, విక్రయంపై ఈగల్ టీమ్ ప్రత్యేక నిఘా పెడుతుంది" అని సీఎం తెలిపారు. సినీనటులు రామ్‌చరణ్, విజయ్‌దేవరకొండకు ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా.. యువతకు మంచి సందేశం ఇవ్వాలని, ఈ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు" అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కోచ్ పుల్లెల గోపీచంద్, పలువురు ఉన్నతాధికారులు...తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయం ముసుగులో రౌడీయిజం చేస్తే తోక కట్ చేస్తాం!

## గంజాయి బ్యాచ్‌కు సహకరిస్తే.. గుణపాఠం తప్పదు: చంద్రబాబు



గుంటూరు: రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొడితే ఊరుకోమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయడు హెచ్చరించారు. రాజకీయం ముసుగులో రౌడీయిజం చేస్తే తోక కట్ చేస్తానని వార్నింగ్ ఇచ్చారు. ఇవాళ(గురువారం) గుంటూరులో యాంటీ నార్కొటిక్స్ డేలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. గంజాయి సాగుతో దేశాన్ని, ఏపీని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ బ్రాండ్‌ను గత పాలకులు నాశనం చేశారని ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నానని ఉద్ఘాటించారు సీఎం చంద్రబాబు. అడ్డొస్తే తొక్కుకుంటూ వెళ్తాం.. వదిలిపెట్టమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. గంజాయి ఎవరూ వాడినా వదిలిపెట్టమని.. లా అండ్ ఆర్డర్‌లో చాలా సమస్యలు చూశానని తెలిపారు. రాయలసీమలో ముఠాలను అణచివేసిన పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ముఠా కక్షలు ఉండటానికి వీల్లేదని అన్నారు. మారితే మారండి.. మారకపోతే ఏపీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. గంజాయి నిర్మూలన బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదు.. ప్రతిపక్షాలు కూడా ముందుకువచ్చి ప్రజల్లో చైతన్యం తేవాలని సీఎం చంద్రబాబు కోరారు. చైతన్యం తెచ్చి ఓట్లు కోరాలి తప్ప రాజకీయ లబ్ధి పొందుతామంటే కుదరదని తేల్చిచెప్పారు. ఈగల్ పేరుతో గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా దేగకన్ను వేశామని చెప్పుకొచ్చారు. 26 జిల్లాల్లో నార్కొటిక్ సెల్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈగల్ సెల్స్, టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, స్కూళ్లలో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు సీఎం చంద్రబాబు. మద్యం ఆదాయంలో రెండు శాతాన్ని గంజాయి నిర్మూలనకు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ అమ్మేవారి ఆస్తులు కూడా జప్తు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయిపై పోరాడితే టీడీపీ ఆఫీసుపై దాడి చేశారని గుర్తుచేశారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సినీ సెలబ్రిటీలు ముందుకురావాలని కోరారు. గంజాయి వేరే ప్రాంతాలనుంచి తీసుకువచ్చి ఏపీలో అమ్మినా వదిలేది లేదని సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. " గంజాయికి బానిసలవ్వడం వల్ల కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. గంజాయి వినియోగం వల్ల అసాంఘిక చర్యలకు పాల్పడుతూ జీవితం నాశనం చేసుకుంటున్నారు. మెడికల్ షాపుల్లోనూ మత్తుపదార్థాలు అమ్ముతున్నారు. 'ఈగల్' పేరుతో గంజాయిపై రాష్ట్ర వ్యాప్తంగా డేగ కన్ను ఉంటుంది. ఇప్పటికైనా మారకపోతే రాష్ట్రంలో ఉండేందుకు అర్హత లేదు. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే.. అదే వారికి చివరి రోజు అవుతుంది. 26 జిల్లాల్లో నార్కోటిక్స్ సెల్స్ ఏర్పాటు చేశాం. పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. 1972కు మెసేజ్ పంపితే కాపాడే బాధ్యత తీసుకుంటాం. మద్యం ఆదాయంలో 2శాతం డ్రగ్స్ నిర్మూలనకు ఖర్చు చేస్తాం. రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో 56 డీఅడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి సినీనటులు కూడా ముందుకురావాలి. ప్రజా చైతన్యం కోసం కృషి చేయాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హోం మంత్రి అనిత, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.






## తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు.. ఎల్లో హెచ్చరికలు జారీ

హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలే అవకాశం ఉందని తెలిపింది. వాయువ్య అరేబియన్ సముద్ర తీర ప్రాంతం నుంచి ద్రోణి ఒకటి దక్షిణ గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయువ్య బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టం నుంచి 1.5 - 7.6 కి.మీ మధ్యలో ఏర్పడిందని వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో 3 రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ మూడు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.




చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపుర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల మాడ్ డివిజన్ సీనియర్ కేడర్ అబూజ్‌మడ్ అడవుల్లో ఉన్నారన్న సమాచారంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) నారాయణపుర్, కొండగావ్ ఎస్టీఎఫ్(స్టేట్ టాస్క్ ఫోర్స్) సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. బుధవారం సాయంత్రం నుంచి జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒక ఇన్సాస్ రైఫిల్, ఆయుధంతో పాటు వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

## సీఎం పదవిపై జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు




హైదరాబాద్: తెలంగాణ సీఎం పదవిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మూడేళ్లు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు. ఇవాళ(గురువారం) గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు.

**కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్...** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బీఆర్ఎస్‌లో ఉంటే ఏంటి.. బయటకు వస్తే ఏంటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని.. ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు జగ్గారెడ్డి. తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదనే తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకి ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు. లిక్కర్ స్కాంలో పైసలు పెట్టడానికి కవితకి ఇన్ని వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని జగ్గారెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

## రిజర్వేషన్లు అమలు చేసి.. ఎన్నికలు నిర్వహించాలి



హైదరాబాద్, జూన్ 26: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30వ తేదీ లోపు జరపాలంటూ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలు నిర్వహించడం, బీసీ రిజర్వేషన్లు పెంపుపై రాష్ట్ర ప్రభుత్వాలకే హక్కు ఉందని స్పష్టం చేశారు. సందర్భాన్ని బట్టి 50 శాతం పెంచుకోవచ్చుని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. వీటి పెంపులో 50 శాతం సీలింగ్‌కు అడ్డు లేదన్నారు. ఆ క్రమంలో రాజ్యాంగపరమైన అవరోధాలు సైతం లేవని తెలిపారు. త్వరగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి.. ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు అన్ని పార్టీలు ఓకే చెప్పాయని గుర్తు చేశారు. ఈ అంశాన్ని కేంద్రంపైకి నెట్టాల్సిన అవసరం అయితే లేదన్నారు. కేంద్రంపై నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. సర్పంచ్‌లతోపాటు.. అన్ని ఎన్నికలకు ఇది అప్లై అవుతాయన్నారు. తెలంగాణ జాగృతి నేత, ఎమ్మెల్సీ కవిత ఇటీవల తనను కలిసి.. కొన్ని సలహాలు అడిగిందన్నారు. ఆ క్రమంలో తాను బీసీల కోసం కొట్లాడుతున్నానని చెప్పిందని ఆయన గుర్తు చేశారు. అయితే ఈ అంశంపై కొట్లాడాల్సింది కేంద్రంతో కాదని.. రాష్ట్ర ప్రభుత్వంతో అని ఆమెకు తాను వివరించానని చెప్పారు. ప్రజా భరోసా కార్యక్రమంలో ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం అధిక సంఖ్యలో విద్యార్థులు వచ్చారన్నారు. ఫీజు చెల్లింపు పెండింగ్‌లో ఉండడం వల్ల విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని చెప్పారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించక పోవడంతో క్లాసులు ఎగ్గొట్టి మరీ విద్యార్థులు ఆందోళనకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రెండు, మూడు విడతలుగా బకాయిలు చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన సూచించారు.

సొంత భవనాలు లేని ప్రాంతాల్లో కొత్త భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి సూచించారు. స్టడీ సర్కిల్‌లో విద్యా ప్రమాణాలు సైతం పెంచాలని ప్రభుత్వానికి ఎంపీ కృష్ణయ్య డిమాండ్ చేశారు.




దుబాయి: ఇజ్రాయెల్– ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తొలిసారి స్పందించారు. 12 రోజుల పాటు కొనసాగిన ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌పై తమ దేశమే విజయం సాధించిందని ఆయన ప్రకటించారు. అలాగే, అమెరికా స్థావరాలపై దాడి చేయడం ద్వారా అగ్రరాజ్యానికి గట్టి చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చామని వ్యాఖ్యానించారు. జూన్ 19 తర్వాత తొలిసారిగా ఇరానియన్ స్టేట్ టెలివిజన్‌లో ఖమేనీ వ్యాఖ్యల వీడియో ప్రసారమైంది.

అమెరికా జోక్యం చేసుకోకపోతే ఇజ్రాయెల్ నాశనమవుతుందని అగ్రరాజ్యం భావించడం వల్లే ఈ యుద్ధంలో జోక్యం చేసుకుందన్నారు. అయితే, ఈ యుద్ధం వల్ల అమెరికా ఎటువంటి ప్రయోజనం సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. "ఇస్లామిక్ రిపబ్లిక్ విజయం సాధించింది. అమెరికాను చెంపదెబ్బ కొట్టింది. సోమవారం ఖతార్‌లో అమెరికా కీలక స్థావరాల్లో ఒకటైన అల్ ఉదీద్ వైమానిక స్థావరంపై దాడి చేసి నష్టం కలిగించింది. ఇందులో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా కేంద్రాలను యాక్సెస్ చేయగలదు. అవసరమనుకుంటే దాడులూ చేయగలదు. భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలు పునరావృతం కావొచ్చు. ఏదైనా దురాక్రమణ జరిగితే.. శత్రువు కచ్చితంగా భారీమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది" అని ఖమేనీ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి రోజులు గడుస్తున్నా అలీ ఖమేనీ బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడంతో ఆయన ఎక్కడ ఉన్నారంటూ వస్తోన్న వార్తల నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు.




పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పేందుకు గాను సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో దాయాది దేశానికి నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో పశ్చిమ నదుల నుంచి నీటిని మరింత సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్న భారత్.. సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి సారించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు చర్చలు తుది దశలో ఉన్నాయన్న విషయాన్ని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమవుతోందని, ఏడాదిలో పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అయితే, ఈ నదుల నుంచి భారత్ వాటాను మరింత సద్వినియోగం చేసుకునేందుకు అనేక ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని సంబంధిత అధికారి ఒకరు పేర్కొన్నారు. పడమరవైపు ప్రవహించే నదుల్లో ఒకదాని నుంచి నీటిని పంజాబ్, హరియాణాకు మళ్లించే అవకాశం కూడా పరిశీలనలో ఉందన్నారు. సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు మాత్రమే ఉన్నాయి. భారత్, పాక్ మధ్య 1960, సెప్టెంబరు 19న జరిగిన ఒప్పందం ప్రకారం ఈ నదీవ్యవస్థ మొత్తం నీటిలో 20% భారతదేశం, 80% పాకిస్థాన్ వినియోగించుకోవాలి. అయితే, మన దగ్గర వీటి నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం సవాలుగా మారింది. డ్రై సీజన్‌లో కొంతమేరకు నిల్వ చేస్తున్నప్పటికీ.. వర్షాకాలంలో నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంది. దీంతో అధిక నీరు వస్తే అది దిగువన పాకిస్థాన్‌కే పోతోందని సంబంధిత అధికారి పేర్కొన్నారు. అంతేకాకుండా ఒప్పందం అమలు వల్ల వరదల సమయాల్లో కొన్ని సవాళ్లు ఎదురయ్యేవన్నారు. కానీ, ప్రస్తుతం రిజర్వాయర్ నిర్వహణపై ప్రముఖంగా దృష్టి సారించామన్నారు. గతంలో పాక్ వ్యతిరేకించిన కిషన్‌గంగా ఇప్పటికే పూర్తికాగా.. రాట్లే ప్రాజెక్టు నిర్మాణం కూడా ముమ్మరంగా కొనసాగుతోందని చెప్పారు.




## 'మాదకద్రవ్యాలు వద్దు.. జీవితం ముద్దు'.. నెక్లెస్ రోడ్‌లో ర్యాలీ

హైదరాబాద్: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నెక్లెస్ రోడ్ జలవిహార్ వద్ద 'మాదకద్రవ్యాలు వద్దు.. జీవితం ముద్దు' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, పలువురు అధికారులు పాల్గొన్నారు. నగరవాసులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని సందడి చేశారు.

## సీఎం రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ



హైదరాబాద్: ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో.. భాజపా పరువుకు భంగం కలిగేలా రేవంత్‌రెడ్డి మాట్లాడారని వాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో ప్రజాప్రతినిధుల కోర్టులో క్రిమినల్ డిఫమేషన్ కేసు నమోదైంది. కింది కోర్టులో ఉన్న కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి తరపు న్యాయవాది హైకోర్టును కోరారు. బహిరంగసభలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఆయన రాజకీయ ప్రసంగం మాత్రమే చేశారని తెలిపారు. జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే నెల 2కి వాయిదా వేసింది.




## అమ్మవారికి తొలి సారెను సమర్పించిన ఈవో శీనానాయక్ దంపతులు


ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం నుంచి నెల రోజులపాటు వారాహి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఈవో శీనానాయక్ దంపతులు తొలి సారెను సమర్పించారు. మేళతాళాలతో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి సారే సమర్పించారు. పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, చలిమిడి, గోరింటాకు అమ్మవారికి శేష వస్త్రాలను సమర్పించారు.

**అమ్మవారికి సారె సమర్పించడం సంతోషంగా ఉంది..** ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మీడియాతో మాట్లాడారు. తమ చేతుల మీదుగా అమ్మవారికి సారె సమర్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని తమ పుట్టింటికి రమ్మని వేడుకుంటూ సారె సమర్పించామన్నారు. ఆషాఢ మాసంలో నెల రోజులపాటు అంగరంగ వైభవంగా సారే సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ నుంచి అమ్మవారికి ఈనెల 29వ తేదీన బంగారు బోనం సమర్పిస్తారని చెప్పుకొచ్చారు. ఈ మాసంలోనే అమ్మవారికి శాఖాంబరి ఉత్సవాలు జరుగుతాయన్నారు. జులై 8 , 9, 10 తేదీల్లో శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈరోజు నుంచి నెల రోజులపాటు ఇంద్రకీలాద్రిపై వారాహి ఉత్సవాలు జరుగుతాయని ఈవో శీనానాయక్ వెల్లడించారు.

**నెల రోజులపాటు ఉత్సవాలు..** కాగా, ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీ. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ దుర్గమ్మకు భక్తులు సారె సమర్పిస్తారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. మూలవిరాట్ దర్శన అనంతరం ఉత్సవమూర్తికి సారెను సమర్పిస్తారు. కాగా, వైదిక కమిటీ సూచనల మేరకు హోమ గుండాలు, భక్తులు కూర్చునేందుకు తివాచీలు ఏర్పాటు తదితర అంశాలపై ఈవో శీనా నాయక్ ఇప్పటికే అధికారులకు పలు సూచనలు చేశారు. వారాహి అమ్మవారి నవరాత్రుల గురించి ప్రచారం చేసి విజయవంతం చేయాలని పలు విభాగాలకు ఆదేశాలిచ్చారు. వారాహి ఉత్సవాలు గురువారం (26వ తేదీ) నుంచి జులై 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.

# అజరామరాలు...కాళ్ళకూరి నాటకాలు

## - జూన్ 27...కాళ్ళకూరి నారాయణరావు వర్ధంతి




తెలుగు నాటక రంగ చరిత్రలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న నాటకాలు... వరవిక్రయము, చింతామణి. ఆ రెండూ తెలుగు వైభవం చాటే నాటకాలు. రెండూ కూడా చలన చిత్రాలుగా రూపొంది ప్రజాదరణ పొందడం విశేషం. వరవిక్రయము అప్పటి సాంఘిక దురాచరాన్ని ఎండగడితే " చింతామణి" సజావుగా నడిచే జీవితం ఎలా నాశనం అయిపోవచ్చో అద్దం పడుతుంది. ఆ నాటకాలను రచించి తెలుగు వారి హృదయాలలో చిరకాలం నిలచి పోయారు కాళ్ళకూరి నారాయణరావు. నారాయణ రావు కేవలం నాటక రచయిత మాత్రమే కాదు. బహుకళా ప్రపూర్ణులు. సంఘ సంస్కర్త, మొట్టమొదటి ప్రచురణ కర్త, హరికథకులు, కవి, నటులు, నాటకకర్త, పత్రికాధిపతి, మనోరంజని అనే పత్రికను నడిపారు. నాటి సమాజంలో ఉన్న దురాచారాలను ఎత్తి చూపించి, నాటకాలుగా మలచి, ప్రదర్శించడమే కాక, సంఘ సంస్కరణను ఆచరణలోనూ చూపించిన మహనీయుడు కాళ్ళకూరి నారాయణరావు. చక్కన్ని ఒరవడి, సంస్కారం, అధర్మాన్ని నిర్భయంగా ఎదుర్కొనే శక్తి, ధైర్యం, సామాజిక స్పృహ, నైతిక విలువలపట్ల విశ్వాసం, బాధ్యతలు విస్మరించిన వారిని వెన్ను తట్టి లేపడం, సాంఘిక దురాచారాలపై ధ్వజం ఎత్తడం, ఇవన్ని కలిగలిపి రూపు దిద్దుకున్న వ్యక్తిత్వం కాళ్ళకూరి నారాయణ రావుది. ఆ కాలంలో కులాంతర వివాహం చేసుకోవడమంటే పెద్ద సాహసం. కళావంతురాలిని పెళ్లి చేసుకున్నారు. తనను కులం నుండి వెలివేసినా, లెక్కచేయని సాహసి, కవితారూప తపస్వి, బహు ప్రతిభా తేజస్వి. సంఘంలోని దురాచారాలను నాటకరాజాలుగా సృష్టించారు. చింతామణి, వరవిక్రయం, మధుసేవ మొదలైన ఆయన విరచిత నాటకాలు అజరామరమైనవి. కాళ్ళకూరి నారాయణరావు (ఏప్రిల్ 28, 1871 – జూన్ 27, 1927) నాటకకర్త, సంఘసంస్కర్త, ప్రథమాంధ్ర ప్రచురణ కర్త, జాతీయవాది, ఛాయా గ్రహణ వాద్యాదురంధరుడు, 'మహాకవి' బిరుదాంకితులు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లా, వీరవాసరము మండలం, మత్స్యపురి గ్రామంలో 1871, ఏప్రిల్ 28 న బంగారురాజు, తల్లి అన్నపూర్ణమ్మలకు జన్మించారు. అయన రచించిన నాటకాలలో చింతామణి (1921), వర విక్రయం (1923), మధుసేవ (1926) బాగా ప్రసిద్ధిచెందినవి. వాటిని చాలా మంది నాటకాలుగా ప్రదర్శించారు. తెలుగు సినిమాలుగా కూడా నిర్మించబడి మంచి విజయం సాధించాయి. తెలుగు నాటక రంగంలో పది అత్యుత్తమ నాటకాలలో చింతామణి ఒకటి. ఆ నాటకం చాలా ప్రసిద్ధి చెందింది. 1956లో పి.ఎస్. రామకృష్ణరావు దర్శకత్వంలో ఎన్టీఆర్, భానుమతి ప్రధాన పాత్రలుగా భరణి స్టూడియోస్ బ్యానర్ పై సినిమాగా నిర్మించారు. "చింతామణి " నాటకం తెలుగు నాటక రంగాన్ని ఓ ఊపు ఊపింది. ఒక వ్యసనం వ్యక్తిని ఎంత హీన స్థితికి దిగజారుస్తుందో, పర్యవసానాలు ఎంత దారుణముగా ఉంటాయో ప్రతిబింబించారు. ఆ నాటకానికి కనీ వినీ ఎరుగని ఆదరణ లభించింది. ఆదాయానికి లోటులేకండా ఇంకా మరిన్ని నాటకాలు సమర్పించడానికి వీలుగా బోళ్ళు డబ్బు తెచ్చి పెట్టింది. చింతామణి నాటకం వేశ్యావృత్తికి వ్యతిరేకంగా ఉద్యమం జరుగుతున్న కాలంలో రాయబడింది. వేశ్యావృత్తిని నిరసిస్తూ కాళ్లకూరి రచన ఈ నాటకం. ఆనాడు చింతామణిని ప్రదర్శించని నాటక సమాజమంటూ లేదు. ఈ నాటకంలోని పద్యాలు ప్రజల నోటిలో తాండవించాయి. సంస్కార భారతి వారు ఈ నాటకాన్ని ఇటీవల కాలం వరకు ప్రదర్శించారు. ఆ నాటకం బహుళ ప్రాచుర్యం పొందింది. నేటికీ విజయవంతంగా ప్రదర్శిత మవుతోంది. గురజాడ కాలంలో "కన్యాశుల్కం", తరువాత "వరవిక్రయం" అంతటి ఘనత లభించింది. రెండూ తెలుగు నాటక రంగ ఇతిహాసంలో ఆణిముత్యాలే. కన్యాశుల్కం అప్పటి సాంఘిక దురాచారాన్ని ఎదుర్కొంటే, వర విక్రయం ఆ కాలం సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతూ ఆ సాంఘిక దుస్థితిని ఎండకడుతూ వచ్చింది. గురజాడ " కన్యాశుల్కం" సాంఘిక దురాచారాలని ఖండిస్తూ, మార్పుకు అంకురార్పణ చేస్తే, కాళ్ళకూరి నారాయణరావు గారి సాంఘిక నాటకం – వరవిక్రయం (1921), అప్పటి సమకాలీన పరిస్థితులకు అద్దం పడుతూ అనర్ధ హేతు చర్యలు వ్యతిరేకిస్తూ, సాంఘిక ధర్మానికి పాటుపడింది. ఆ కాలంలోని సామాజిక సమస్యలకు తనదైన విచార ధారతో విశ్లేషించి, లోకం తీరును వరవిక్రయం రూపంలో మలిచారు. పెళ్ళి చేసుకోవడానికి భారీగా కట్న కానుకలు వసూలు చేస్తూ, వివాహం ఐదు రోజులు జరిపించుకొని, వైభవోపేతముగా సేవలు చేయించుకోవడం, పిల్ల తల్లి తండ్రులను అప్పుల ఊబిలోకి నెట్టి వేయడం వంటి పరిస్థితులను ప్రతిఘటించడానికి, నైతిక భాద్యతలను నిర్వర్తించేందుకు పిలుపునిచ్చారు. సి.పిల్లయ్య 1939 లో వరవిక్రయము సినిమా తీసారు. భానుమతి రామకృష్ణ ఆ సినిమాలో కాళింది గా నటించారు. ఈ చిత్రం ద్వారా ఆమెకు మంచి పేరు వచ్చింది. సింగరాజు లింగరాజుగా బలిజేపల్లి లక్ష్మీకాంత కవి గారు వేశారు. "నటన అంటే అది'' అని అనిపించు కున్నారు. ఆయన రచనలలో...మద్యపానం వలన కలిగే దుష్పరిణామాలను ఎత్తి చూపిన నాటకం మధుసేవ. అలాగే రాజరాజ నరేంద్రుని కుమారుడని పేర్కొనే సారంగ ధరునికీ, చిత్రాంగికీ నడుమ జరిగిన కథ చిత్రాభ్యుదయం. అంతేగాక పద్మ వ్యూహం (1919) , సంసార నటన (1974 కళలో ధారవాహికగా ప్రచురితం) మొదలైన నాటకాలు కారణంలేని కంగారు (1920), దసరా తమాషాలు (1920), లుబ్ధగ్రేసర చక్రవర్తి (1906), రూపాయి గమ్మత్తు (1920), ఘోరకలి (1921), మునిసిపల్ ముచ్చట్లు (1921), విదూషక కపటము (1921) వంటి ప్రహసనాలు ఆయన రచించారు. కాళ్ళకూరి 1919 లో రాసిన " పద్మవ్యూహం" నాటకంలో పద్యాలతో ఉన్న సంభాషణలను పొందు పరిచారు. ప్రముఖ రంగస్థల నటులు గుమ్మడి గోపాలకృష్ణ...కాళ్లూరి శిష్యులు కాగా, కొత్తె వెంకటాచారి నారాయణరావు... నాటకాల మీద పి. హెచ్.డీ చేశారు. కాళ్లూరి 1927, జూన్ 27న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సాహితీవేత్తలకు మార్గదర్శకుడు బంకించంద్రుడు


## - జూన్ 27...బంకించంద్ర ఛటర్జీ జయంతి



బంకిం చంద్ర చటోపాధ్యాయ పేరు తెలియని భారతీయుడు ఉండడు అంటే అతిశయోక్తి కాదు. వందేమాతరం గీత రచయితగా ఆయన యావత్భారతానికి సుపరిచితులే. ఆయన రచయిత, కవి, పాత్రికేయుడు. ఆయన వందే మాతరం మొదట సంస్కృత స్తోత్రంలో భారత దేశాన్ని మాతృదేవతగా వ్యక్తీకరించారు. ఆ గీతం ద్వారా భారత స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో కార్యకర్తలను ప్రేరేపించారు. బంగ్లా భాషలోని అగ్ర రచయితల్లో ఒకరుగా భావించే బంకిం చంద్ర చటోపాధ్యాయ తన రచనలతో కేవలం బంగాలీ సమాజాన్నే కాదు, మొత్తం దేశాన్నే ప్రభావితం చేశారు. ఆధునిక భారతీయ సాహిత్య చరిత్రలో బంకించంద్ర చటర్జీ అగ్రగణ్యులలో ఒకరు..ఒక్క బెంగాలీ సాహిత్యాన్నే కాక సమస్త భారతీయ సాహిత్యాలను ఆయన పంతొమిదో శతాబ్ది ఉత్తరార్ధంలో, ఇరవయ్యో పూర్వార్ధంలో అంటే సుమారు ఒక శతాబ్దం పాటు ప్రభావితం చేసారు. ప్రపంచ సాహిత్య చరిత్రలో జాతుల విముక్తి పోరాటాలలో, స్వాతంత్ర్య సమర చరిత్రలో ఒక మహా కవి రచించిన దేశభక్తి గీతం తన జాతి జనులను ఉత్తేజపరిచి, ఉద్యమింప చేసిన సంఘటన, బంకించంద్రుడి విషయంలో లాగ మరొక దేశంలో, మరొక దేశ చరిత్రలో చోటు చేసు కోలేదనేది వాస్తవం. బంకిం చంద్ర చేత ప్రచురితమైన ఆయన తొలి రచన బంగ్లా కాదని, ఆంగ్లమని చాలా తక్కువ మందికి మాత్రమే తెలుసు. దాని పేరు రాజ్‌మోహన్స్ వైఫ్. ఆయన మొదటి బంగాలీ రచన దుర్గేష్ నందిని. ఆయన ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా భారత దేశంలో ప్రథమ స్వతంత్ర సంగ్రామం జరిగిన 1857లోనే బీఏ ఉత్తీర్ణులు అయ్యారు. బెంగాల్‌లో మొదటగా బి.ఏ డిగ్రీ పొందిన వ్యక్తి ఈయనే కావడం విశేషం. 1869లో ఆయన లా డిగ్రీ అందుకున్నారు. స్వస్థాన వేష భాషల పట్ల గౌరవాభిమానాలు కలవాడు. ఇరవై ఏళ్ళు నిండకముందే 'లలిత ఓ మానస్' అనే కవితా సంపుటి రచించాడు. దుర్గేశ్ నందిని, కపాల కుండల, మృణాళిని, దేవీ చౌధురాణి మున్నగు 15 నవలలు ఆయన రాశారు. బంకించంద్ర ఛటర్జీ (27 జూన్, 1838 – 8 ఏప్రిల్, 1894) రచన వందేమాతరం గీతాన్ని ఆనంద్ మఠ్ అనే నవల నుండి సంగ్రహించారు. ఈ గీతం భారత స్వతంత్ర సంగ్రామంలో సమర శంఖంగా పనిచేసింది. దేశమంతటా ప్రతిధ్వనించిన నినాద మయింది. దేశాన్ని మాతృమూర్తిగా సంబోధిస్తూ, దేశభక్తిని ప్రబోధిస్తూ, 'వందేమాతరం' గీత రచన చేసిన ర తర్వాత దానిని 'ఆనంద్‌మఠ్' నవలలో పొందు పరిచారు. ఈ నవల వివిధ భారతీయ భాషలలో నికి అనువదించ బడడం వలన వందేమాతరం గేయం దేశవ్యాప్తంగా ప్రచారాన్ని పొందింది. ఈ గేయాన్ని బహిరంగంగా గానం చేయటాన్ని నాటి ప్రభుత్వం నిషేధించింది. రవీంద్రుడు బాణీకట్టి నిషేధాజ్ఞలను ఉల్లంఘించి 1896 కాంగ్రెస్ సభలలో గానం చేశాడని చెపుతారు. భారతదేశ స్వాతంత్ర్య ఆకాంక్ష ప్రజల్లో చైతన్య వంత మవుతున్నప్పుడు వందేమాతరం గీతం ఆ చైతన్యాన్ని వేగవంతం చేసింది. సమరోత్సాహాన్ని త్వరితం చేసింది. ఆయన సాహిత్య ప్రతిభ బహు ముఖమైనది. నవలలు, వ్యాసరచన, సాహిత్య విమర్శ, వ్యాఖ్యాన రచనలో బంకించంద్ర చటర్జీ వంగ సాహిత్యంలో కొత్త వరవడి సృష్టించారు. నవలా రచనలో తక్కిన ఆధునిక భారతీయ సాహిత్యాలకు కూడా ఆయనే దారి చూపారు. అంతరాంతరాలలో ఆయనకు పూర్వ భారతీయ సంస్కృతి పట్ల, హిందూ మతాచార విశ్వాసాల పట్ల అభిమానం ఉండేదని సాహిత్యవేత్తల అభిప్రాయం. మానవుడు చేరుకోగల ఉదాత్త శిఖరాలను బంకించంద్రుడి పాత్రలు అధిరోహిస్తాయి. అనూహ్యమైన, మానవాతీతమైన త్యాగాన్ని అయన పాత్రలు ప్రకటిస్తాయి. బంకించంద్రుడిలో మాతృ దేశాభిమానం, దేశ భక్తి అనంతం, అపూర్వం. ఆనంద మఠంలో ఆయన చిత్రించిన పాత్రలు ఎటువంటి త్యాగానికైన, సాహసానికైన ప్రతీకలుగా ఉన్నాయి. ఆయన చారిత్రిక పాత్రలను, పూర్వ చారిత్రిక వైభవ సన్నివేశాలను, సౌందర్య భావకతను, ఆలంబనం చేసుకొని రచనలు సాగించాడు అని కొందరు సాహితీవేత్తల భావన. ఆయన సృష్టించిన స్త్రీ పాత్రలు సాహసం, నిర్భీకత, ప్రణయోద్వేగం, మానవానుభూతుల మధ్య అవి జీవిస్తాయి. అటువంటి స్త్రీ పాత్రలు పురుషులకు ఏమాత్రం తీసిపోరు అని వంగ సాహిత్య విశ్లేషకులు, విమర్శకులు, బంకించంద్ర ఛటో పాధ్యాయను ప్రసంసించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అసమాన యోధుడు జనరల్ మానెక్‌షా

## - జూన్ 27...భారతీయ సైన్య మొదటి ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా వర్ధంతి




ఆయన యుద్ధ వీరుడు. సాహస సైనికుడు. సమర్ధ నాయకుడు. అయిదు యుద్ధాలలో పాల్గొని, తుపాకీ గుళ్ళు శరీరంలో దిగినా, విశ్రమించని పోరాట యోధుడు. పాకిస్తాన్ యుద్ధ విజయ సారథి. ఆయనే ధైర్య సాహసాలకు మారు పేరుగా నిలిచిన భారత సైనికుడు, జాతీయ హీరో ఫీల్డ్ మార్షల్ మానెక్‌షా. అయన పూర్తి పేరు శాం హొర్ముస్‌జీ ఫ్రేంజీ జెమ్‌షెడ్జీ మానెక్ షా (ఏప్రిల్ 3, 1914 – జూన్ 27, 2008). 1971లో పాకిస్తాన్తో యుద్ధంలో భారత్‌కు అతిపెద్ద సైనిక విజయాన్ని సాధించి పెట్టిన ఆయన బంగ్లాదేశ్ ఆవిర్భావానికి అద్యుడయ్యారు. 1914 ఏప్రిల్ 3వ తేదీన అమృతసర్ లోని పార్శీ దంపతులకు మానెక్‌షా జన్మించారు. ఆయన తల్లిదండ్రులు గుజరాత్ రాష్ట్రంలోని వల్సాద్ అనే చిన్న పట్టణం నుంచి అమృతసర్, పంజాబ్ రాష్ట్రంకు వలస వెళ్ళారు. అమృతసర్, నైనిటాల్‌లలో పాఠశాల విద్య పూర్తయ్యాక డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమీలో క్యాడెట్‌గా తొలి బ్యాచ్‌లో మానెక్ షా చేరారు. 1934లో ఆయన సైన్యంలో రెండో లెఫ్టినెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. జూన్ 7, 1969 న జనరల్ కుమార మంగళం నుండి 8వ సైనిక దళాల ప్రదానాదికారిగా బాధ్యతలు స్వీకరించి 15, జనవరి 1973 న పదవీ విరమణ చేసారు. బ్రిటిష్ పాలనా కాలం మొదలుకొని నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో సేవలు అందజేసిన శాం మానెక్‌షా– రెండవ ప్రపంచ యుద్ధంలోను, భారత స్వాతంత్ర్యానంతరం చైనా, పాకిస్థాన్‌లతో జరిగిన మూడు యుద్ధాల సందర్భంగాను ప్రదర్శించిన వ్యూహ చతురత, బుద్ధి కుశలత అమోఘమైనవి. రెండో ప్రపంచ యుద్ధం జరుగు తున్నప్పుడు జపాన్ ఆక్రమిత దళాలను తిప్పి కొట్టేందుకు ఉద్దేశించిన సైనిక విభాగం అధిపతిగా బర్మాలో ఆయన ప్రాణాలొడ్డి పోరాడారు. కడుపులోకి ఏడు గుళ్లు దూసుకుపోయి తీవ్రంగా గాయపడ్డారు. అపూర్వ ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైనికులకు ఇచ్చే అత్యున్నత పతకం 'మిలిటరీ క్రాస్'ను మృతులకు ప్రకటించ రాదన్నది నియమం. మానెక్‌షా బతికి బట్టకట్టక పోవచ్చునని భావించిన నాటి మేజర్ జనరల్ డి.టి.కోవన్, తన 'మిలిటరీ క్రాస్ రిబ్బన్'ను తక్షణం మానెక్‌షాకు ప్రదానం చేశారు. అదృష్టవశాత్తు మృత్యుముఖం లోంచి బయట పడిన మానెక్‌షా, మరోసారి బర్మాలో జపాన్ సైనికులను ఢీకొన్నారు. మళ్ళీ గాయ పడినప్పటికీ వెన్ను చూపలేదు. జపాన్ సైనికులు లొంగిపోయాక, 10 వేల మందికిపైగా యుద్ధ ఖైదీలకు పునరావాసం కల్పించడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. 1947లో దేశవిభజన, 1947–48లో జమ్ము కాశ్మీర్‌లో సైనిక చర్యల సందర్భంగా ఆయన తన పోరాటపటిమను మరోమారు లోకానికి చాటి చెప్పారు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం ఆయన వ్యూహ నైపుణ్యానికి, దీక్షాదక్షతలకు అద్దం పట్టింది. ఆ యుద్ధంలో పాక్ చిత్తుగా ఓడిపోవడమే కాదు, 45,000 మంది పాక్ సైనికులు, మరో 45,000 మంది పౌరులు యుద్ధ ఖైదీలుగా పట్టుబడ్డారు. తరువాత బంగ్లా ఆవిర్భావానికి దోహద పడిన సిమ్లా అంగీకారం కుదర్చడంలోనూ ఆయనది కీలక భూమికే. ఆయన సమర్ధ సారథ్యం దేశసైనిక దళాల్లో సరికొత్త విశ్వాసాన్ని, ఉత్సాహాన్ని, ఉత్తేజాన్ని నింపింది. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం 1973 జనవరిలో మొట్టమొదటి ఫీల్డ్‌మార్షల్‌గా పదోన్నతి కల్పించి, ఆయనను సముచిత రీతిలో గౌరవించింది. 1971 ఆరంభంలో తూర్పు పాకిస్థాన్ నుంచి పెద్దయెత్తున శరణార్థులు భారత్‌లోకి వస్తున్న సమస్యపై ఆ ఏడాది ఏప్రిల్ 27న జరిగిన క్యాబినెట్ సమావేశానికి త్రివిధ దళాధిపతుల కమిటీ అధ్యక్షుడిగా ఉన్న మానెక్‌షానూ ఆహ్వానించారు. ఈ సమస్యని పరిష్కరించడానికి తక్షణం సైనికులని పంపాలన్న ప్రధానమంత్రి ఇందిరాగాంధీ నిర్ణయాన్ని వాతావరణం అనుకూలంగా లేదన్న కారణముతో ఒప్పుకోకుండా, వెంటనే యుద్ధానికి దిగక తప్పదంటే మానసిక లేదా శారీరక అనారోగ్య కారణాలపై రాజీనామా చేయడానికీ తాను సిద్ధమే అనడం ద్వారా తన నాయకత్వ లక్షణాలని చాటిన ఈయన, తన సమర్థ వాదనతో క్యాబినెట్‌ను ఒప్పించి 1971 డిసెంబరులో, అన్ని విధాలా సానుకూల పరిస్థితుల్ని చూసుకొని పాక్‌పై పూర్తిస్థాయి యుద్ధాన్ని ప్రారంభించి, అద్భుత విజయం సాధించి చూపి తన నిర్ణయం ఎంత సరియినదో నిరూపించి వ్యూహ కర్తగా ఆయన చతురతను చాటిచెప్పిన వైనం అద్వితీయం. మీ యుద్ధ విమానాలు నాశనం చేశాం, మిమ్మల్నందరిని మా సైనికులు చుట్టూ ముట్టి వున్నారు. లొంగిపోక పోతే నిర్ధాక్ష్యంగా చంపేస్తాం అంటూ పాకిస్తాను సైనికులని కఠినంగా హెచ్చరించి శత్రువులని లొంగదీసుకున్న గొప్ప తనం ఆయనకే సొంతం. శాం మానెక్‌షా గొప్ప వక్త కూడా. ముక్కు సూటిగా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి. భారత సమాజాన్ని నాయకత్వ కొరతే పట్టి పీడిస్తోందంటూ ఒక సందర్భంలో ధైర్యంగా దాపరికం లేకుండా చెప్పారు. అన్ని రంగాల్లో నాయకత్వ కొరతే దేశంలోని అస్తవ్యస్త పరిస్థితులకు కారణమని స్పష్టం చేశారు. వృత్తిపరమైన సామర్థ్యం, విజ్ఞానం, నిజాయతీ, నిష్పాక్షికత, ధైర్యం, విశ్వసనీయత, ప్రజా సమస్యల పరిష్కారం పట్ల నిబద్ధత – ఇవీ నాయకుడికి ఉండాల్సిన లక్షణాలని వివరించి, లక్షలమంది సైనికులకు, సైనికులుగా చేరాలనుకున్న వారికే కాకుండా సామాన్యులకి కూడా స్ఫూర్తిగా నిలిచారు. భారత్‌కు ఎన్నో విజయాలను అందించిన యుద్ధ సేనాని మానెక్ షా జూన్ 26, 2008 గురువారం అర్ధరాత్రి 94ఏళ్ల వయస్సులో మృతి చెందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# బోనాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీక



గ్రామదేవతల పూజలకు ఉద్దేశిత మైనది, తెలుగు జానపదుల సంస్కృతిక వైభవానికి ఉత్తుంగ శిఖరంలా నిలుస్తున్నది బోనాల పండుగ. ఇది తెలంగాణ సాంప్రదాయాల ప్రత్యేకతను, విశిష్టతను చాటిచెప్పే పండగ. జూలై లేదా ఆగస్టు మాసంలో వచ్చే ఆషాడం వచ్చిందంటే, తెలంగాణ లోని అన్ని ప్రాంతాలలో జాతర సందడి నెలకొంటుంది. ఎక్కడ చూసినా భక్తిశ్రద్ధలతో మహిళలు సమర్పించే బోనాలే దర్శన మిస్తాయి. ప్రాచీన కాలంలో ఋతువులు మారి, ఆషాడంలో వర్షాలు కురిసి, వాతావరణ మార్పులతో, కలరా ప్లేగు లాంటి మహమ్మారి వ్యాధులు సంక్రమించే క్రమంలో, వైద్య సౌకర్యాలు లేని స్థితిలో, దేవతలను కొలవడం జరిగేది. 1813 లో భాగ్యనగరంలో వేలాది మంది గురైన సందర్భంలో, మహంకాళిని కొలవడం వల్ల వ్యాధి తగ్గుముఖం పట్టిందని, అప్పటి నుండి రాష్ట్ర రాజధాని లోనూ, బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు వాడుక. గోల్కొండ కోటలో జగదాంబికా ఆలయంలో, అబుల్ హసన్ తానీషా పాలనా సమయంలో, ప్రధాని సైనికాధికారులుగా ఉన్న అక్కన్న, మాదన్నల కాలంలో, బోనాల ఉత్సవాలు ప్రారంభమైనట్లు కథనాలు. 1908లో మూసీకి వరదలు వచ్చినప్పుడు, నిజాం మీర్ మెహబూబ్ అలీ ఖాన్, మంత్రి కిషన్ ప్రసాద్ ను, ఏమి చేయాలని సలహా కోరగా, ఇది అమ్మవారి ఆగ్రహం ఫలితమేనని, ఆమెను శాంతింప చేయడానికి, పూజలు నిర్వహించాలని మంత్రి, ప్రభువుకు వివరించిన సందర్భంలో, నిజాం ప్రభువు లాల్ దర్వాజా సింహ వాహిని మహంకాళి అమ్మవారికి పసుపు, కుంకుమ, గాజులు, ముత్యాలు, పట్టు వస్త్రాలు, సమర్పించి పూజలు నిర్వహించిన ఫలితంగా, వరదలు తగ్గుముఖం పట్టాయని చెబుతారు. తర్వాత కాలంలో, స్థానికులు సదరు ఆలయాన్ని పునరుద్ధరించి, 1968లో కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురువులచే, విగ్రహ ప్రతిష్ట చేయించడం జరిగింది. 7వ నిజాం కాలం నుండి, సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారి ఆలయం లో, బోనాల ఉత్సవాలు జరుగు తున్నాయి. హైదరాబాద్ లో ప్రస్తుతం వందలాది చిన్న, పెద్ద ఆలయాలలో ఉత్సవాలు కొనసాగు తున్నాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భావ అనంతరం, తెలంగాణ సాంస్కృతిక వారసత్వ అనుసరణీయమైన పండగైన బోనాలను, "రాష్ట్ర పండుగ"గా నిర్వహిస్తున్నారు. "భోజనం" ప్రకృతి కాగా "బోనం" వికృతి. జానపదులు తమకు ఇష్టమైన గ్రామ దేవతలకు సమర్పించే "నివేదనలే బోనాలు". పోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, అంకాలమ్మ, డొక్కలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ, నాయకమ్మ, మొదలైన పేర్లతో పిలిచే దేవతల గుళ్ళను, ఈ సందర్భంగా దేదీప్య మానంగా అలంకరిస్తారు. బోనాన్ని కొత్త కుండలో వండి, దానితోపాటు పాలు, పెరుగు, బెల్లం, కొన్ని చోట్ల ఉల్లిపాయలతో కలిపిన బోనాన్ని, మట్టి లేక రాగి కుండలో నుంచి తమ తలపై ఉంచుకొని, ఆటగాళ్ళతో, డప్పుల తదితర వాద్యాలతో, గుడికి చేరుకుంటారు. ఈ బోనాల కుండలను, చిన్న చిన్న వేప రెమ్మలతో, పసుపు, కుంకుమ లేక తడి తెల్ల ముగ్గుతో, అలంకారం చేసి, దానిపై దీపాన్ని ఉంచుతారు. ఆషాడ మాసంలో అమ్మవారు తన పుట్టింటికి వెళుతుందని గ్రామీణుల విశ్వాసం. అందుకే తమ కూతురు తమ సొంత ఇంటికి లేదా ఆమె పుట్టింటికి వచ్చిన భావనతో ప్రేమానురాగాలు, పుట్టి పడగా, భక్తిశ్రద్ధలను మేళవించి, బోనాలను నివేదిస్తారు. గత కొంత కాలంలో వేరు వేరు ప్రాంతాలలో దీనిని "పెద్ద పండగ", "ఊర పండగ" లాంటి పేర్లతో పిలిచేవారు. తర్వాతి కాలాన బోనాలుగా పిలుస్తున్నారు. పూర్వకాలంలో దుష్టశక్తులను పారద్రోలేందుకు, ఆలయ ప్రాంగణం బలి ఇవ్వడం జరిగేది. నేడు యాటల పేరున మేకలను లేదా కోడిపుంజులను బలి ఇవ్వడం ఆచారమైంది. పండుగ సందర్భంగా, స్త్రీలు కొత్త బట్టలు, పట్టు చీరలు, నగలు ధరించి, బోనాలు మోస్తూ వెళుతుండగా, మోసుకెళ్తున్న కొందరికి పూనకం (అమ్మవారు ఆ వహిస్తారని నమ్మిక) రాగా, వారిని శాంతింప చేసేందుకు, ఆలయ సమీపాన వారి పాదాలపై నీళ్ళు కుమ్మరిస్తారు. అమ్మవారి ఇ సోదరుడైన పోతరాజును, ప్రతిబింబించే ఒక బలిష్టకాయుడు, ఒంటిపై పసుపు, నుదుటిపై కుంకుమ, కాళ్ళకు గజ్జలు కలిగి, చిన్న ధోవతి ధరించి, వాద్య ధ్వనులకు అనుగుణంగా నర్తిస్తాడు. పూజారంభకునిగా, భక్త జన రక్షకునిగా భావించబడతాడు. కొరడాలతో కొట్టుకుంటూ, వేపాకులను చుట్టుకుని, పూనకం వచ్చిన భక్తులను, అమ్మవారి సన్నిధికి తీసుకెళ్తాడు. అమ్మవారికి నివేదన అనంతరం విందు భోజనాలు ఆరగిస్తారు. ఈ కార్యక్రమంలో జాతర అనంతరం, పోతరాజుకూ పూనకం రాగా, వికృతమైన ఆగ్రహాన్ని శాంత పరచుటకు, కొమ్ములున్న మేకపోతును అందించగా, పోతరాజు తన దంతాలతో, మేక తల మొండెం వేరు చేసి, పైకి ఎగరవేస్తారు. పండుగ మొదటి రోజు నుండి, చివరి నిమజ్జనం దాకా, అత్యంత భక్తి తత్పరతతో వాతావరణం ఉంటుంది. బోనాల సమర్పణ వల్ల, ప్రధానంగా దేవతలు శాంతించి, అంటురోగాల బారిన పడకుండా కాపాడుతానని భక్తుల విశ్వాసం. బోనాల ఉత్సవాలు జూన్ 26వ తేదీన ప్రారంభమవుతాయి. అదే రోజున గోల్కొండ జగదాంబికా అమ్మవారికి తొలి బోనం సమర్పించడం ద్వారా తెలంగాణలో బోనాలు ప్రారంభం అవుతాయి. ఇది మొదటి బోనం. జూన్ 29వ తేదీన రెండో బోనం, జూలై 3న మూడో బోనం, జూలై 6న నాలుగో బోనం, జూలై 10న ఐదో బోనం, జూలై 13న ఆరో బోనం, జూలై 17న ఏడో బోనం, జూలై 20న 8వ బోనం, జూలై 24న తొమ్మిదో బోనంతో ఈ బోనాలు సంబురాలు ముగుస్తాయి. ఆదివారం, జూలై 6, 2025న గోల్కొండ బోనాలు, ఆదివారం, జూలై 13, 2025న ఉజ్జయినీ మహంకాళి ఆలయం బోనాలు, ఆదివారం, జూలై 20, 2025న అక్కన్న మాదన్న ఆలయ బోనాలు, సోమవారం, జూలై 21, 2025న (మహంకాళి ఉత్సవ సమాప్తి), ఆదివారం, జూలై 27, 2025న లాల్‌దర్వాజ బోనాలు జరుగనున్నాయి. **రామ కిష్టయ్య సంగనభట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు

## సంపాదకీయం

# న్యూస్ రాగానే ట్రంప్ కిందా మీదా... ఏమిటీ బాధ..!

ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా దశాబ్ధాలుగా పెండింగ్ లో ఉన్న పలు సంఘర్షణలు, వరుస యుద్ధాలు ఆపుతున్నానన్న సంతోషంలో, సంబరాల్లో ఉన్నారు డొనాల్డ్ ట్రంప్. వీటివల్ల తనకు నోబెల్ శాంతి బహుమతి కూడా వచ్చేలా ఉందనే ఆశల పల్లకిలోనూ ఊయలూగుతున్నట్లు కనిపిస్తున్నారు! ఈ నేపథ్యంలో తాజాగా తెరపైకి వచ్చిన ఓ నివేదిక ట్రంప్ ను టెన్షన్ పెడుతోందని చెబుతున్నారు. అవును... ఇరాన్ పై దాడులు చేసేశాం.. ఇజ్రాయెల్ మొదలుపెట్టిన ఆపరేషన్ రైజింగ్ లయన్ కు ఆపరేషన్ మిడ్ నైట్ హ్యామర్ తో సూపర్ ఫినిషింగ్ ఇచ్చాం.. అదే సమయంలో ఇరు దేశాల మధ్య సీజ్ ఫైర్ అంగీకారం నెలకొల్పాం.. అనుకున్న అని లక్ష్యాలను పూర్తి చేశాం అనే ఆనందంలో ట్రంప్ ఉన్నారని అంటున్నారు. ఆయన కూడా బలంగా క్లెయిం చేసుకుంటున్నారు. సరిగ్గా ఈ సమయంలో... ట్రంప్ కి ఒక చేదు విషయం చెప్పే నివేదిక ఒకటి వెలువడింది. ఇందులో భాగంగా... ఇరాన్ లోని ఫోర్డో, నతాంజ్, ఇస్ఫహాన్ అణుకేంద్రాలపై అమెరికా భారీ దాడులకు పాల్పడగా.. ఆ దాడుల్లో ఫోర్డో, నతాంజ్ లు పూర్తిగా నాశనం కాలేదు అంటూ పెంటగాన్ కు చెందిన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఓ నివేదిక తెరపైకి వచ్చింది. ఇదే సమయంలో... యురేనియం శుద్ధి చేసేందుకు ఉపయోగించే సెంట్రిఫ్యూజ్ లు వంటి కీలక పరికరాలను ఇరాన్ కొన్ని నెలల్లోనే తిరిగి ప్రారంభించుకోవచ్చని ఆ నివేదిక పేర్కొన్నట్లు సీ.ఎన్.ఎన్. తమ కథనంలో రాసుకొచ్చింది. దీంతో... ట్రంప్ కారాలు మిరియాలు నూరుతూ.. కిందా మీదా పడుతున్నారని అంటున్నారు. ఈ సమయంలో ట్రంప్ ట్రూత్ లో ఓ పోస్ట్ పెట్టారు. ఇందులో భాగంగా... అవన్నీ నకిలీ వార్తలు.. చరిత్రలో అత్యంత విజయవంతమైన సైనిక దాడుల తీవ్రతను తగ్గించేందుకు కొన్ని వార్తా సంస్థలు చేస్తున్న ప్రయత్నం ఇది.. ఆయా వార్తా సంస్థలను ప్రజలు నమ్మడం లేదు.. ఇరాన్ లోని అణు కేంద్రాలు పూర్తిగా నాశనమయ్యాయి అంటూ ట్రంప్ సోషల్ మీడియా వేదికగా రాసుకొచ్చారు. ఇదే సమయంలో... వైట్ హౌస్ కూడా ఈ విషయంపై స్పందించింది. ఇందులో భాగంగా... ఇలాంటి అసత్య కథనాలు అధ్యక్షుడు ట్రంప్ ను కించపరచడమేనని.. ఇరాన్ అణుకార్యక్రమాన్ని నిర్మూలించిన యుద్ధ పైలట్ల ధైర్యసాహసాలను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నమే ఇదని వైట్ హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలినా లీవిట్ పేర్కొన్నారు. దీంతో... పెంటగాన్ కు చెందిన డిఫెన్స్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ ఇచ్చిన నివేదిక, దీనిపై సీ.ఎన్.ఎన్. రాసిన కథనం ట్రంప్ ను బాగా చికాకు పెట్టినట్లున్నాయని అంటున్నారు పరిశీలకులు. దీనికి తోడు ఇప్పటికే ఇరాన్ అణుపరీక్షలు జరిపిందనే వార్తలు కూడా ట్రంప్ ను కిందా మీదా పడేస్తున్నాయని అంటున్నారు.

# కలెక్టరుకు అధికారాల సంక్రమణం...వలస పాలనలో చారిత్రక పరిణామం


### ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో జిల్లా కలెక్టర్ అధికారాల పరిణామం - 1787 జూన్ 27... ఈస్ట్ ఇండియా కంపెనీ, జిల్లా కలెక్టరుకు... జడ్జి, మేజిస్ట్రేట్, కొన్ని పోలీసు అధికారాలను ఇచ్చిన దినం

ఈస్ట్ ఇండియా కంపెనీ భారత దేశాన్ని శాసించిన కాలంలో జిల్లా పరిపాలన వ్యవస్థలో కలెక్టరు పదవికి ఉన్న ప్రాధాన్యం ఎంతగానో పెరిగింది. ప్రారంభంలో రెవెన్యూ వసూలుకు పరిమితమైన ఈ స్థానం, న్యాయ, పోలీస్ వ్యవస్థల సమన్వయ బాధ్యతలతో కూడిన శక్తివంతమైన పరిపాలనా అధికార పదవిగా రూపాంతరం చెందింది. అయితే ఈ మార్పులు స్థిరంగా ఉండక, బ్రిటీష్ పాలకుల విధానాలలో వచ్చిన మార్పుల ఆధారంగా ఈ అధికారాల పరిధి కాలక్రమేణా మారిపోయింది. 1787 నుంచి 1831 వరకు ఈ పరిణామం ఎలా సాగిందో తెలుసుకుందాం. 1787 జూన్ 27న ఈస్ట్ ఇండియా కంపెనీ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, జిల్లా కలెక్టరుకు రెవెన్యూ అధికారాలతో పాటు న్యాయ, మేజిస్ట్రేట్ మరియు కొన్ని పోలీసు అధికారాలు కూడా అప్పగించారు. ఈ ఉత్తర్వుల ఫలితంగా కలెక్టరు ఒకే వ్యక్తిగా జిల్లా పరిపాలనలో సంపూర్ణ నియంత్రణ వహించే స్థితికి చేరుకున్నాడు. ఆయన జిల్లాలో పన్నుల వసూలు చేయడమే కాకుండా, న్యాయ విచారణలు నిర్వహించడం, శాంతి భద్రతలను పర్యవేక్షించడం వంటి బాధ్యతలు కూడా చేపట్టాడు. దీనివల్ల అధిక అధికారాల కేంద్రీకరణ జరిగింది. కాలానుగుణంగా ఈ విధానం అధికార దుర్వినియోగానికి దారి తీసే అవకాశం ఉందని భావించి, ఈ వ్యవస్థపై విమర్శలు మొదలయ్యాయి. 1793లో లార్డ్ కార్న్‌వాలిస్ ప్రవేశ పెట్టిన శాశ్వత కౌలుదారీ పద్ధతితో కలెక్టర్ పాత్రలో మళ్లీ ఒక కీలక మార్పు చోటు చేసుకుంది. ఈ పద్ధతిలో భూమి ఆదాయాన్ని స్థిరంగా నిర్ణయించి, జమీందారులను ప్రభుత్వానికి రెవెన్యూ చెల్లించాల్సిన బాధ్యతగల మధ్యవర్తులుగా నియమించారు. ఈ చర్యతో కలెక్టర్ ప్రధానంగా




రెవెన్యూ వ్యవస్థకే పరిమితమయ్యాడు. ఈ సందర్భంగా న్యాయ వ్యవస్థను పరిపాలన వ్యవస్థ నుండి వేరు చేయాలన్న ఆలోచనతో, కలెక్టరుకు అప్పగించిన న్యాయ, మేజిస్ట్రేట్, పోలీస్ అధికారాలను తొలగించారు. ఈ చర్య ఒకే వ్యక్తి వద్ద అధిక అధికారాలు కేంద్రీకృతమవడం వల్ల న్యాయ పరమైన న్యాయ నిష్పత్తికి భంగం కలగవచ్చనే ఆందోళనల నేపథ్యంలో తీసుకున్నదిగా చెప్పవచ్చు. ప్రజలు న్యాయం పొందాలంటే న్యాయ వ్యవస్థలో విశ్వాసం ఉండాలి, అది కలెక్టరుల వద్ద న్యాయ నిర్ణయ అధికారాలు ఉంటే దెబ్బతింటుందన్నది బ్రిటీష్ పాలకుల విశ్వాసంగా ఉండేది. అయితే ఈ పరిస్థితి బహుళ పరిపాలనా లోపాలను కలిగించింది. న్యాయస్థానాలు దూరంగా ఉండటం, కేసుల పరిష్కారాల్లో జాప్యం, గ్రామీణ స్థాయిలో శాంతిభద్రతలు మెరుగు పడకపోవడం వంటి కారణాల నేపథ్యంలో, 1831లో కంపెనీ పాలకులు మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరుకు తిరిగి మేజిస్ట్రేట్ అధికారాలను అప్పగించి, స్థానికంగా శాంతిభద్రతల పర్యవేక్షణ, నేరాల విచారణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కార బాధ్యతను అప్పగించారు. దీనివల్ల కలెక్టర్ పదవికి మళ్లీ రెవెన్యూ అధికారంతో పాటు న్యాయపరమైన బాధ్యతలు కూడా లభించాయి. ఈ విధంగా జిల్లా కలెక్టరు పదవి, బ్రిటీష్ పాలనలో వివిధ దశల్లో విభిన్న స్వరూపాలు దాల్చింది. ఒక దశలో పూర్తి అధికారాలు కలిగిన పరిపాలకుడిగా, మరొక దశలో కేవలం రెవెన్యూ అధికారిగా, ఆ తరువాత మళ్లీ న్యాయపరమైన బాధ్యతలు కలిగిన అధికారిగా పరిణతి చెందింది. ఈ మార్పులు బ్రిటీష్ పాలకుల పరిపాలనా ధోరణులకు, వారి లక్ష్యాలకు ప్రతిబింబంగా నిలిచాయి. ఈ చరిత్ర భారతీయ పరిపాలనా వ్యవస్థలో కలెక్టరు స్థానం ఎంత కీలకమైనదో స్పష్టంగా తెలియజేస్తుంది. నేటికీ జిల్లా కలెక్టరు లేదా జిల్లా మేజిస్ట్రేట్ పదవికి ఉన్న గౌరవం, బాధ్యతలు, చారిత్రకంగా ఏర్పడిన పరిణామాల ఫలితమే. భారతీయ పరిపాలనా చరిత్రలో కలెక్టర్ స్థానం ఒక మూలస్తంభంలా నిలిచింది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# తినే ప్రతి ఉల్లి ముక్క వెనుక తడిచిన రైతు చెమట - జూన్ 27...జాతీయ ఉల్లి దినోత్సవం




ఉల్లిపాయ భారతీయ వంటలలో విడదీయలేని భాగం మాత్రమే కాదు, దేశ వ్యవసాయ వ్యవస్థలోనూ ఒక కీలకమైన ఆర్థిక పంట. దీని శక్తి మన వంటకాల్లో గులాబీ సుగంధంలా వినిపించినా, దీని వెనుక రైతుల చెమట, కష్టం, ఆశలూ అంతే తీవ్రంగా దాగి ఉన్నాయి. ఈ విలువైన పంటను సమాజం గౌరవించేందుకు, రైతు కష్టాన్ని గుర్తించేందుకు, ఉల్లిపాయ మార్కెట్ సమస్యలపై చైతన్యాన్ని పెంచేందుకు జూన్ 27వ తేదీని జాతీయ ఉల్లి దినోత్సవంగా పాటిస్తున్నారు. ఈ దినోత్సవానికి అధికారిక కేంద్ర ప్రకటనా లేకపోయినప్పటికీ, వివిధ రాష్ట్రాల వ్యవసాయ శాఖలు, రైతు సంఘాలు ఈ దినాన్ని ప్రజల అవగాహన కోసం జరుపు కుంటున్నాయి. భారత దేశం ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఉల్లి ఉత్పత్తిదారుగా నిలుస్తోంది. 2024%-%25 గణాంకాల ప్రకారం, దేశంలో సుమారు 25 నుండి 28 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉల్లిపాయ ఉత్పత్తి జరుగుతోంది. ఇది ప్రపంచ ఉల్లి ఉత్పత్తిలో సుమారు 22 శాతం. దేశ వ్యాప్తంగా 1.3 మిలియన్ హెక్టార్లలో ఉల్లి సాగు సాగుతోంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు ఈ పంటలో అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రత్యేకించి మహారాష్ట్ర ఒంటరిగా దేశ ఉత్పత్తిలో 38 శాతానికి పైగా వాటా కలిగి ఉంది. ఉల్లి ఎగుమతుల ద్వారా దేశం వార్షికంగా 3,000 కోట్ల రూపాయల వరకు విదేశీ మారక ద్రవ్యాన్ని సంపాదిస్తోంది. ఉల్లిపాయలు ఆరోగ్య పరంగా కూడా అమూల్యమైనవి. వీటిలో విటమిన్ సి, బీ6, పొటాషియం, ఫ్లావనాయిడ్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తాయి, గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తాయి, రక్తపోటును నియంత్రించడంలో సహాయ పడతాయి. జీర్ణ క్రియకు సహాయ పడటమే కాకుండా, క్యాన్సర్ కారక కణాల వ్యాప్తిని నిరోధించే శక్తి కూడా కలిగి ఉంటాయని శాస్త్రీయంగా గుర్తించబడింది. ఈ పంట రైతుకు లాభం తీసుకు రావాల్సింది. కానీ విపరీతంగా మారుతున్న మార్కెట్ ధోరణులు, నిల్వ సౌకర్యాల కొరత, రవాణా సమస్యలు, మధ్యవర్తుల నియంత్రణ లేకపోవడం వలన రైతు నష్టాల పాలవుతున్నారు. కొన్నిసార్లు కిలో ఉల్లి ధర రూ. 100 దాటినా, మరికొన్ని సందర్భాల్లో రూ. 5కే విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రైతులు ఎకరానికి రూ. 6,000 నుండి రూ. 8,000 వరకు ఖర్చు పెట్టినా, మార్కెట్లో తమ ఉత్పత్తికి న్యాయమైన ధర పొందలేక పోతున్నారు. పంట నిల్వలు చేయలేని పరిస్థితుల వలన భారీగా నష్టం ఎదురవుతోంది. భారత దేశంలో ఉల్లి నిల్వ సామర్థ్యం సుమారు 35 శాతానికి పరిమితమై ఉంది. మిగతా ఉత్పత్తి నిల్వల అజాగ్రత్త వల్ల పాడైపోతూ, మార్కెట్‌లో ధరలు ఒక్కసారిగా పడిపోవటానికి దారితీస్తోంది. ఇది రైతుకు పెద్ద నష్టంగా మారుతోంది. ప్రభుత్వాలు ధరల నియంత్రణ కోసం ఎగుమతులపై ఆంక్షలు విధించినా, అదే సమయంలో దిగుబడి సమయంలో రైతుకు మద్దతుగా నిలబడడంలో వెనకడుగు వేస్తున్నాయి. కనిష్ఠ మద్దతు ధర అమలులో ఉన్న అసమర్థత, గిడ్డంగుల కొరత, భద్రతా గనులలో క్రమం తప్పిన నిబంధనలు రైతు నిస్పృహకు మూలంగా మారాయి. ప్రజల పాత్ర కూడా ఇక్కడ కీలకం. మనం నిత్యం వినియోగించే ఉల్లిపాయలు ఎక్కడి నుంచి వస్తున్నాయో, రైతు పరిస్థితి ఏంటి అన్నదానిపై అవగాహన పెరగాలి. మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా రైతు బజార్ల ద్వారా కొనుగోలు చేయడం రైతుకు ఉపయోగ పడుతుంది. పౌరులుగా సామాజిక చైతన్యాన్ని పెంచేలా వ్యవహరించాలి. ఉల్లి ధరల విషయంలో కొంత ఆత్మ నియంత్రణ పాటిస్తూ, రైతు దుస్థితిపై ప్రశ్నలు వేయగల సామర్థ్యం మనలో ఉండాలి. జాతీయ ఉల్లి దినోత్సవం సందర్భంగా రైతుల పట్ల సంఘీభావాన్ని వ్యక్తపరచే కార్యక్రమాలు నిర్వహించవచ్చు. నూతన సాగు సాంకేతికతలపై శిక్షణ శిబిరాలు, రైతుల సన్మానాలు, ఆరోగ్యావగాహన కార్యక్రమాలు, పాఠశాలల్లో పోషకాహారంపై ఉపన్యాసాలు, వంటల పోటీలు వంటి అనేక కార్యక్రమాల ద్వారా ఈ దినానికి ప్రాముఖ్యత ఇవ్వవచ్చు. ఇది కేవలం ఉల్లిపాయను గుర్తించే దినం కాదు %-% ఇది వ్యవసాయ విధానాలపై పునరాలోచన చేసే అవకాశం, రైతు కన్నీటిని తుడిచే మార్గం. ఈ దేశ భవిష్యత్తు రైతు పైనే ఆధారపడి ఉంది. రైతు కన్నీటిలో మానవతా పరిమళం ఉంది. మనం నిత్యం తినే ఒక్క ఉల్లిపాయ వెనకున్న జీవనయానం తెలుసుకొని, రైతుల పట్ల గౌరవాన్ని పెంపొందించు కోవాలి. రైతు శ్రమకు మనం తగిన గుర్తింపు ఇవ్వగలిగితేనే ఈ దినోత్సవానికి సార్ధకత ఉంటుంది. ఇది కేవలం ఒక ఆహార పదార్థం పట్ల కాదు %-% ఒక జీవన వేదన పట్ల ఉదాత్తమైన భావోద్వేగం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# పలు ప్రత్యేకతల సమాహారం... జగన్నాథ రథోత్సవం - జూన్ 27 ... పూరీ జగన్నాథ రథయాత్ర



ఏ హిందూ ఆలయంలోనైనా ఊరేగింపు కోసం మూల విరాట్టును కదిలించే కార్యక్రమం దాదాపు ఉండదు. ఊరేగింపు సేవల కోసం ప్రత్యేకించి ఉత్సవ విగ్రహాలుంటాయి. అలాగే ఊరేగింపు కోసం ప్రత్యేకించి ఏటా ఒకే రథాన్ని వినియోగించడం అన్ని చోట్లా జరిగేదే. అయితే ఈ రెంటికీ భిన్నమైన పరిస్థితి భారత దేశంలో ఒక సమయంలో ఉంది. అది మామూలు ఆలయం కాదు. పలు ప్రత్యేకతలు కలిగిన ప్రఖ్యాత ఆలయం. అదే ఒడిశాలోని పూరీ జగన్నాథాలయం. బలభద్ర, సుభద్రలతో సహా ఈ ఆలయంలో కొలువైన జగన్నాథ మూల విరాట్ మూర్తులను ఏడాదికొకసారి గుడి లోంచి బయటికి తీసుకువచ్చి భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, కనువిందు చేసే ప్రత్యేక సన్నివేశం పూరీకే అపురూపం. అంతేకాదు. జగన్నాథ రథయాత్ర పేరుతో నిర్వహించే కార్యక్రమాలకు ఏటా కొత్త రథాలను తయారు చేసి వినియోగిస్తుండడం పూరీ జగన్నాథుడికే ప్రత్యేకం. అందుకే... జగన్నాథుడి రథ యాత్రను అత్యంత అపురూపంగా భావిస్తారు భక్తులు. పూరీ జగన్నాథ దేవాలయం భారతదేశం లోని ఒడిషా రాష్ట్రంలో బంగాళాఖాతం తీరాన ఉన్న పూరీ పట్టణంలో గల ఒక ప్రాచీన, ప్రముఖమైన హిందూ దేవాలయము. విగ్రహాలు చెక్కతో తయారు చేసి ఉండటం ఇక్కడి ప్రత్యేకత. ఆలయంలో శ్రీకృష్ణుడు, సుభద్ర, బలరామ సమేతంగా దర్శన మిస్తాడు. ఛార్ థాం" పుణ్యక్షేత్రాలలో ఈ దేవాలయం కూడా ఉంది. ఆషాఢ శుద్ధవిదియ... పూరీ క్షేత్రంలో రథోత్సవ పండుగ రోజు. జగన్నాథ జయజయ ధ్వనాలతో పూరీ నగర వీధులన్నీ మారుమోగు తుంటాయి. అంతరాలయంలో రత్న పీఠికపై ఏడాదిగా కొలువున్న జగన్నాథుడు బయటికి వచ్చే సమయం కోసం వేచి చూస్తుంటారు భక్తులు. ఆ క్షణం అపురూపం, అనిర్వచనీయం. రథయాత్ర నేపథ్యం గురించి రకరకాల కథనాలు ప్రచారంలో ఉన్నాయి. ద్వాపర యుగంలో కంసుడిని వధించడానికి బలరామ కృష్ణులు బయలుదేరిన ఘట్టాన్ని పురస్కరించుకుని ఈ యాత్ర జరుపుతారని ఒక కథనం. ద్వారకకు వెళ్లాలన్న సుభద్రా దేవి కోరిక తీర్చే ముచ్చటే ఈ రథయాత్ర అని మరి కొందరు చెబుతారు. ఇక గుండీచా దేవి మందిరం విషయానికొస్తే... పూరీ జగన్నాథ ఆలయాన్ని నిర్మించిన ఇంద్రద్యుమ్న మహారాజు భార్య గుండీచా. ఆమె కూడా జగన్నాథ బలభద్రుల కోసం ప్రధానాలయానికి మూడు కి.మీ. దూరంలో ఒక మందిరం నిర్మించింది. అదే గుండీచా ఆలయం. రథయాత్రలో భాగంగా అక్కడికి తీసుకువెళ్లిన మూడు విగ్రహాలనూ ఆ గుడిలోని రత్న సింహాసనంపై కూర్చుండ. బెట్టి గుండీచాదేవి పేరిట ఆతిథ్యం ఇస్తారు. గుండీచా మందిరం జగన్నాథుడి అతిథి గృహంగా భావిస్తారు. జగన్నాథ రథయాత్ర జరిగేది ఆషాఢ శుద్ధ విదియ నాడే అయినా అందుకు రెండు నెలల ముందు నుంచే ఏర్పాట్లు మొదలవుతాయి. వైశాఖ బహుళ విదియ నాడు రథ నిర్మాణానికి కావలసిన ఏర్పాట్లు ప్రారంభిస్తారు. అందుకు అవసరమైన వృక్షాలను 1072 ముక్కలుగా ఖండించి పూరీకి తరలిస్తారు. ప్రధాన పూజారి, తొమ్మిది మంది ముఖ్య శిల్పులు, వారి సహాయకులు మరో 125 మంది కలిసి అక్షయ తృతీయ నాడు రథ నిర్మాణం మొదలు పెడతారు. వృక్ష భాగాలనూ నిర్మాణానికి అనువుగా ముక్కలుగా ఖండిస్తారు. వాటిలో 832 ముక్కల్ని జగన్నాథుడి రథం తయారీకీ, 763 కాండాలను బలరాముడి రథ నిర్మాణానికీ, 593 భాగాలను సుభద్రా దేవి రథానికీ వినియోగిస్తారు. 45 అడుగుల ఎత్తున జగన్నాథుడి రథం పదహారు చక్రాలతో మిగతా రెండిటి కన్నా పెద్దదిగా ఉంటుంది. ఎర్రటి చారలున్న పసుపు వస్త్రంతో రథాన్ని అలంకరిస్తారు. బలభద్రుడి రథం ఎత్తు 44 అడుగులు. పద్నాలుగు చక్రాలుంటాయి. ఎర్రటి చారలున్న నీలి వస్త్రంతో ఈ రథాన్ని కప్పుతారు. సుభద్రా దేవి రథం ఎత్తు 43 అడుగులు. పన్నెండు చక్రాలుంటాయి. ఎర్రటి చారలున్న నలుపు వస్త్రంతో పద్మ. ధ్వజాన్ని అలంకరిస్తారు. ప్రతి రథానికీ 250 అడుగుల పొడవూ ఎనిమిది అంగుళాల మందం ఉండే తాళ్లను కడతారు. ఆలయ తూర్పు భాగంలో ఉండే సింహ ద్వారానికి ఎదురుగా ఉత్తర ముఖంగా నిలబెడతారు. రథయాత్ర ప్రారంభ దినాన మేళ తాళాలతో గర్భగుడి లోకి వెళ్లిన పండాలు (పూజరులు) ఉదయ కాల పూజాదికాలు ముగించి, 'మనిమా (జగన్నాథా)' అని పెద్దపెట్టున అరుస్తూ రత్నపీఠం మీద నుంచి విగ్రహాలను కదిలిస్తారు. ఆలయ ప్రాంగణం లోని ఆనంద బజారు, అరుణ స్తంభం మీదుగా వాటిని వూరేగిస్తూ బయటికి తెస్తారు. ముందుగా... దాదాపు ఐదున్నర అడుగుల ఎత్తుండే బలరాముడి విగ్రహాన్ని తీసుకు వస్తారు. విగ్రహాన్ని ఆయన రథమైన తాళ ధ్వజంపై ప్రతిష్ఠింప జేస్తారు. అనంతరం ఆ స్వామి విగ్రహానికి అలంకరించిన తలపాగా ఇతర అలంకరణలను తీసి భక్తులకు పంచుతారు. ఇదే పద్ధతిలో సుభద్రా దేవి విగ్రహాన్ని కూడా బయటికి తీసుకువచ్చి పద్మ ధ్వజం అనే రథం మీద ప్రతిష్ఠిస్తారు. ఇక దాదాపు ఐదడుగుల ఏడంగుళాల ఎత్తుండే జగన్నాథుడి విగ్రహాన్ని ఆలయ ప్రాంగణంలో నుంచి బయటికి తీసుకు వస్తుండగానే జయహో జగన్నాథా అంటూ భక్తి పారవశ్యంతో జయజయ ధ్వనాలు చేస్తారు. కులమత భేదాలు లేకుండా అందరూ జగన్నాథుడి విగ్రహాన్ని తాకవచ్చు. ఈ మూడు విగ్రహాలనూ తీసుకువచ్చే వారిని దైత్యులు అంటారు. ఇంద్రద్యుమ్న మహారాజుకన్నా ముందే ఆ జగన్నాథుడిని నీలమాధవుడి రూపంలో అర్చించిన సవరతెగ రాజు విశ్వావసు వారసులు వారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం... మూల విరాట్టులను అంతరాలయం నుంచి బయటికి తీసుకు వచ్చి రథాల మీద ప్రతిష్ఠింపచేసే అర్హత వీరికి మాత్రమే ఉంటుంది. సుభద్ర, జగన్నాథ, బలభద్రులు రథారూఢులై యాత్రకు సిద్ధం కాగా, పూరీ సంస్థానాధీశులు అక్కడికి చేరుకుని జగన్నాథుడికి నమస్కరించి రథం మీదికి ఎక్కి స్వామి ముంగిట బంగారు చీపురుతో శుభ్రం చేస్తారు. అనంతరం స్వామిపై గంధం నీళ్లు చిలకరించి కిందికి దిగి రథం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేస్తారు. ఇదే తరహాలో బలరాముడినీ, సుభద్రా దేవినీ అర్చించి వారి రథాల చుట్టూ కూడా ప్రదక్షిణ చేస్తారు. జగన్నాథుడి రథం మీదుండే ప్రధాన పండా నుంచి సూచన రాగానే కస్తూరి కళ్లాపి చల్లి హారతిచ్చి... జై జగన్నాథా అని పెద్దపెట్టున అరుస్తూ తాళ్లను పట్టుకుని రథాన్ని లాగడం మొదలు పెడతారు. విశాలమైన బోడోదండ (ప్రధానమార్గం) గుండా యాత్ర మంద గమనంతో సాగుతుంది. అతి నెమ్మదిగా జగన్నాథుడి గుడి నుంచి కేవలం మూడు మైళ్ల దూరంలో ఉండే గుండీచా గుడికి చేరుకోవడానికి దాదాపు పన్నెండు గంటల సమయం పడుతుంది. గుండీచా ఆలయానికి చేరుకున్నాక ఆ రాత్రి బయటే రథాల్లోనే మూలవిరాట్లకు విశ్రాంతినిస్తారు. మర్నాడు ఉదయం మేళ తాళాలతో గుడిలోకి తీసుకు వెళతారు. వారం రోజులపాటు గుండీచా దేవి ఆతిథ్యం స్వీకరించిన అనంతరం దశమినాడు తిరుగు ప్రయాణం మొదలవుతుంది. ఆ రోజు మధ్యాహ్నానికి మూడు రథాలూ జగన్నాథ ఆలయానికి చేరుకుని గుడి బయటే ఉండి పోతాయి. మర్నాడు ఏకాదశినాడు స్వామి వార్లను బంగారు ఆభరణాలతో అలంకరిస్తారు. ఈ వేడుకను చూసేందుకు బారులు తీరుతారు భక్తులు. ద్వాదశి నాడు విగ్రహాలను మళ్లీ గర్భగుడి లోని రత్న సింహాసనంపై అలంకరించడంతో యాత్ర పూర్తి అవుతుంది. చివరగా శ్రీ మందిరం రత్న వేదికకు యథావిధిగా చేరుతాయి. రథాల పైకి తరలించే మూల విరాట్లను తరలించడంతో మొదలై రత్న వేదికపైకి చేర్చడంతో వార్షిక రథయాత్రకు తెర పడుతుంది. ఒడిశాలో అతి ముఖ్యమైన పండుగలలో ఒకటిగా భావించబడే జగన్నాథ రథయాత్ర జూన్ 27, 2025న ఆ షాఢ మాసంలో శుక్ల పక్షంలోని ద్వితీయ తిథి శుక్ర వారం నాడు జరుపుకుంటారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



# హద్దుమీరి.. హద్దులు చెరిపి

హైదరాబాద్ : నిన్న మొన్నటి దాకా హెచ్‌సీయూ వివాదం సుప్రీంకోర్టులో కొనసాగింది. పచ్చని చెట్లను ధ్వంసం చేయడంతో కోర్టు అధికారులపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. మళ్లీ మొక్కలు నాటాలని ఆదేశించింది. ఈ సంఘటనతోనైనా మేడ్చల్‌జిల్లా అటవీశాఖ అధికారులు జాగ్రత్త పడకపోగా..యథేచ్ఛగా అటవీ భూమిలోకి చొరపడే అవకాశాన్ని కొంతమందికి కల్పించింది. వివాదాస్పదమైన భూమిలో చెట్లను నరికినా..అబ్బే అదేం వివాదం కాదు.. మేమే ఆ పని చేయించామని చెబుతున్నారు. ఇది మేడ్చల్ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలోని అటవీ భూముల్లోనే జరిగింది. కొద్ది రోజులుగా అటవీ భూమిని ఆక్రమించేందుకు చెట్లను నరికేస్తున్నారనే ఫిర్యాదులు అధికారులకు వెళ్తున్నా దృష్టి సారించకపోవడంతో అనుమానాలకు తావిస్తోంది.

**ఇంత జరుగుతున్నా...:** శామీర్‌పేట్ బాహ్య వలయ రహదారికి ఆరు



కిలోమీటర్ల దూరంలోని పొన్నాల గ్రామ పరిధిలోని అటవీభూములు సర్వే నంబరులో 130లో 240 ఎకరాలున్నాయి. దీనికి సమీపంలోనే కొంతమంది పట్టాభూములున్నాయి. వాళ్లే ఈ అటవీభూముల్లో తమకు సంబంధించిన పదెకరాల భూమి ఉందని అటవీశాఖ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. ఆ శాఖలోని కొంతమంది అధికారుల సహకారంతోనే మూడురోజులుగా కొందరు జేసీబీతో దాదాపుగా మూడు మీటర్ల వెడల్పులో కిలోమీటరు దూరం అడ్డుగా ఉన్న చెట్లను నరికేశారు. స్థానికుల ఫిర్యాదుతో శామీర్‌పేట్ తహసీల్దార్ యాదగిరిరెడ్డి.. సిబ్బందిని పంపించి జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. రూ.20వేల జరిమానా విధించారు. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు మేమే చేయాలని చెప్పామని ఫోన్ చేసి చెప్పారు. లిఖితపూర్వకంగా లేఖ ఇవ్వాలని కోరితే మాత్రం ఇంతవరకు ఇవ్వలేదని తహసీల్దార్ తెలిపారు. ఈ భూమిలో సర్వే చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదన్నారు.

**సంయుక్త సర్వే**

కొద్దిరోజుల క్రితం రెవెన్యూ అధికారులతో సంయుక్త సర్వే నిర్వహించాం. అందులోనూ స్పష్టత రాకపోవడంతో మూడురోజుల క్రితం చైన్ సర్వే చేసేందుకు జేసీబీతో చదును చేయించామని ఫారెస్ట్ రేంజర్ విష్ణువర్ధన్ తెలిపారు. ఎక్కడా చెట్లు నరికివేయలేదని, ముళ్లకంపలు, పొదలు మాత్రమే తొలగించామని వివరించారు.

# భూ భారతి అమలుకు యంత్రాంగం సన్నద్ధం

సిరిసిల్ల: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం భూ–భారతి పేరుతో కొత్త రెవెన్యూ చట్టం–2025 తీసుకొచ్చింది. జిల్లాలో రుద్రంగి పైలెట్ మండలంలోనే కాకుండా మిగతా రెవెన్యూ గ్రామాల్లోనూ నిర్వహించేందుకు కసరత్తు చేస్తోంది. రుద్రంగి మండల ంలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి సమస్యలు ఉన్న రైతుల నుంచి 1253 దరఖాస్తులను స్వీకరించింది. ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిశీలన జరుగుతోంది. సమస్యల స్థాయిని బట్టి మండల, ఆర్డీవో, కలెక్టర్ స్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తారు. జిల్లాలో రెవెన్యూ డివిజన్లు 02, మండలాలు 13, రెవెన్యూ గ్రామాలు 171 ఉన్నాయి. ఈనెల 16న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అవగాహన సదస్సులో పాల్గొని పలు అంశాలను వివరించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్–2న భూ–భారతి చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. దీనికి ముందు క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి పలు చర్యలు తీసుకుంటున్నారు.

**నేడు జీపీవోల నియామకానికి అర్హత పరీక్ష**

ప్రస్తుతం గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారులు లేరు. మండల కేంద్రాలకే పరిమితమయ్యారు. జిల్లాలో 172 రెవెన్యూ గ్రామాలున్నా యి. వీటికి జీపీవో (గ్రామ పరిపాలనాధికారి)ని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గతంలో రెవెన్యూ విభాగంలో పనిచేసిన వీఆర్వోలు, వీఆర్ఏలు ఇతర శాఖలకు వెళ్లారు. వీరిలో తిరిగి రెవెన్యూశాఖకు వచ్చేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను



ఆహ్వానించారు. జిల్లా వ్యాప్తంగా 85 దరఖాస్తులు రాగా అందులో అర్హులైన 64 మందికి ఆదివారం పరీక్ష నిర్వహించనున్నారు. దీనిలో అర్హత సాధించిన వారిని జీపీవోలుగా నియమించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని తర్వాత మిగతా ఖాళీల భర్తీకి కొత్తగా నోటిఫికేషన్ వేస్తారా? ఉన్నవారినే డిప్యూటేషన్‌పై నియమిస్తారా అన్న విషయం తేలాల్సి ఉంది. మరోవైపు గ్రామాల్లో భూతగాదాల పరిష్కారానికి లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తున్నారు. ఆసక్తి ఉన్న కొత్తవారికి శిక్షణ ఇచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**అసైన్డ్ కమిటీల ఏర్పాటు**

ప్రభుత్వ భూముల పంపిణీ, అర్హుల ఎంపికకు గతంలో స్థానిక ఎమ్మెల్యే అధ్యక్షతన అసైన్డ్ కమిటీలు ఉండేవి. గత ప్రభుత్వంలో ఈ కమిటీలు లేవు. భూ–భారతి చట్టంలో అసైన్డ్ భూముల సమస్యలు ఎక్కువే ఉంటున్నాయి. ప్రభుత్వ భూములను అసైన్డ్ చేసినట్లుగా పట్టాలు ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం భూములు లేవు. కొన్నిచోట్ల హద్దులు చూపించలేదు. అసైన్డ్ కమిటీలను పునరుద్ధరించి శాస్త్రీయంగా సర్వే నిర్వహించి సాగుచేసుకుని జీవనం సాగిస్తున్న వారికే ప్రభుత్వ భూములను అసైన్డ్ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. దీనిలో భాగంగా త్వరలో నియోజకవర్గానికి ఒక అసైన్డ్ కమిటీని నియమించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. భూ–భారతి చట్టంలో సాదాబైనామాల క్రమబద్ధీకరణ కు ప్రత్యేక నిబంధనలు ఉండటంతో అర్జీదారుల్లో ఆశలు చిగురించా యి. తెల్లకాగితాలపై రాసుకుని కొనుగోలు చేసిన భూముల క్రమబద్ధీక రణ కేసుపై కోర్టులో స్టే ఉంది. తీర్పువచ్చిన తర్వాత ఆన్‌లైన్‌లోని దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# రుణ లక్ష్యం ఘనం.. అందిస్తే ఆనందం



తాండూరు : స్వయం సహాయక సంఘాల మహిళలకు స్త్రీనిధి రుణాలు అందజేస్తున్నారు. అయితే గతేడాది తక్కువగా పంపిణీ చేయడంతో లక్ష్యం చేరలేదు. ఈసారి ముందస్తు ప్రణాళికలతో వంద శాతం పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు, మండలాల్లోని గ్రామాల మహిళలను స్వయం సంఘాలుగా ఏర్పాటు చేశారు. వీరందరికి సంఘం ద్వారా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. వీటితో ప్రమేయం లేకుండా వ్యక్తిగతంగా కూడా అందిస్తున్నారు. స్త్రీనిధి పథకం కింద దరఖాస్తు చేసిన నిర్ణీత వ్యవధిలో మంజూరు చేస్తున్నారు. పూచీకత్తు లేకుండా రూ.25వేల నుంచి రూ.3లక్షల దాకా ఇస్తున్నారు. వీటిని 48 గంటల నుంచి నెలరోజుల వ్యవధిలో అందిస్తుండడంతో మహిళలు ఉత్సాహంగా సద్వినియోగం చేస్తున్నారు. స్వయం ఉపాధి యూనిట్లు, వ్యాపారాలు, వ్యవసాయం, కుటీర పరిశ్రమలను నెలకొల్పి ఆదాయం ఆర్జిస్తున్నారు.

**అత్యధికంగా వికారాబాద్‌కు..**

జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరం రూ.31కోట్లు రుణాలు అందించాలని ఖరారు చేశారు. అత్యధికంగా వికారాబాద్ పట్టణ మహిళలకు రూ.3.93 కోట్లు, ద్వితీయ స్థానంలో తాండూరు మండలానికి రూ.3.12 కోట్లు అందించేందుకు నిర్ణయించారు. అత్యల్పంగా చౌడాపూర్ మండలానికి రూ.53లక్షలు అందించనున్నారు. గతేడాది రుణ లక్ష్యం నలభై శాతం దాటలేదు. దీంతో ఈసారి వంద శాతం సాధించే దిశగా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారులు ప్రణాళికలు రూపొందించారు. రుణాల పంపిణీ, వాయిదాల వసూళ్లు సమీక్షించేందుకు నిర్ణయించారు. వెనకబడ్డ మండలాలపై ప్రత్యేకంగా దృష్టిసారించి లక్ష్యాలను పూర్తి చేసేందుకు సీసీలు, వీవోఏలు, ఏపీఎంలతో సమావేశాలు నిర్వహించేందుకు ఖరారు చేశారు.

**ప్రైవేటు అప్పులకు వెళ్లకుండా..:** వ్యవసాయం, పిల్లల చదువులు, వ్యాపారాలకు అవసరమైన నగదుకు మహిళలు ప్రైవేటుగా అప్పు చేసేవారు. పేదరికం, నిరక్షరాస్యతను ఆసరా చేసుకునే వ్యాపారులు వందకు రూ.2 నుంచి రూ.5 వడ్డీ విధించేవారు. దీంతో సంపాదనలో ఎక్కువ మొత్తం వడ్డీలకే సరిపోయేది. దీంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి. స్త్రీనిధి రుణాలను విరివిగా అందించడంతో మహిళలు ప్రైవేటు రుణాలకు ఆసక్తి చూపడం లేదు. తక్కువ వడ్డీకి అందిస్తున్న స్త్రీనిధి రుణాలు పొందుతున్నారు.

సంఘాలు సద్వినియోగం చేసుకోవాలి – ఉదయకుమారి, ప్రాంతీయ మేనేజరు

ఈ ఆర్థిక సంవత్సరంలో స్త్రీనిధి రుణాలు అందరికీ అందిస్తాం. గడువులోగా వంద శాతం రుణాల పంపిణీ పూర్తి చేసి లక్ష్యం చేరుకుంటాం. రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.

జిల్లాలో మండల సమాఖ్యలు: 19
గ్రామ సమాఖ్యలు: 657
స్వయం సహాయక సంఘాలు: 15,697
నమోదైన సభ్యులు: 1.63లక్షలు
రుణ లక్ష్యం: రూ.31కోట్లు

# గురుకులాల వసతికి చోటేది?



సిరిసిల్ల: పాఠశాల స్థాయిలోని వసతి గృహాలకు ఆదరణలేక మూతపడే స్థాయికి చేరుతుంటే.. గురుకులాలకు వసతి కరవవుతోంది. ఉన్నత చదువులకు ప్రాధాన్యం ఇస్తూ.. ప్రభుత్వ సాయాన్ని అందిపుచ్చుకుంటూ.. పల్లెల నుంచి గురుకులాల్లో చేరేందుకు విద్యార్థులు వెల్లువలా వస్తున్నారు. అందుకు తగ్గట్టుగా మౌలిక వసతుల కల్పనలో ప్రధానమైన సొంత భవనాల్లేవు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాలు 21 ఉన్నాయి. వీటిల్లో సగం అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఉన్నత విద్య నుంచి ఇంటర్, డిగ్రీ స్థాయి పెరుగుతున్న కొద్దీ విద్యార్థులు పెరుగుతున్నారు. ప్రస్తుతం అన్నింటిలో కలిపి పదివేలకుపైన విద్యార్థులున్నారు. అద్దె భవనాల్లో అంతంత మాత్రపు వసతులతో కాలం వెళ్లదీస్తున్నారు. స్థలాల సేకరణ లేక శాశ్వత భవన నిర్మాణాలపై ఏళ్లుగా కదలిక లేదు.

**అద్దె చెల్లింపు సొమ్ముతో భవనాలు పూర్తయ్యేవి!**

జిల్లాలోని చిన్నబోనాల, నేరెళ్ల, ముస్తాబాద్, నర్మాల, బద్దెనపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకులాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. వీటిలో రెండేళ్ల క్రితం జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. మరిమడ్ల, దుమాల, ఇందిరమ్మ కాలనీలోని గిరిజన గురుకులాలనూ ఇంటర్, డిగ్రీ స్థాయి పెంచారు. వేములవాడ, సిరిసిల్ల నియోజకవర్గాల్లో బాలబాలికలకు అయిదు మహాత్మా జ్యోతిబా పులే రెండు మైనార్టీ, మూడు గిరిజన సంక్షేమ, మూడు సాంఘిక సంక్షేమ గురుకులాలకు సొంత భవనాల్లేవు. ఆయా సొసైటీల ద్వారా మంజూరైన ప్రాంతంలోనే గురుకులాలు కొనసాగించాలని ప్రభుత్వం నిబంధన తీసుకొచ్చింది. బోయినపల్లి, సిరిసిల్ల, మానాల, మండేపల్లి, సర్దాపూర్‌కు మంజూరైన గురుకులాలు వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో నిర్వహిస్తున్నారు. జిల్లాకు మంజూరైన బీసీ, ఎస్సీ గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాలను కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లోని కళాశాలతో కలిపి బోధన కొనసాగిస్తున్నారు. అద్దె భవనాల్లో విద్యార్థులకే సరైన వసతులు లేవు. దీంతో ఉపాధ్యాయులు అధ్యాపకులు సమీప పట్టణాల్లో నివాసముం టున్నారు. ఆర్‌అండ్‌బీ నిర్ణయించిన ధరల ప్రకారం చదరపు అడుగుకు రూ.10–15 చొప్పున నెలకు రూ.1.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఆయా సొసైటీలు అద్దెలు చెల్లిస్తున్నాయి. ఇలా ఒక్కో వసతిగృ హం మంజూరైనప్పటి నుంచి ఇప్పటికీ సగటున రూ.20 కోట్లపైనే చెల్లించారు. ప్రభుత్వం స్థలం కేటాయిస్తే అద్దె చెల్లించే మొత్తంతో ఇప్పటికీ సొంత భవనం పూర్తయ్యేది. ప్రభుత్వం ఇటీవల వేములవాడ నియోజకవర్గానికి రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్‌ను మంజూరు చేసింది. దీనికి రెవెన్యూ యంత్రాంగం స్థలం సేకరించే పనిలో ఉన్నారు. వీటితోపాటు సొంత భవనాలు లేని గురుకులాలపైనా దృష్టి సారిస్తే విద్యార్థులకు వసతి సమకూరుతుంది. ఏటా గురుకులంలో సగటున 90 శాతం ప్రవేశాలు జరుగుతున్నాయి. వీటి ప్రమాణాల ప్రకారం ఒక్కో గురుకులానికి కనీసం పది ఎకరాలు అవసరం. తరగతి గదులు, వసతి, భోజనం, క్రీడా మైదానాలకు అనుగుణంగా నిర్మించాలి. వేములవాడ మైనార్టీ గురుకుల పాఠశాలకు మర్రిపల్లి సమీపంలోని ఉపకేంద్రం వద్ద అయిదె కరాలు కేటాయించారు. స్థలం సరిపోదని అయిదేళ్లుగా నిధులు మంజూరు కాలేదు. బోయినపల్లి గురుకులానికి ప్రభుత్వం అయిదెకరాలు కేటాయించినా నిధులు మంజూరుకు నోచుకోలేదు.

# బడులకు మార్కులు పెరిగాయ్!

కరీంనగర్ : ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు రెండేళ్లతో పోలిస్తే గతేడాది అన్ని విషయాల్లో మెరుగయ్యాయి. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు, అధునాతన బోధన పద్ధతులకు తోడు ఉపాధ్యాయుల కృషితో సర్కారు బడుల పనితీరులో మార్పు కనపడింది. ఇటీవల కేంద్ర విద్యాశాఖ ప్రకటించిన ఫెర్మార్మింగ్ గ్రేడ్ ఇండెక్స్ (పీజీఐ) నివేదిక 2023–24లో ఈ విషయాలు వెల్లడయ్యాయి. యూడైస్ 2023–24 ఆధారంగా ప్రభుత్వ పాఠశాలల పనితీరును కేంద్ర విద్యాశాఖ మదింపు చేసింది. ఆరు విభాగాల్లో నాలుగు జిల్లాలు గతంతో పోలిస్తే మెరుగైన స్థానాలు సాధించాయి. 74 సూచికల ఆధారంగా 600 మార్కులకు గ్రేడింగ్ ఇచ్చారు. మార్కుల ఆధారంగా జిల్లాలకు ర్యాంకులను ప్రకటించారు.

**వసతుల్లో మినహా అన్నింటా ముందంజ**



2022–23 పీజీఐ వెల్లడించిన వివరాలతో పోలిస్తే 2023–24 పీజీఐ వివరాల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు మౌలిక వసతులు మినహా మిగిలిన అన్ని విభాగాల్లో మెరుగయ్యాయి. అభ్యసన ఫలితాల్లో గతంలో 90లోపు మార్కులు సాధించిన జిల్లాల పరిస్థితి తాజా వివరాల్లో వందకు పైగా మార్కులకు చేరింది. చదువుల్లో నాణ్యత, మౌలిక వసతులు, బడుల్లో బాలల రక్షణ, డిజిటల్ లెర్నింగ్, విద్యాపరిపాలన వంటి విషయాల్లో ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలను సాధించాయి. కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలు గతంతో పోలిస్తే మెరుగవగా.. జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లో వసతుల విషయంలో మాత్రం గతాని కంటే తక్కువ మార్కులు వచ్చాయి.

# సాంకేతికత వినియోగం.. సేవలు పారదర్శకం

సిరిసిల్ల : అంగన్‌వాడీ కేంద్రాల సేవల్లో పారదర్శకతను పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాంకేతికతను వినియోగిస్తున్నాయి. ఇప్పటి వరకు అంగన్‌వాడీల్లో అందే సేవల వివరాలన్నింటిని రిజిస్టర్‌లలో నమోదు చేసేవారు. లబ్ధిదారుల సంతకాలు తీసుకునేవారు. తాము సరకులను తీసుకోలేదు అని.. సంతకాలు ఫోర్జరీ చేశారని కొందరు లబ్ధిదారులు ఆరోపిస్తూ ఉండేవారు. దీంతో సేవల్లో పారదర్శకత లోపించిందనే విమర్శలు వినిపిస్తూ ఉండేవి. ఈ నేపథ్యంలో అర్హులకు నాణ్యమైన సేవలు అందేలా, ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పోషణ్ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఎన్‌హెచ్‌టీఎస్ (నేషనల్ హెల్త్ ట్రాకర్ సిస్టం) యాప్‌లను వినియోగిస్తున్నారు. వీటిల్లో లబ్ధిదారుల ఆధార్, ఫోన్ నంబర్లు, ఫొటో తదితరాలను అప్‌లోడ్ చేస్తున్నారు.

**ఉపయోగం ఇలా..** యాప్స్ వినియోగంలో పిల్లలు, వారి బరువు, ఎత్తు నమోదు చేస్తున్నారు. దీంతో వారి పోషణ వివరాలను వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుంది. కేంద్రానికి సరకుల కోసం లబ్ధిదారులు వచ్చిన తర్వాత వారి ఫొటోను నమోదు చేయగానే ఫేస్ రికగ్నిషన్



సక్సెస్‌ఫుల్ అని వస్తుంది. అప్పటికే నమోదు అయి ఉన్న వారి చరవాణి నంబరుకు ఓటీపీ వస్తుంది. దాన్ని యాప్‌లో నమోదు చేసి సబ్మిట్ చేస్తున్నారు. ఆ వివరాలను అంగన్‌వాడీ కేంద్రం మొదలుకొని మండల, జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలో అధికారులు చూడడానికి, వాటిని పర్యవేక్షణ చేయడానికి ఉపయోగపడనున్నాయి.

కేంద్రం తెరిచి ఉంచిన వివరాలు, టీచరు, సహాయకుల హాజరు వివరాల నమోదు చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల నమోదు, వారికి అందిస్తున్న సరకుల వివరాలు తెలియనున్నాయి. ముఖ్యంగా కేంద్రాల్లో నిల్వ ఉన్న, పంపిణీ చేసిన సరకుల వివరాలు తెలుసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం యాప్ ద్వారా 7 నెలల నుంచి 3 ఏళ్ల వయసు గల 17,478 మంది పిల్లలకు అందించే సరకులను యాప్‌లో నమోదు చేసి అందిస్తున్నారు. ఇది విజయవంతం అయితే మిగతా లబ్ధిదారులకు యాప్‌లో వివరాలు నమోదు చేసి సరకులను అందించనున్నారు. యాప్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ముందుగా సూపర్‌వైజర్లకు శిక్షణ ఇస్తున్నారు. వీరు సెక్టార్ల వారీగా అంగన్‌వాడీ టీచర్‌లకు శిక్షణ ఇవ్వనున్నారు.

భవిష్యత్తులో అన్నీ యాప్ ద్వారానే..

సాంకేతిక పరిజ్ఞానం నాణ్యమైన, నమ్మకమైన సేవలు అందించడానికి ఉపయోగపడుతుంది. యాప్‌లో వివరాలు నమోదు చేయడానికి శిక్షణ అందిస్తున్నాం. భవిష్యత్తులో కేంద్రాల పూర్తి వివరాలను యాప్ ద్వారానే నమోదు చేయాల్సి ఉంటుంది.

– లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ అధికారి

**జిల్లాలో ఇలా..** అంగన్‌వాడీ కేంద్రాలు 586
టీచర్లు 532
సహాయకులు 407
గర్భిణులు 3,621
బాలింతలు 2,828
0–6 నెలల పిల్లలు 2,521
7 నెలల నుంచి 3 ఏళ్ల వారు 17,478
3–6 ఏళ్ల మధ్య..16,056

# గాలొస్తే గలగల.. వానొస్తే విలవిల!

ఇచ్చోడ : వర్షాకాలం వచ్చిందంటే చాలు రోగాలు చుట్టుముడుతాయి.. టైఫాయిడ్, మలేరియా, వైరల్ జ్వరాలతో ఆసుపత్రుల చుట్టూ తిరగక తప్పదు. ఈ క్రమంలో అక్కడికి వెళ్లే రోగులకు పూర్తిస్థాయిలో సేవలు అందే పరిస్థితులు లేవు. ఇప్పటికే గుడిహత్నూర్‌లో పై నుంచి గాలిపంక పడిపోవడంతో రెండు రోజుల శిశువుకు స్వల్ప గాయాలు కాగా, ప్రాణాలతో బయటపడింది. మారుమూల గ్రామాలు, ఆదివాసీ గిరిజన ప్రజలు ఎక్కువగా ఉండే జిల్లాలో పీహెచ్‌సీల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. వర్షాలకు నీరు రావడం, సిబ్బంది కొరత, ప్రహరీలు లేకపోవడం, నైట్ వాచ్‌మెన్‌లు లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సమస్యలు పరిష్కరించాల్సి ఉంది.

**పరీక్షలు లేవు.. రోగం తేలేదెట్లా?** సొనాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడంతో చిన్నపాటి రక్త పరీక్షలు సైతం చేసుకోలేని పరిస్థితి.. సాధారణంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, టైఫాయిడ్, మలేరియా వ్యాప్తిచెందే ఆస్కారం ఉంది. ఈ పరిస్థితిలో పరీక్షలు నిర్వహించే వారు లేకపోవడం సమస్యకు దారి తీస్తోంది. ప్రతి రోజు దాదాపు 100 నుంచి 150 వరకు రోగులు వస్తుండడంతో ఒక్క స్టాఫ్ నర్సు విధులు నిర్వర్తించడం సమస్యగా మారింది. మరో ఏఎన్ఎం ను ఎన్‌సీడీ కింద కేటాయించినా ఆమె సైతం వేరే చోట డిప్యుటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. విద్యుత్తు పోతే.. చీకట్లోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి.. ఇన్వర్టర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**వర్షం పడితే ఎలా..?**

ఉట్నూరు మండలంలోని హస్నాపూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో వర్షాకాలం వణుకు పుట్టించే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పీహెచ్‌సీకి పలు గ్రామాల నుంచి వైద్యం కోసం ఆదివాసీలు వస్తారు. వర్షాకాలంలో రోగుల తాకిడి ఎక్కువ. వర్షం కురిస్తే వైద్యం సేవలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా మరమ్మతు చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

**విషకీటకాలకు నిలయం..** ఇచ్చోడలోని 24 గంటల ప్రభుత్వ ఆసుపత్రి ఇది.. రోజూ 90 నుంచి 110 వరకు రోగులు వస్తారు. జాతీయ రహదారికి ఆనుకొని ఉండడంతో రోడ్డు ప్రమాద బాధితులు, చుట్టుపక్కల మండలాల నుంచి ఇక్కడికి రోగులు వైద్య సేవల నిమిత్తం వస్తారు. ప్రహరీ లేదు. పక్కనే వాగు ఉండడం, గ్రామానికి దూరంగా ఉండడంతో విషకీటకాలు, పాములు లోపలికి ప్రవేశిస్తాయి. భయాందోళన నెలకొంది. నైట్ వాచ్‌మెన్ లేకపోవడంతో పలుమార్లు అగంతుకులు ప్రవేశించి ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కనీసం బయట వీధి దీపాలు సైతం ఏర్పాటు చేయడం లేదు.

# ఆమెకు రక్తం కావాలి..!

నల్గొండ : సాధారణంగా మహిళల్లో 14 శాతానికి మించి హిమోగ్లోబిన్ ఉంటే ఆరోగ్యకరంగా ఉన్నట్లని డబ్ల్యూహెచ్‌వో లెక్కలు చెబుతున్నాయి. కానీ జిల్లాలో ఉన్న 8.25 లక్షల మంది మహిళల్లో 50 నుంచి 60 శాతం మంది మహిళలు హెచ్‌బీ (హిమోగ్లోబిన్) 14 శాతం కంటే తక్కువతో బాధపడతున్నారు. ప్రసవంతో పాటు ఇతర శస్త్రచికిత్సల కోసం కేవలం జనరల్ ఆసుపత్రి మాతాశిశు సంరక్షణ కేంద్రంలోనే రోజుకు 25 నుంచి 30 మంది చేరుతున్నారు. వీరిలో 20 మంది వరకు మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. సరైన పౌష్టికాహారం తీసుకోకపోవడంతో పాటు నెలసరి రుతుక్రమం మూలంగా ఎక్కువ శాతం మంది ఈ సమస్యతో బాధపడుతున్నారు.

జిల్లా కేంద్రం పరిధిలోని గిరకబాయిగూడెం ప్రాంతానికి చెందిన సౌమ్య(28) ఇంట్లో రోజూవారీ పనులు చేస్తూ వారం క్రితం కింద పడిపోయింది. కారణం తెలియని భర్త వెంటనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆమెలో కేవలం 4 శాతం మాత్రమే రక్తం ఉందని, తక్షణం రక్తం ఎక్కించాలని సూచించారు.

జిల్లా కేంద్రానికి ప్రసవం కోసం వస్తున్న మహిళల్లో 60 శాతం మందికి రక్తం తక్కువగా ఉంటోందని వైద్యులు చెబుతున్నారు. శస్త్రచికిత్స సమయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని.. అందుకే ముందుగా రక్తం అందుబాటులో ఉండేలా చూసుకోవాలని వారికి సూచిస్తున్నారు. కారణం ఏదైనా ఇలా నిత్యం రక్తం కోసం వెతుకులాడే వారిలో ఎక్కువ శాతం మంది మహిళలే ఉంటున్నారు.

జంక్‌ఫుడ్ వదిలేయాలి: డా.స్వరూపారాణి, గైనిక్ హెచ్‌వోడి, ఎంసీహెచ్ నల్గొండ

జనరల్ ఆసుపత్రికి శస్త్రచికిత్సల కోసం వచ్చే మహిళల్లో 50 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు. పురుషులతో పోల్చితే స్త్రీలకు నెలసరి, ప్రసవం కారణంగా రక్తం తక్కువగా ఉంటుంది. దీనికి తోడు ఎక్కువ మంది జంక్‌ఫుడ్ తీసుకోవడం, కారం ఎక్కువగా తినడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఐరన్ మాత్రలతో పాటు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. గుడ్లు, రోజుకు తగినంత నీరు, బెల్లం ఎక్కువగా ఉండే పదార్థాలు, రాగులు, ములక్కాయలు, పప్పు, కూరగాయలు, పండ్లు, మాంసాహారం తీసుకోవడంతో రక్తం ఎక్కువగా వస్తుంది. వైద్యఆరోగ్యశాఖ అధికారులతో పాటు, అంగన్‌వాడీ కేంద్రాల్లో రక్తహీనతతో బాధపడేవారికి పూర్తి స్థాయిల్లో అవగాహన కల్పిస్తున్నాం.

# నెమ్మదిగా.. సాగుతున్న దిద్దుబాట..!

చౌటుప్పల్ : హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిపై అత్యంత ప్రమాదకర ప్రాంతాల్లో(బ్లాక్ స్పాట్స్) పనులు సాగుతున్నాయి. గతేడాది జూన్‌లో తరచూ ప్రమాదాలు జరిగే 17 ప్రాంతాల్లో పనులను రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు రూ.300 కోట్ల వ్యయంతో ఒక ఫ్లైఓవర్, 13 అండర్‌పాస్ వంతెనలు, 10 చోట్ల సర్వీసు రోడ్డు నిర్మాణాలను చేపడుతున్నారు. 16 బ్లాక్ స్పాట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో ఉండటం గమనార్హం. మరో బ్లాక్ స్పాట్ ప్రాంతం ఏపీలోని నవాబుపేట వద్ద ఉంది. ఇప్పటికి సగం ప్రాంతాల్లో పనుల్లో వేగం పుంజుకోలేదు. ఈ పనులను హరియాణాకు చెందిన సంస్థ చేపడుతుంది. చౌటుప్పల్‌లో పరిస్థితి మరి దారుణంగా ఉంది. డ్రైనేజి, సర్వీసు రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. తంగడపల్లి రోడ్డు నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు, మీసేవా నుంచి ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి వరకు కంకర వేసి బీటీ వేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాలు వెళ్లినప్పుడు కంకర ఎగిరి ప్రజలకు తగులుతుంది. టైర్లు కూడా పంక్చర్ అవుతున్నాయని చోదకులు తెలుపుతున్నారు.

**చౌటుప్పల్ నుంచి కోదాడ సరిహద్దు వరకు..**

చౌటుప్పల్ బస్టాండు నుంచి చిన్నకొండూరు రోడ్డు వరకు 150 మీటర్లు ఫ్లైఓవర్ వస్తుంది. మిగతాది మట్టి కట్ట(వెహికల్ అండర్ పాస్)ను నిర్మిస్తారు. పెద్దకాపర్తి, చిట్యాల, కట్టంగూరు జంక్షన్(నల్గొండ రోడ్డు), ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీకళాశాల– జనగాం కూడలి, జమ్మిగడ్డ కూడలి, దురాజ్‌పల్లి, ముకుందాపురం యూటర్న్ మునగాల, కోమరబండ, కోదాడ, మేళ్లచెర్వు పైవంతెన శ్రీరంగాపురం వద్ద అండర్ పాస్ వంతెన, సర్వీసు రోడ్డు పనులు కూడా నత్తనడకన నడుస్తున్నాయి. ఏడాదిన్నర కాలంలో పనులను పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ గుత్తేదారు సంస్థను ఆరంభంలోనే ఆదేశించింది. మరో నెల రోజులు గడిస్తే వర్షాలు కురిసే అవకాశముంది. పనులకు ఆటంకం కలగనుంది. వేసవిలో కూడా పనులు వేగంగా చేయకపోతే మరో ఏడాదికి పైగా సమయం పట్టనుంది. చౌటుప్పల్‌లో ఫ్లైఓవర్, అండర్‌పాస్ పనుల ప్రారంభానికి ఇంకా రెండు నెలలకు పైగా సమయం పట్టే అవకాశముంది. అడ్డుగా అక్రమ నిర్మాణాలు.. దూడల భిక్షంగౌడ్, భాజపా మునుగోడు అసెంబ్లీ కన్వీనర్

చౌటుప్పల్‌లో సర్వీసు రోడ్డు, అండర్‌పాస్ నిర్మాణాలకు అడ్డుగా పలు అక్రమ నిర్మాణాలున్నాయి. వీటిని అధికారులు తొలగించడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారు. పనుల్లో జాప్యానికి కూడా ఇవి కారణంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రజల కోసం పనులను చేపడుతుంటే పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

వేగం పెంచుతాం.. నాగేశ్వర్‌రావు, ఎన్‌హెచ్–65 ప్రాజెక్ట్ డైరెక్టర్

బ్లాక్‌స్పాట్స్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల సగానికి పైగా పనులు పూర్తయ్యాయి. పెద్దకాపర్తి, చిట్యాలలో అండర్ పాస్ పనులను 50శాతానికి పైగా పూర్తయ్యాయి. తొలుత సర్వీసు రోడ్లు, భూగర్భ మురికి కాల్వ పనులు పూర్తి కావాలి. అండర్ పాస్ పనులకు గోతులు తవ్వి ఫిల్లర్లు నిర్మిస్తాం. ఆ తర్వాత గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ అమర్చి మట్టిని నింపుతాం. ఈ పనులు రెండు నెలల్లోనే పూర్తి అవుతాయి. ఇప్పటికే గుత్తేదారు గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ సిద్ధం చేసి పెట్టారు. నిర్మాణ పనుల్లో కూడా వేగం పెంచాలని గుత్తేదారుకు సూచిస్తాం.

# భగీరథుడి తీరు.. నిమ్మకు నీరు..!

చిట్యాల : ఏళ్లుగా పెంచుతున్న నిమ్మతోటలను నీటి కొరత నుంచి కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు. బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి అవి ఆగి.. ఆగి పోస్తున్న నీటిని బొట్టుబొట్టుగా ఒడిసిపట్టుకుని తోటలను కాపాడుకుంటున్నారు. నకిరేకల్ ఉద్యాన క్లస్టర్ పరిధిలోని పలు గ్రామాల్లో నిమ్మ రైతులు, కూరగాయల పెంపకం రైతులు కరవు పరిస్థితుల్లో తోటలను రక్షించుకునేందుకు నీటి గుంతలను నిర్మించుకుంటున్నారు. చిట్యాలలోని వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు నారబోయిన నర్సింహకు ఆరు ఎకరాల వ్యవసాయ భూమిలో మూడు ఎకరాల్లో నిమ్మతోట ఉంది. ఆయన ఇప్పటి వరకు 20 ఏళ్లలో 36 బోర్లు వేశారు. అందులో ఒండు బోర్లు మాత్రమే ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం అవి రెండు కూడా ఆగి..ఆగి పోస్తున్నాయి. ఈ నీటిని డ్రిప్‌ద్వారా చెట్లకు పెట్టడం సాధ్యం కావడం లేదు. దీంతో రూ.1.50 లక్షల వ్యయంతో తోటలో 20 అడుగుల లోతు, 30 అడుగుల పొడవు, వెడల్పులతో నీటి గుంతను నిర్మించి పాలిథీన్ షీట్ ఏర్పాటు చేశారు. రెండు బోర్ల నుంచి అరకొరగా వస్తున్న నీటిని ఈ గుంతలో నిల్వ చేసి ఒకేసారి ఒత్తిడితో డ్రిప్ ద్వారా నిమ్మచెట్లకు నీటిని పెట్టి కాపాడుతున్నారు. నేరడ గ్రామానికి చెందిన మరో రైతు సీహెచ్.వెంకన్న రూ.2లక్షలతో పాలిథీన్ షీట్ గుంతను నిర్మించారు. నీటిని నిల్వ చేసి నిమ్మచెట్లను బతికించుకుంటున్నానని వివరించారు. మండలంలో భారీ వర్షాలు వచ్చినపుడు చుట్టుపక్కల ఉన్న చెరువుల్లో నీరు చేరినప్పుడు మాత్రమే బోర్లు ఎక్కువ పోస్తున్నాయని, నీటి వసతులు లేక ఇక్కడ కరవు పరిస్థితి ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# అజీజ్‌నగర్‌లో సమీకృత మార్కెట్



హైదరాబాద్ : కూరగాయలు, పూల హోల్‌సేల్ మార్కెట్ అంటే ముందుగా గుర్తుకొచ్చేది గుడిమల్కాపూరే. దీనిని తరలించాలని కొంతకాలంగా ఉన్న ప్రతిపాదనలు త్వరలో కార్యరూపం దాల్చనున్నాయి. నగర శివారు అజీజ్‌నగర్‌లో అన్ని సదుపాయాలతో మార్కెట్‌ను ఏర్పాటు చేయడానికి కసరత్తు మొదలైంది. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ మార్కెట్ కోసం స్థల సేకరణ పూర్తి చేశారు. కూరగాయలు, పూలతోపాటు పండ్ల మార్కెట్‌ను కలిపి సమీకృత (ఇంటిగ్రేటెడ్) మార్కెట్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం సుమారు 150 ఎకరాల స్థలసేకరణ చేసి ప్రభుత్వ ఆమోదానికి పంపించినట్లు తెలిసింది.

మెహదీపట్నానికి సమీపంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కొన్ని దశాబ్దాలుగా కొనసాగుతోంది. నగరం అభివృద్ధి చెందడంతో ఈ ప్రాంతం ప్రస్తుతం రద్దీగా మారింది. దీన్ని తరలించడానికి శంకర్‌పల్లి, శంషాబాద్, మొయినాబాద్, గండిపేట మండలాల్లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. బాహ్యవలయ (అవుటర్ రింగు రోడ్డు) రహదారికి సమీపంలోని మొయినాబాద్ మున్సిపాలిటీ అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూములు అనువుగా ఉన్నాయని, ఇక్కడైతేనే రైతులు, హోల్‌సేల్ వ్యాపారులకు అనుకూలంగా ఉంటుందని ప్రభుత్వం నిర్ణయించింది. సర్వే నంబరు 176లో సుమారు 220 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇందులో 150 ఎకరాల్లో సమీకృత మార్కెట్‌ను నిర్మించాలని ప్రభుత్వ ప్రతిపాదన. ఇప్పటికే భూముల వివరాలు కలెక్టర్‌కు అందగా.. దస్త్రం ప్రభుత్వానికి చేరింది.

**రైతులకు అనువుగా** అజీజ్‌నగర్‌లో పూలు, పండ్లు, కూరగాయల మార్కెట్ అందుబాటులోకి వస్తే పశ్చిమ రంగారెడ్డి ప్రాంతాలైన వికారాబాద్, కొడంగల్, తాండూరు, పరిగి, చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, సంగారెడ్డి, మెదక్ జిల్లాల రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు ప్రతిపాదించారు.

ఈ ప్రాంతం అవుటర్ రింగు రోడ్డుకు పక్కనే ఉండటంతో రవాణా సౌకర్యంగా ఉంటుంది. శివారు జిల్లాల నుంచి తాజా కూరగాయలు సైతం మార్కెట్‌కు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అత్యాధునిక సౌకర్యాలు కల్పించడమేకాకుండా.. పార్కింగ్ సమస్య తలెత్తకుండా 150 ఎకరాల్లో మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

# రెండేళ్లు దిగులు.. ఆపై మిగులు



హైదరాబాద్ : మహానగరంలో మరో రెండేళ్ల పాటు తాగునీటి లోటు ఉండనుంది. ఐదేళ్లుగా డిమాండు, సరఫరా మధ్య అంతరం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుత తాగునీటి పరిస్థితి, 2030 వరకు అవసరాలు తీర్చేందుకు చేపట్టాల్సిన చర్యలను జలమండలి విశ్లేషించింది. 2020లో సుమారు 40 ఎంజీడీ(మిలియన్ గ్యాలన్స్ ఫర్ డే)ల అంతరం ఉండగా.. ఇప్పుడది 100 ఎంజీడీలకు పైగా పెరిగింది. 2027 నాటికి అంతరం 260 ఎంజీడీలకు పెరిగే అవకాశం ఉందని అంచనా. అప్పటికల్లా గోదావరి 2, 3 దశలు పూర్తయితే 301 ఎంజీడీ(17.5 టీఎంసీలు)ల నీటితో నగరం అవసరాలు పూర్తిగా తీరడమే కాకుండా 34 ఎంజీడీల మిగులు ఉంటుందని జలమండలి భావిస్తోంది. ప్రస్తుతం జలమండలి ఓఆర్‌ఆర్ వరకు తాగు నీటిని సరఫరా చేస్తోంది. ఇప్పటికే నీటి కనెక్షన్ల సంఖ్య 14.07 లక్షలకు చేరుకుంది. కొత్త ప్రాంతాల్లో నిర్మాణాలు జోరుగా సాగుతుండటంతో డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. ప్రతి నెలా సగటున 3వేల కొత్త కనెక్షన్లు ఇస్తుండటమే ఇందుకు నిదర్శనం.

**జలాలపై ప్రత్యేక దృష్టి..**

రంగారెడ్డి జిల్లాలో ఏడు మండలాల్లో 56 గ్రామాల పరిధిలో 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రభుత్వం పూనుకుంది. అక్కడ భారీగా నీటి అవసరం ఉంది. అందుకే అదనంగా జలాలు తీసుకురావడంపై దృష్టిసారించారు. నివాసాలు, వాణిజ్య, పారిశ్రామిక సముదాయాలు, వినోద విభాగాలు సహా ఏఐ, ఫిన్‌టెక్, స్మార్ట్ టెక్నాలజీల ఇన్నోవేషన్ హబ్‌లు అందుబాటులోకి తేవాలని నిర్ణయించారు. నగరంలోని ఇతర ప్రాంతాల వాణిజ్య పారిశ్రామిక అవసరాలు, గేటెడ్ కమ్యూనిటీలు, రైల్వేలు, ఐటీ హబ్‌లు, సెజ్‌లకు 2027 నాటికి మొత్తం 100 ఎంజీడీల నీరు అదనంగా అవసరమని అంచనా. గోదావరి 2, 3 దశలతో అదనపు జలాలను అందుబాటులోకి తీసుకురావడం, వృథా తగ్గించటం, తాగటానికి కాకుండా ఇతర అవసరాలకు శుద్ధి చేసిన మురుగునీటి వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణతో ముందు కెళ్లాలని ఉన్నతాధికారులు యోచిస్తున్నారు.

# మత్తుచెరలో బాల్యం బందీ!



హైదరాబాద్ :ఆరో తరగతి పిల్లాడు.. ఒకరోజు నవ్వుతూ.. మరోరోజు దిగులుగా ఉండటంతో తల్లికి అనుమానం వచ్చింది. మార్కులు తగ్గటం వల్ల కావొచ్చని భావించింది. స్కూల్ బ్యాగు నుంచి వాసన రావటంతో బిడ్డ ఏదో దాస్తున్నట్టు గుర్తించింది. కడుపునొప్పితో బాధపడుతున్న కొడుకును ఆసుపత్రికి తీసుకెళ్లినపుడు అసలు విషయం బయటపడింది. తెలిసీ తెలియని వయసులో పిల్లలు మత్తు చెరకు చిక్కుతున్నారు. వైట్నర్‌తో మొదలై... మరింత కిక్ కోసం సింథటిక్ డ్రగ్స్ వరకూ చేరటం ఆందోళన కలిగిస్తోంది. గత 5 నెలల్లో మత్తు పదార్థాలకు అలవాటుపడిన 600 మందిని గుర్తించారు. వీరిలో 200 మందికిపైగా 12–18 సంవత్సరాలలోపు విద్యార్థులే.

**ఎలా బయటపడుతున్నారంటే..**

తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో (టీజీన్యాబ్) డ్రగ్స్ నియంత్రణలో కఠిన వైఖరి అవలంబిస్తోంది. అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠాలతో నగరానికి ఉన్న లింక్‌లను ఛేదిస్తున్నారు. మత్తుపదార్థాలు విక్రయదారుల వద్ద లభించిన ఫోన్ నంబర్ల ఆధారంగా కొనుగోలుదారుల జాబితా రూపొందిస్తున్నారు. మాదకద్రవ్యాలు తీసుకుంటున్న వారికి మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నారు. సాధారణ స్థితికి చేరే వరకూ వారిపై నిఘా ఉంచుతున్నారు. విద్యార్థులైతే వారి భవిష్యత్తుపై ప్రభావం పడకుండా చూస్తున్నారు. కేసు నమోదు చేయకుండా పునరావాస కేంద్రాలకు పంపుతున్నారు.

**సరదాగా మొదలై..**

నగరం, శివారు ప్రాంతాల్లోని పది పాఠశాలల్లో విద్యార్థులు ఈ–సిగరెట్‌కు అలవాటుపడినట్టు పోలీసులు గుర్తించారు. ఇలాంటివారు చోరీలకూ పాల్పడుతున్నారు. ముంబయి ముఠా ఏజెంట్ల ద్వారా పిల్లలకు విక్రయిస్తున్నట్టు నిర్ధారించారు. రాజస్థాన్, ఒడిశా ముఠాలు గంజాయి చాక్లెట్లు, బిస్కెట్లను రుచి చూపుతున్నాయి. విద్యాసంస్థల సమీపంలోని కొన్ని కిరాణా, పాన్ షాపుల్లో వీటిని విక్రయిస్తున్నట్టు దర్యాప్తులో గుర్తించారు. స్నేహితుల ప్రభావంతో మత్తుకు దగ్గరవుతున్నారని మనస్తత్వ నిపుణులు తెలిపారు. గతేడాది ఓ పాఠశాలలో నలుగురు విద్యార్థుల బ్యాగుల్లో ఈ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. కట్టడి చేయకపోతే పెద్ద నేరాలకు పాల్పడే ఆస్కారం ఉందని టీజీన్యాబ్ డీఎస్పీ మధుమోహన్‌రెడ్డి హెచ్చరించారు.

**ప్రవర్తన మార్పులతో గుర్తించవచ్చు**

– సుజని, సైకాలజిస్టు, డ్రగ్ ట్రీట్‌మెంట్ సెంటర్, హైదరాబాద్

మాదక ద్రవ్యాలకు అలవాటుపడి కౌన్సెలింగ్‌కు వస్తున్న వారిలో 10 శాతం మంది యువకులే ఉంటున్నారు. ఒక్కసారి డ్రగ్స్ తీసుకుంటే ఏంకాదనే అభిప్రాయంతో తప్పుదారి పడుతున్నారు. తామేం చేసినా ఎవరూ గుర్తించరనే ధీమాతో గాడి తప్పుతున్నారు. మిత్రుల ద్వారానే మత్తుకు దగ్గరవుతున్నారు. మత్తుపదార్థాలు తీసుకున్నట్టు చాలామంది గుర్తించలేరు. అకస్మాత్తుగా పిల్లల్లో అతిగా స్పందించటం, ఉత్సాహం, బాధపడటం, ఏడవటం వంటి ప్రవర్తన మార్పులు ఉంటే సీరియస్‌గా తీసుకోవాలి. ఎర్రగడ్డలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌లో డ్రగ్ ట్రీట్‌మెంట్ సెంటర్ (డీఆర్‌ఐ)లో వైద్యచికిత్స అందిస్తున్నారు.

# అతివల హితం.. నగదు రహితం

పెద్దపల్లి : పెద్దపల్లి మండలం కాపులపల్లిలోని స్వశక్తి సంఘాల మహిళలు ప్రతి నెలా చెల్లించాల్సిన పొదుపు, రుణ వాయిదాల డబ్బును వినియోగదారుల సేవా కేంద్రం (సీఎస్‌సీ) నిర్వాహకురాలికి అప్పగించారు. ఆమె సంఘాల ఖాతాల్లో జమ చేయలేదు. తర్వాత గుర్తించిన సభ్యురాళ్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

చిగురుమామిడి మండలం లంబాడిపల్లిలో స్వశక్తి మహిళలు నెలవారీ వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించారు. అయితే నేరుగా బ్యాంకుకు వెళ్లకుండా వీవోఏ (గ్రామైక్య సంఘం) ప్రతినిధులకు ఇచ్చారు. వారు ఖాతాల్లో జమ చేయకపోవడంతో మోసపోయినట్లు గుర్తించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు చిరు వ్యాపారాలు, చిన్న తరహా పరిశ్రమలతో ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు అందుబాటులో లేకపోవడంతో పొదుపు సొమ్ము, రుణ కిస్తీల చెల్లింపులో ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఈ క్రమంలో మహిళల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని బ్యాంకులో



జమ చేయకుండా డబ్బు కాజేస్తున్నారు. ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు సెర్ప్ కార్యాచరణ చేపట్టింది. జిల్లాకు ఒక మండలంలో ప్రయోగాత్మకంగా నగదు రహిత లావాదేవీలపై అతివలకు అవగాహన కల్పించేందుకు సన్నద్ధమవుతోంది.

**పక్కదారి పడుతున్న పొదుపు సొమ్ము**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 42,504 సంఘాల్లో సుమారు 5 లక్షల మందికి పైగా సభ్యులున్నారు. ఈ ఏడాది రూ.2,555.15 కోట్ల రుణ లక్ష్యం విధించారు. గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకులు లేకపోవడంతో మహిళలు స్థానిక సీఎస్‌సీ కేంద్రాలు, వీవోఏలు, గ్రామైక్య సంఘాల ప్రతినిధులకు ఇచ్చిన రుణ కిస్తీ డబ్బులు పక్కదారి పడుతున్నాయి. ఖాతాలో జమ కాలేదని గుర్తించిన తర్వాత బాధితులు ప్రశ్నించినా బాధ్యులు చేతులెత్తేస్తుండటంతో రూ.లక్షల్లో నష్టపోతున్నారు.

**ఇదీ ప్రణాళిక..**

ప్రతి జిల్లాలో ఒక మండలాన్ని నగదు రహిత లావాదేవీల అమలుకు ప్రయోగాత్మకంగా ఎంపిక చేస్తారు.

రుణ కిస్తీ, పొదుపు డబ్బులను బ్యాంకులో జమ చేసే విధానంపై మహిళలకు అవగాహన కల్పిస్తారు.

ఫోన్‌పే, గూగుల్‌పే, ఇతర ఆన్‌లైన్ లావాదేవీలపై సభ్యుల సందేహాలు నివృత్తి చేస్తారు. సభ్యులు ఇంటి వద్దనే ఉంటూ బ్యాంకు ఖాతాకు నగదు చెల్లించేలా సన్నద్ధం చేస్తారు.

ప్రతి లావాదేవీకి రశీదు

స్వశక్తి మహిళలు ఇప్పటి వరకు బ్యాంకు లావాదేవీల సమయంలో రశీదులు తీసుకోవడం లేదు. నమ్మకంతో పొదుపు రుణ కిస్తులు చెల్లిస్తున్నా ఏదో ఒక చోట మోసాల బారిన పడుతున్నారు. ఈ పరిస్థితికి తావు లేకుండా డిజిటల్ బ్యాంకింగ్ విధానం ఏర్పాటు చేస్తున్నాం. ప్రతి సభ్యురాలూ నగదు రహిత లావాదేవీలు నిర్వహించేలా అవగాహన కల్పిస్తాం. రవికుమార్, అదనపు ప్రాజెక్టు అధికారి, సెర్ప్

# మరోసారీ ముంపు ముప్పు!

ఖమ్మం: వర్షాకాలం సమీపిస్తుండటంతో ఖమ్మం జిల్లాలోని నగరపాలిక, పురపాలికల్లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఏటా వానాకాలంలో భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమయ్యే లోతట్టు ప్రాంతాలకు ఈసారీ ముంపు ముప్పు తప్పేలా లేదు. ముందస్తు సన్నద్ధత చర్యల్లో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు 100 రోజుల ప్రణాళిక రూపొందించామని అధికారులు చెబుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులకు పూనుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**ఖమ్మంలో కన్నీరు‘మున్నేరు’..**

ఖమ్మం నగరంలో మున్నేరు పరీవాహక కాలనీలు సారథినగర్, మంచికంటినగర్, వెంకటేశ్వరకాలనీ, పద్మావతినగర్, కాలొడ్డు, బొక్కలగడ్డ, మోతీనగర్ గతేడాది జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇళ్లల్లోకి వరద నీరు చేరటంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. రామన్నపేట, దానవాయిగూడెం కాలనీలకు ఏటా వరద ముప్పు తప్పటం లేదు. వరద కష్టాలకు చెక్ పెట్టేందుకు మున్నేరుకు రెండువైపులా చేపట్టిన కరకట్టల నిర్మాణ పనులు కొనసా..గుతున్నాయి. నిజాంపేట, చెరువుబజార్, వరదయ్యనగర్‌తోపాటు నగరంలోని ప్రధాన రహదారుల వెంట మురుగునీటి వ్యవస్థ సక్రమంగా లేదు. కాల్వలు పొంగి వర్షం నీరు రోడ్లపై ప్రవహిస్తుంది. మురుగుకాల్వల ఆక్రమణలతో పరిస్థితి మరింత దిగజారింది. ఈసారి వరద తీవ్రతను ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా ఉన్నామని కమిషనర్ అభిషేక్ అగస్త్య చెబుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలకు ప్రత్యేకాధికారులను నియమించి.. స్థానికంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం చేరవేస్తామని తెలిపారు. వర్షాకాలం సన్నద్ధత, సహాయక చర్యలపై 100 రోజుల ప్రణాళికను జూన్ 2 నుంచి అమలుచేస్తామన్నారు.

**మధిరలో మారని తీరు**

మధిర అంబారిపేట పెద్దచెరువుకు రాతి కరకట్ట లేకపోవటం వల్ల ఏటా వానాకాలంలో వరదరాఘవాపురం, హనుమాన్‌కాలనీ, ముస్లింకాలనీకి వరదనీరు పోటెత్తుతుంది. మట్టి కట్ట స్థానంలో కిలోమీటరు మేర రాతికట్ట నిర్మిస్తేనే ముంపు సమస్యకు కొంత అడ్డుకట్ట వేయొచ్చు. బంజారాకాలనీ, లడక్‌బజార్‌లో వరద కాల్వ ఆక్రమణకు గురవటం వల్ల చిన్నపాటి వర్షానికే ఇళ్లల్లోకి, రహదారులపైకి భారీగా వరద నీరు చేరుతుంది.

కరకట్ట నిర్మాణం కలేనా? వైరా

నల్లచెరువు వాగు నిండి ఏటా ఇందిరమ్మ కాలనీ ముంపునకు గురవుతోంది. సుమారు 200 ఇళ్లల్లోకి వరద చేరుతోంది. ఇక్కడ ముంపు నివారణకు కరకట్ట నిర్మించాలనే డిమాండ్ 15ఏళ్లుగా అమలుకు నోచుకోవటం లేదు. వైరా రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటే సమీపంలోని రాజీవ్‌కాలనీకి వరద పోటెత్తుతుంది. ఏటా తూతూమంత్రంగా రక్షణ చర్యలు చేపడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. సత్రంబజార్, శాంతినగర్, సంతబజార్‌లు ఏటా వరద గుప్పిట్లో చిక్కుకుంటాయి. మురుగునీటి వ్యవస్థను పటిష్ఠపరిస్తేనే ముంపు ముప్పు తొలగుతుందని స్థానికులు చెబుతున్నారు.

మురుగునీటి వ్యవస్థ అస్తవ్యస్తం

సత్తుపల్లిరాజీవ్‌కాలనీ, ఎన్టీఆర్‌నగర్‌ను ఏటా వరదనీరు ముంచెత్తుతుంది. శివారు ప్రాంతాలను ఆనుకుని ఉన్న మురుగుకాల్వలు పొంగి ఇళ్లల్లోకి వరద నీరు చేరుతుంది. మురుగునీటి వ్యవస్థను మెరుగుపరిస్తేనే ముంపు ముప్పును తప్పించవచ్చు.

# కర్షకా..పారించకు రసాయనాల ధార

కరీంనగర్ : అధిక దిగుబడులకు ఆశపడి అన్నదాతలు ఎక్కువ మొత్తంలో రసాయన ఎరువులు వాడుతున్నారు. దీంతో నేలలో సారం తగ్గిపోతుంది. విచ్చలవిడిగా ఎరువుల వినియోగంతో ఆహారం విషతుల్యమై మానవుల ఆరోగ్యం దెబ్బతింటుంది. వీటిని అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సేంద్రియ వ్యవసాయ విధానాన్ని ప్రోత్సహిస్తున్నా.. రైతుల్లో మార్పు రావట్లేదు. మోతాదుకు మించి నత్రజని వినియోగిస్తే భూమి నిస్సారంగా మారుతుంది. మనుషుల్లో క్యాన్సర్ లాంటి వ్యాధులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. రైతుల ఆలోచన విధానంలో మార్పు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**కాలుష్యానికి దోహదం**

పంటలపై రసాయన ఎరువుల వాడకంతో నీటి కాలుష్యం ఏర్పడుతుంది. నీటిలో ప్రాణవాయువు పరిమాణం తగ్గిపోతుంది. ఆ నీటిలో ఉండే జీవరాశులు క్రమేణా నశించిపోతాయి. వాయు కాలుష్యం ఏర్పడి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నేలలో కార్బన్ పదార్థం కోల్పోయి నేలలో ఆమ్లత్వం పెరుగుతుంది. జీవ వైవిధ్యం దెబ్బతింటుంది.

**భారీగా పెరిగిన వినియోగం**



జిల్లాలో 2023-24, 2024-25 సంవత్సరానికి సంబంధించి వానాకాలం, యాసంగి రెండు సీజన్లలో కలిపి ఏకంగా 1,62,282 మెట్రిక్ టన్నుల యూరియాను వినియోగించారు. ఇది సాధారణ వినియోగం కన్నా చాలా ఎక్కువ అని వ్యవసాయ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.సాధారణ నేలలో అయితే నత్రజని(ఎన్), భాస్వరం(పీ), పొటాషియం(కే)లను 4:2:1 నిష్పత్తిలో ఎరువులను వినియోగించాలి. ఒక ఎకరానికి సుమారుగా రెండున్నర సంచుల యూరియా, ఒక సంచి డీఏపీ, ఒకటిన్నర సంచి కాంప్లెక్స్ ఎరువులు వాడాలి.

**అవగాహన కల్పిస్తున్నాం**జిల్లాలో రసాయన ఎరువుల వినియోగం భారీగా పెరిగింది. అంచనాల కు మించి రైతులు యూరియా వినియోగిస్తున్నారు. మోతాదుకు మించి వాడకంతో భూమి, నీరు, వాయు కాలుష్యం దెబ్బతిని అంతిమంగా పర్యావరణానికి తీరని నష్టం జరుగుతుంది. మనుషుల్లో సైతం క్యాన్సర్ జబ్బులు పెరుగుతాయి. ఈ అనర్థాలపై రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

# ఎస్ఆర్వోల ఏర్పాటు ఎన్నడో?

రాయికల్ : జిల్లాలోని బుగ్గారం మండలంలో ఇటీవల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యటించిన సమయంలో ధర్మపురిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం (ఎస్ఆర్వో) ఏర్పాటు చేయాలని జిల్లా నేతలు కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. జిల్లాలోని అయిదు పట్టణాలకు మూడు పట్టణాల్లో కార్యాలయాలు ఉండగా ధర్మపురి, రాయికల్‌లో లేవు. దీంతో జగిత్యాలకు వెళ్లాల్సి వస్తోంది.

**రవాణా భారం**

జగిత్యాల జిల్లాలో 20 మండలాలు, అయిదు పురపాలికలు ఉన్నాయి. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మల్యాలలో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండటంతో ఆయా కార్యాలయాల పరిధిలో నిత్యం వ్యవసాయేతర, భూములు, భవన, వివాహ రిజిస్ట్రేషన్లు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లు భూ భారతి చట్టం ద్వారా అన్ని మండల కేంద్రాల్లో చేస్తున్నారు. కానీ వ్యవసాయేతర రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉన్న పట్టణాలకు వెళ్లాల్సి రావడంతో దరఖాస్తుదారులకు రవాణా భారం తప్పడం లేదు. మెట్‌పల్లి కార్యాలయ పరిధిలో మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి మండలాలు.. కోరుట్ల పరిధిలో కోరుట్ల, మేడిపల్లి, బీమారం, కథలాపూర్ మండలాలు.. మల్యాల పరిధిలో మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి మండలాలు.. జగిత్యాల పరిధిలో అధికంగా 8 మండలాలు జగిత్యాల, జగిత్యాల రూరల్, సారంగాపూర్, బీర్‌పూర్, రాయికల్, బుగ్గారం, ధర్మపురి, వెల్గటూరు, ఎండపల్లి మండలాలకు సేవలు అందిస్తున్నాయి.

పలు మండలాలు ఆయా పట్టణాలకు సుమారు 20 కి.మీ.ల నుంచి 35 కి.మీ.ల దూరంలో ఉండటం, ఒక్కోసారి సాంకేతిక లోపాలతో రెండు, మూడు సార్లు రావాల్సి వస్తుండటంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన పురపాలికలుగా ఏర్పడిన ధర్మపురి, రాయికల్ పట్టణాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ప్రారంభించాలని కోరుతున్నారు.

**ఆదాయం వచ్చినా..**

రాయికల్ పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో 2018లో పైలట్ ప్రాజెక్టులో భాగంగా వ్యవసాయేతర భూముల కొనుగోళ్లను ప్రభుత్వం ప్రారంభించగా రెండేళ్లు రిజిస్ట్రేషన్లు నిర్వహించారు. ఏటా 1520 రిజిస్ట్రేషన్లు, 420 వివాహాలు నమోదు చేయగా రూ.2 కోట్ల ఆదాయం వచ్చింది. మళ్లీ ప్రభుత్వం ఆ సేవలు నిలిపివేసి జగిత్యాలకు తరలించింది. మండలవాసులకు సేవలు దూరమవడంతో పలుమార్లు ఆందోళనలు చేపట్టి వినతిపత్రాలను అందజేశారు.

# వాహనాలు ఇలా.. పారిశుద్ధ్య నిర్వహణ ఎలా?

సిరిసిల్ల : ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. వరద ముంపు పొంచిఉన్న నేపథ్యంలో మురుగుకాల్వల్లో పేరుకుపోయిన పూడిక తొలగించాల్సి ఉంది. ఖాళీ స్థలాల్లో నీరు నిల్వకుండా చూడాలి. ఇళ్ల నుంచి చెత్తను సేకరించాలి. ఇలా ఒకటేమిటి పురపాలికల్లో 62 అంశాలతో వంద రోజుల ప్రణాళిక అమలుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. జూన్-2 నుంచి సెప్టెంబరు-9 వరకు ఈ కార్యక్రమాలు చేపట్టాలి. ఈ పనులన్నీ చేయాలంటే పురపాలికల్లో పారిశుద్ధ్య సిబ్బందితోపాటు వాహనాలు బాగుండాలి. కాగా కనీస నిర్వహణ లేక వాహనాలు ఒక్కొక్కటిగా మూలకు చేరుతున్నాయి. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ పురపాలికల్లో చెత్తసేకరణకు 84 వాహనాలున్నాయి. వీటిలో 15 వాహనాలు మరమ్మతులకు గురయ్యాయి. మరికొన్ని పూర్తిగా పనిచేయడంలేదు. సిరిసిల్ల పురపాలికలో పొక్లెయిన్ పనిచేయడంలేదు. దీని ప్రభావం పారిశుద్ధ్య నిర్వహణపై పడుతోంది. **మరమ్మతుల కేంద్రంలేక..**

జిల్లాలోని రెండు పురపాలికల్లో పారిశుద్ధ్య వాహనాల నిర్వహణకు ప్రతి నెలా రూ.3 లక్షలు ఖర్చవుతోంది. వీటిని సాధారణ నిధుల నుంచి వినియోగించాలి. ప్రస్తుతం రెండు పురపాలికల్లోనూ నిధుల కొరత ఉంది. దీంతో వాహనాల నిర్వహణ భారంగా మారుతోంది.రెండు పురపాలికల్లో అన్ని రకాల పారిశుద్ధ్య వాహనాలు కలిపి వందకుపైగా ఉన్నా.. వాటిని వినియోగించడం మినహా కనీస నిర్వహణ లేదు.అయిల్ మార్చడం, గ్రీసింగ్, టైర్లలో గాలి వంటివాటితో పాటు చిన్నపాటి మరమ్మతులు సైతం చేసుకునేలా కేంద్రం ఉండాలి. వాహనాలు నడిచినన్ని రోజులు నడిపించి మొరాయించగానే పక్కన పెట్టేస్తున్నారు.మరమ్మతులకు గురైన వాహనాలు పెరిగినప్పుడు ఆన్‌లైన్‌లో టెండర్లకు వెళ్తున్నారు.

# దారికి రావు.. దరి చేరవు



హైదరాబాద్ : నగరంలో రద్దీ ప్రాంతాల్లో పాదచారులు రోడ్డు దాటాలంటే గుండె దిటవు చేసుకోవాల్సిందే. రోడ్డు దాటేందుకు అనుకూల సౌకర్యాలు లేక పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు తరచూ వెలుగుచూస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలో చాలా చోట్ల పాదచారుల వంతెనలు నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసినా కొన్ని కార్యాచరణకు నోచుకోలేదు. మరోవైపు నిర్మాణం పూర్తయినవి అందుబాటులోకి తీసుకురాలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. హైటెక్‌సిటీలోని పలు పర్యాటక ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటుకు చాలాకాలంగా డిమాండ్లున్నాయి. ముఖ్యంగా కొత్తగూడలోని బొటానికల్‌గార్డెన్, మాదాపూర్‌లోని శిల్పారామం ఎదుట వీటి అవసరం ఎక్కువగా ఉంది. కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌కు నిత్యం సందర్శకులతోపాటు వందలాది మంది వాకింగ్‌కు వస్తుంటారు. సందర్శకులు తమ వాహనాలను ప్రధాన గేటు ఎదురుగా రోడ్డు అవతలి వైపు నిలపాల్సి ఉంటుంది. విశాలంగా ఉండే ఈ రోడ్డు దాటే క్రమంలో వాహనాలు ఢీకొని గాయాలపాలవుతున్నారు.

జీహెచ్ఎంసీ నాలుగేళ్ల క్రితం ఇక్కడ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రతిపాదనలు చేసింది. 220కేవీ విద్యుత్ తీగలు ఉండటంతో అది కార్యరూపం దాల్చలేదు. వాకర్స్ విజ్ఞప్తి మేరకు మరో చోట నిర్మించే అంశాన్ని పరిశీలిస్తామన్న అధికారులు ఆ తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. పాదచారులు రోడ్డు దాటేందుకు ప్రత్యేకంగా సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేసినా అది సక్రమంగా పనిచేయడం లేదు.

శిల్పారామం వద్ద ఇదే పరిస్థితి. జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి వైపు వెళ్లే సందర్శకులు కచ్చితంగా రోడ్డు దాటాల్సి ఉంటుంది.

కొండాపూర్‌లోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద రోడ్డు దాటడం రోగులకు కష్టతరంగా మారింది. ఇక్కడున్న యూటర్న్‌ను ట్రాఫిక్ పోలీసులు మూసివేసి దిమ్మెలు ఏర్పాటు చేశారు.

**ఏడాదైనా ఆరంభమే కాలేదు..**

రాయదుర్గం మల్కం చెరువు వద్ద రూ.కోటితో పాదచారుల వంతెన నిర్మించారు. మూడేళ్ల క్రితం నిర్మాణం ప్రారంభించారు. ఆది నుంచీ పనులు నత్తనడకన సాగి ఏడాది కిందట దాదాపు నిర్మాణం పూర్తయ్యింది. రెండు వైపులా ఎస్కలేటర్‌లు, లిఫ్టులూ బిగించారు. వంతెన చెంత ఫ్లోరింగ్, ఎస్కలేటర్లు, లిఫ్టులకు విద్యుత్ కనెక్షన్ పనులు మిగిలి ఉన్నాయి. ఆరు నెలలుగా ఆ పనులు చేపట్టకుండా తాత్సారం చేస్తున్నారు.

**అమీర్‌పేటలో ఏడేళ్లుగా..**

అమీర్‌పేట కమ్మసంఘం, ఆర్ఎస్ బ్రదర్స్, అమీర్‌పేట కూడలిలో రోడ్డు దాటడం చాలా కష్టం. మెట్రో కారిడార్ నిర్మాణం అనంతరం పిల్లర్లను కలుపుతూ రహదారి విభాగినులు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి రోడ్డు దాటడం మరింత ఇబ్బందిగా మారింది. అమీర్‌పేట చౌరస్తా నుంచి కమ్మసంఘం వరకు ఎక్కడా రోడ్డు దాటే అవకాశంలేదు. కమ్మసంఘం హాల్ ముందున్న యూటర్న్ వరకు నడిచి రోడ్డు దాటాల్సిందే. ఈ సమస్య నివారించడానికి జీహెచ్ఎంసీ అధికారులు చర్మాస్, ఆర్ఎస్‌బ్రదర్స్ షోరూంల వద్ద పాదచారుల వంతెనకోసం ఏడేళ్లకిందట పనులు ప్రారంభించి అర్ధంతరంగా నిలిపివేశారు. స్థానికంగా ఓ షోరూం వారు కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయని జీహెచ్ఎంసీ అధికారి తెలిపారు.

**అవసరం లేని చోట నిర్మించి..**

వరంగల్ జాతీయ రహదారిపై ఉప్పల్-రామంతాపూర్ మార్గంలో ఉప్పల్ ఐడీఏలో రూ.3 కోట్లతో ఫుట్ ఓవర్ బ్రిడ్జిని మూడేళ్ల క్రితం నిర్మించారు. నిధుల వృథా తప్ప ఎవరూ ఈ వంతెనను ఎక్కి రోడ్డు దాటేందుకు ఇష్టపడటం లేదు. వంతెన నిర్మించిన చోట ట్రాఫిక్ పెద్దగా ఉండకపోవడమే కారణం. వాస్తవానికి ఈ వంతెన రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్(హెచ్‌పీఎస్) ప్రాంతంలో నిర్మించాల్సిందిగా ప్రతిపాదనలు చేశారు. ఎవరికీ అవసరం లేని చోట నిర్మించి నిధులు దుర్వినియోగం చేశారు.

# శిలాజాలు.. చారిత్రక ఆనవాళ్లు



హైదరాబాద్ :తెలంగాణ చరితే కాదూ.. యావత్ ప్రపంచ చరిత్ర ప్రాచీనతను తెలియజెప్పే సజీవ సాక్ష్యాలు 'శిలాజాలు'(ఫాజిల్స్). మానవుడు పుట్టకముందు భూమిపై సంచరించిన రాక్షస బల్లులు (డైనోసార్లు), ఇంకా మరెన్నో పూర్వకాలపు జీవులు, అప్పటి పరిస్థితుల గురించి శిలాజాల ద్వారానే ఎన్నో విశేషాలు తెలిశాయి. చాలామంది శిలాజం అంటే మనకు సంబంధం లేని విషయం అనుకుంటారు. కానీ లక్షల ఏళ్ల క్రితం బతికిన, ఇప్పుడున్న మనం ఎప్పటికీ చూడలేని జీవుల ఆకారం, వాటి ఆహారం, ఇంకా ఎన్నో విశేషాలను ఈ రోజు మనం తెలుసుకుంటున్నామంటే అది ఫాజిల్స్ వల్లే సాధ్యమైంది. ఫాజిల్ మ్యాన్ ఆఫ్ తెలంగాణగా పేరొందిన యువశాస్త్రవేత్త సముద్రాల సునీల్ మంచిర్యాల జిల్లా సంపుటం గ్రామంలో పరిశోధన చేస్తుండగా తవ్వకాల్లో దొరికిన చెట్టు కాండం, కొమ్మలకు సంబంధించిన 'శిలాజాలు' ప్రస్తుతం రవీంద్రభారతి కారిడార్‌లో భద్రపరిచారు.

**ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిందే..**

అప్పట్లో ఇప్పుడున్న ఖండాలు లేవు. ఆ తర్వాత భూమి లోపల జరిగిన అంతర్గత పరిణామాల వల్ల విభజన ఏర్పడింది. తొలి రోజుల్లో తెలంగాణను గోండ్వానా ల్యాండ్ అనేవారట. ఈ ప్రదేశంలో 20కోట్ల ఏళ్లక్రితమే చెట్లున్నాయని చెప్పడానికి ఆనవాళ్లుగా మిగిలినవి శిలాజాలు. ఇవి రవీంద్రభారతిలో ఎందుకు పెట్టారంటే చాలామంది తెలంగాణలో కరవుందని, పంటలు ఎలా పండించాలో తామే నేర్పించామని చెబుతుంటారు. అలాంటి వారికి కోట్ల ఏళ్ల క్రితమే ఈ నేల పచ్చని చెట్లతో పరిఢవిల్లింది అని చెప్పడానికే ఇదొక సూచిక. నగరంలోని బీఎం బిర్లా సైన్స్ సెంటర్‌లో మనకు కనిపించే డైనోసార్ కూడా ఇదే మంచిర్యాల జిల్లా వేమనపల్లిలో దొరికింది. అది 6 కోట్ల సంవత్సరాల నాటిది. తెలంగాణకు గొప్పచరిత్ర ఉందని చెప్పడానికి ఆధారం ఇది.

**ప్రాచీనత లెక్కించి..**

చెట్లు, జంతువులు, మానవులు మరణించిన తరువాత భూమిలో విస్తాపన చెందినప్పుడు అణువణువు కరిగిపోతుంది. కొన్ని అసాధారణ పరిస్థితుల్లో నిక్షిప్తమై శిలాజాలుగా మిగిలిపోతాయి. ఆ శిలాజం వయసును బట్టి ప్రాచీనతను నిర్ధారిస్తారు. తెలంగాణకు 20 కోట్ల సంవత్సరాల ఘన చరిత్ర ఉందని చెప్పడానికి నిలువెత్తు సాక్ష్యం రవీంద్రభారతిలో ఉన్న శిలాజాలు అని వివరిస్తున్నారు రాష్ట్ర సాంస్కృతిక శాఖ సంచాలకుడు పరిశోధకుడు మామిడి హరికృష్ణ.

# అదను దాటితే అన్నదాతకు నష్టం



ధర్మారం : ఎంతటి వర్షాభావ పరిస్థితుల్లోనూ నందిమేడారం జలాశయం ఎండిపోయిన సందర్భాలు లేవు. అరకొర వర్షాలు కురిసినా రెండు పంటలకు సరిపడా సాగునీరందిస్తోంది. ఈ జలాశయం నుంచి నందిమేడారం శివారులోని 593.09 ఎకరాలకు సాగునీరందుతోంది. ధర్మారం మండలంతో పాటు వెల్గటూరు, ఎండపల్లి, పాలకుర్తి మండలాల్లోని వేలాది ఎకరాలకు జీవనాధారంగా ఉంటోంది. అయితే జలాశయంలో నిండా నీళ్లున్నా అదనులో పంటలు సాగు చేయకపోవడంతో ఆశించిన దిగుబడులు రావడం లేదు.దశాబ్దం క్రితం వరకు రోహిణి కార్తెలో నార్లు పోసుకునేందుకు వీలుగా నీటిని వదిలేవారు. ఆ తర్వాత ఏటా ఆలస్యంగా వదులుతున్నారు. నాలుగేళ్లుగా ఆగస్టులో వరి నార్లు పోస్తున్నారు. చాలా మంది రైతులు ఇంటి అవసరాల కోసం దీర్ఘకాలిక సన్న రకాలు సాగు చేస్తుండటంతో డిసెంబరు వరకు పంట కోతకు వస్తోంది. మళ్లీ జనవరిలో యాసంగి పంటకు సాగునీరు విడుదల చేస్తుండగా నాట్లు పూర్తయ్యేసరికి వేసవి వస్తోంది. కోతలు పూర్తయ్యేసరికి వర్షాకాలం మొదలవుతోంది. ఈ నేపథ్యంలో వానాకాలం పంటకు రోహిణి కార్తెలో నీటిని విడుదల చేస్తే జులై మొదటి వారం నాటికి వరి నాట్లు పూర్తయి, వాతావరణం అనుకూలించనుంది. ఇటీవల యాసంగిలో జిల్లాలో వరిలో ఎకరాకు 30 క్వింటాళ్లకు పైగా దిగుబడి రాగా, నందిమేడారం చెరువు ఆయకట్టులో 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు మాత్రమే నమోదైంది. ఈ మేరకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తే రైతులకు ప్రయోజనం కలగనుంది. **ఆలస్యమైతే పెట్టుబడుల భారం**

ఆలస్యంగా నార్లు పోస్తే తెగుళ్లు, చీడపీడల బెడద ఎక్కువగా ఉంటుంది. సస్యరక్షణకు ఖర్చులు పెరుగుతాయి. దీర్ఘకాలిక రకాల సాగుకు జూన్‌లో నారు పోసి జులై మొదటి వారంలోగా నాట్లు వేస్తే మంచి దిగుబడికి అవకాశం ఉటుంది. నాట్లు ఆలస్యమైతే పొట్ట దశకు వచ్చేసరికి చలి తీవ్రతతో గొలక బయటకు రాదు. పూత సరిగా రాక తాలు ఎక్కువై దిగుబడి తగ్గుతుంది.డా.టి.వినోద్‌కుమార్, వ్యవసాయ శాస్త్రవేత్త, రామగిరి కేవీకే

**రైతులకు అవగాహన కల్పిస్తాం** రెండు పంటలకూ నీళ్లందే అవకాశం ఉన్నప్పుడు వానాకాలంలో సాగు ఆలస్యమైతే ఆ ప్రభావం యాసంగిపై పడుతుంది. వరి సాగు ఆలస్యమయ్యే కొద్దీ అందుకు తగిన రకాలు మాత్రమే ఎంచుకోవాలి. దీర్ఘకాలిక రకాలను ఆలస్యంగా సాగు చేస్తే దిగుబడి రాదు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నందిమేడారం రైతులకు అవగాహన కల్పిస్తాం.

# వానొస్తే వణుకే..!

కోరుట్ల : కోరుట్ల పట్టణంలో కురిసిన చిన్నపాటి వర్షానికే లోతట్టు కాలనీలు జలమయమవుతుండగా.. వర్షాకాలంలో వరద ముప్పు ఎంత తీవ్రంగా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో కురిసిన వర్షానికి ప్రకాశంరోడ్‌లోని కాలనీలు జలమయమయ్యాయి. ప్రధాన మురుగు కాలువ పొంగి వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. వరద నీరు రోడ్లపై పారడంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రాని పరిస్థితులు నెలకొన్నాయని బాధితులు తెలిపారు. వేసవిలో ఒక్కసారిగా కురిసిన వర్షానికే రోడ్లపై వరద నీరు ప్రవహించడంతో రానున్న రోజుల్లో తీవ్ర ఇబ్బందులు తలెత్తనున్నట్లు వాపోయారు. ఏటా ప్రకాశంరోడ్, ఆదర్శనగర్, ముత్యాలవాడలోని కాలనీలు జలమయమవుతూ స్థానికుల్లో వణుకు పుట్టిస్తున్నాయి.

**ఆక్రమణలే అసలు కారణం**

కోరుట్ల పట్టణంలో ప్రధానంగా మద్దుల చెరువు మత్తడి దూకిన వరద నీరు ఫుల్‌వాగులో కలిసేందుకు గతంలో సుమారు 10-15 అడుగుల



వెడల్పుతో కాలువ ఉండేది. ఆ కాలువ పట్టా భూముల్లోంచి ఉండటంతో ఇరువైపులా స్థిరాస్తి వ్యాపారులు కాలువను ఆక్రమించారు. కాలువ భూమిలో పలుచోట్ల ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, కొన్నిచోట్ల రోడ్డును నిర్మించారు. దీంతో పెద్దకాలువ కాస్తా మూడు, నాలుగు అడుగులకు తగ్గింది. మద్దుల చెరువు పైప్రాంతంలో చాలాకాలనీలు ఏర్పడటంతో చిన్నపాటి వర్షానికి చెరువు పూర్తిగా నిండి మత్తడి దూకుతుంది. ఈ నీటితోపాటు తిలక్‌రోడ్, గాంధీరోడ్, ముత్యలవాడ, గోదాం ఏరియా, అయిలాపూర్ నుంచి వచ్చే నీరంతా కేవలం ప్రకాశం రోడ్‌లోని ప్రధాన మురుగు కాలువ గుండా మాత్రమే వెళ్తుంది.

పైప్రాంతం నుంచి వచ్చే వరద వెళ్లేందుకు ప్రకాశంరోడ్‌లో కాలువలు లేకపోవడంతో పదుల సంఖ్యలో రోడ్లు జలమయమవుతున్నాయి. ఇళ్లలోకి వరద చేరుతోంది. ఏటా వరదలు ముంచెత్తుతుండటంతో ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యే, పురపాలక సంఘ అధికారులు సందర్శించి వెళ్లడమే తప్ప శాశ్వత చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.తగిన చర్యలు తీసుకుంటాం


వరద ప్రాంతాల్లో పురపాలక ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నాం. మురుగు కాలువలను పూర్తిగా శుభ్రం చేయించి వరద నీరు వెళ్లేలా చూస్తున్నాం. భారీ వర్షాల సమయంలో కాలనీలు జలమయమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. లోతట్టు ప్రాంతాల్లో వరదల నివారణ కోసం ఉన్నత అధికారుల, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నాం.మారుతిప్రసాద్, మున్సిపల్ కమిషనర్

# బల్దియాలో చెల్లుతాయట.. డివిజన్లలో చెల్లవట

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్లలో బహిరంగ మురుగుకాల్వలను తొలగించి మట్టి పైపులతో డ్రైనేజీ పనులు చేస్తున్నారు. రహదారి విస్తరించడంతోపాటు అపరిశుభ్రత లేకుండా ఉంటుంది. గత అయిదారు ఏళ్లుగా అన్ని ప్రాంతాల్లో ఇలాంటి మట్టి పైపులనే వాడారు. వీటి నాణ్యత విషయంలోనూ ఏనాడూ పరిశీలించకుండానే చకచకా వేసి సిమెంటుతో కప్పేశారు. స్థానికంగా లభించే పైపులు కాకుండా ఇతర ప్రాంతాల్లోంచి తెప్పించిన వాటిల్లో నాణ్యత, మందం, రెండేళ్ల గ్యారెంటీ ఉన్నవి వేస్తున్నట్లు చెబుతున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి హామీ నిధులతోపాటు ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో లెక్కలేనన్ని పనులు చేశారు. వీటన్నింటికి ఇలాంటి పైపులే వాడగా.. ఇటీవల ఈ పైపుల విషయంలో గందరగోళం నెలకొంది.

**ఒకే రకం.. అయినా పనికి రావా?**

నగర పాలిక కార్యాలయం వెనుకాల మురుగుకాలువ నిర్మించేందుకు ఐఎస్ఐ ముద్ర గల మట్టి పైపులను తెప్పించారు. వీటిపై తెల్లని రంగుతో వేసిన ముద్రనే ఉంది. ఈ పైపులే ఇతర డివిజన్లలో పనులు చేసేందుకు తీసుకొచ్చారు. నగరపాలికలో ఈ పైపులతో పనులు చేసేందుకు సిద్ధమవ్వగా, డివిజన్లలో మాత్రం ఆ పైపులు పనికి రావని పేర్కొంటూ



ఇంజినీరింగ్ అధికారులు పనులు ఆపేశారు. శ్రీనగర్, సప్తగిరికాలనీలో రూ.30 లక్షలతో నిర్మించే డ్రైనేజీ, ఛాంబర్ల పనులను ఆరు నెలల కిందట ఆపేశారు. ఇన్ బిల్ట్ అంటే మట్టితో ఐఎస్ఐ ముద్ర వేసిన పైపుల తయారీ తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లోనే లేదని ఇతర ఇంజినీరింగ్ అధికారులు అంటున్నారు. గత కొన్ని ఏళ్లుగా ఇవే వాడుతున్నట్లు వివరించారు.

**నాణ్యత లేకపోతే రికవరీ చేస్తారా?**

ఐఎస్ఐ తెల్లని రంగుతో ముద్రించిన పైపులనే నగరమంతా వాడుతుండగా కొత్తగా ఇన్‌బిల్ట్ ముద్రించిన మట్టి పైపులను వాడాలని ఒకరిద్దరు ఇంజినీరింగ్ అధికారులు కొర్రీలు పెట్టడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు వాడిన పైపులు నాణ్యత లేకపోతే రికవరీ చేస్తారా? అని పలువురు మాజీ కార్పొరేటర్లు ప్రశ్నిస్తున్నారు. ఏళ్లుగా వీటితోనే పనులు చేస్తుండగా ప్రస్తుతం అడ్డుకోవడం ఏమిటని ఆగ్రహిస్తున్నారు. ఈ విషయాన్ని సంబంధిత ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా పనులు ఆగినట్లు తెలియదని, పైపుల విషయాన్ని పరిశీలిస్తామని పేర్కొన్నారు.

# కూలిన గదులు.. కుదరని పనులు

కర్నూలు : ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారుస్తామని గొప్పలు చెప్పిన వైకాపా ప్రభుత్వం..నిధులు ఇవ్వకుండా విద్యార్థులకు తిప్పలు మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలో 75 పాఠశాల భవనాలు నేలమట్టం చేశారు. పూర్తిస్థాయిలో నిధులు ఇవ్వకపోవడంతో 2023 చివరి నాటికే అసంపూర్తిగా ఆగిపోయాయి. ఇప్పటి వరకు వాటిని మళ్లీ చేపట్టనే లేదు. 80 శాతం వరకు పూర్తయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టింది. మిగతా పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది. మొదటి విడత కింద ఉమ్మడి జిల్లాకు సుమారు రూ.41.6 కోట్లు కేటాయించింది. వేసవి సెలవులు ముగిసేలోగా చివరి దశ పనులు పూర్తిచేస్తే విద్యార్థులకు సౌకర్యాలు మెరుగవుతాయని తల్లిదండ్రులు కోరుతున్నారు.

**పదండి ముందుకు బడిని బాగు చేసుకుందాం**

అక్షరాలు నేర్పిన బడి అంటే ఎవరికైనా మమకారమే.. మనం ఓ స్థాయికి చేరాక.. తిరిగి అదే పాఠశాలకు వెళ్లినప్పుడు వచ్చే ఉద్వేగాన్ని మాటల్లో చెప్పలేం.. అలాంటి విద్యాలయాలు పాడై ఉంటే గుండె తరుక్కుపోతుంది.. చదివిన బడిని బాగు చేయడంలో మనమూ ఓ



చేయి కలుపుదాం.. మనకు ఎన్నో గుర్తులు.. అనుభూతులు.. జ్ఞాపకాలు మిగిల్చిన పాఠశాలలను బాగు చేసుకుందాం. తలో చేయి వేస్తే సమస్యను పరిష్కరించడం చాలా సులువు.. ఇప్పుడు వేసవి కాలం.. బడులకు సెలవులొచ్చాయి.. తడ'బడి'న చదువులమ్మ నేలను బాగు చేయించడానికి ఇదే చక్కని సమయం.. ఇంకా ఆలోచన ఎందుకు.. పదండి మన బడిని బాగు చేసుకుందాం..!!

పాఠశాలల్లో రెండో విడత కింద ఆగిపోయిన పనులపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. 80 శాతం వరకు నిర్మాణాలు జరిగి ఆగిపోయిన వాటి వివరాలను సేకరించింది. వీటిని వెంటనే పునః ప్రారంభించి పూర్తి చేయాలని ఇటీవల ఆదేశాలు జారీ చేసింది.

గతంలో మాదిరిగా సిమెంటు కొనుగోలు, సరఫరాపై ఉన్న ఆదేశాలను సవరించింది. బహిరంగ విపణిలోనే సిమెంటు కొనుగోలు చేసి వెంటనే పనులు ప్రారంభించాలని ఇటీవల ఎస్ఎస్ఏ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. రివాల్వింగ్ ఫండ్‌తో చేపట్టనున్నారు.

**రూ.423 కోట్లు అవసరం**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాడు – నేడు కింద అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి కావాలంటే రూ.423 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఇందులో నంద్యాల జిల్లాకు రూ.180 కోట్లు, కర్నూలు జిల్లాకు 243 కోట్లు అవసరం ఉంది.

కర్నూలు జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో రెండో విడత కింద 594 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టారు. ఇందులో అరకొరగా మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం రూ.29.83 కోట్లు కేటాయించింది. ఇప్పటికే రూ.3.73 కోట్లను ఆయా పాఠశాలల పీడీల ఖాతాలో జమ చేశారు.

నంద్యాలలోని 973 బడుల్లో పనులు ప్రారంభించారు.రూ.11.77 కోట్లు కేటాయించగా రూ.3 కోట్లు వచ్చాయి.

పడగొట్టి పంపించారు

కర్నూలు బండిమెట్టలోని పొట్టిశ్రీరాములు స్మారక నగరపాలక పాఠశాలలో 279 మంది విద్యార్థుల చదువుకొంటున్నారు. ఉన్న గదులు కూలగొట్టారు.. పిల్లలను పక్కనే ఉన్న అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలల్లో సర్దుబాటు చేశారు.రూ.2.16 కోట్లు కేటాయిస్తే రూ..49.21 లక్షలు వెచ్చించారు.

**సిమెంటు ఇస్తే పనులు మొదలు**

ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 780 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. రూ.48 లక్షలు వెచ్చించి నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించాలని అనుకున్నారు. ఇప్పటి వరకు రూ.25 లక్షలు వెచ్చించారు. సిమెంట్ సరఫరా లేకపోవడంతో నిర్మాణాలు ఆగిపోయాయి.. వాటిని చేపట్టాలంటే రూ.23 లక్షలు అవసరం..ప్రస్తుతం పాఠశాల ఖాతాలో రూ.6 లక్షలు ఉన్నాయి.

**అమ్మాయిల అవస్థ**

ఆదోని పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 1,612 మంది విద్యార్థినులున్నారు. రూ.2.16 కోట్లతో 18 అదనపు తరగతి గదుల నిర్మాణానికి పునాది వేశారు. నాలుగు గదులు రూఫ్ లెవర్ వరకు పూర్తవగా.. మరో రెండు గదులు పునాదులకే పరిమితమయ్యాయి. ప్రస్తుతం రూఫ్ లెవల్‌లో ఆగిపోయిన నాలుగు అదనపు గదుల నిర్మాణాలు పూర్తిచేస్తే విద్యార్థినులకు సౌకర్యంగా ఉంటుంది. ఇందు కోసం సుమారు రూ.10 లక్షలు మంజూరు చేస్తే నాలుగు తరగతి గదులను వినియోగంలోకి తీసుకురావచ్చు.

మంజూరైన అదనపు గదులు: 1986
తుది దశలో ఆగినవి: 587
పైకప్పు దశలో ఉన్నవి : 489
యూనిట్ లెవల్‌లో నిలిచినవి : 48
బేస్‌మెంట్ దశలో ఉన్నవి : 59
పూర్తయిన నిర్మాణాలు : 198
పనులు మొదలే కానివి: 32

# విరబూసి.. నష్టాలు మిగిల్చి..!

కుప్పం : శాంతిపురం మండలం దండికుప్పంకు చెందిన శీనప్ప రెండెకరాల్లో చెండు మల్లి సాగుకు రూ. లక్ష ఖర్చు చేశాడు. కోతకు వచ్చే సమయానికి ధరలు పడిపోయాయి. పూలను తోటలోనే ఎండబెట్టాల్సిన దుస్థితి. విరబూసిన పొలంలోనే వదిలిపోతున్నట్లు పూలను చూసి శీనప్ప ఆవేదన వ్యక్తం చేశాడు. అంతకు మునుపు రూ.50 వేల పెట్టుబడితో పండించిన కర్బూజా పంటకు కూడా గిట్టుబాటు ధర లేక నష్టపోయినట్లు కంటనీరు పెట్టుకున్నారు. తోటల్లోనే ఎండుకు.. కుప్పం, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో ఉద్యాన రైతులు వందలాది ఎకరాల్లో బంతి పూల సాగు చేశారు. అప్పుల చేసి.. నీటి ఎద్దడిని అధిగమించి పండించిన పూలకు గిట్టుబాటు ధరలు కొరవడటంతో తీవ్రంగా నష్టపోతున్నారు. చాలా చోట్ల తోటల్లోనే వదిలిపెట్టడంతో ఎండిపోతున్నాయి. కొన్ని చోట్ల పశువులకు ఆహారంగా మారాయి.

**శుభకార్యాలు లేక**ప్రస్తుతం పండుగలు, శుభకార్యాలు లేనందున విపణిలో పూలకు డిమాండు గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా పూలను, అలంకరణలకు వినియోగించే బంతి, చెండుమల్లి వినియోగం తగ్గింది.

# పీఎంశ్రీ.. పాఠశాలలకు సిరి!




అనకాపల్లి : విద్యారంగంలో మెరుగైన మార్పులు తీసుకురావడం.. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా అనకాపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, నిపుణులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ పథకం అమలు చేస్తున్నారు. దీనికి కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు సమకూర్చుతుంది. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య, మౌలిక వసతుల ఆధారంగా జిల్లాలో పాఠశాలలను ఎంపిక చేశారు. దీంతోపాటు అదనంగా పాఠశాల విద్యార్థులను క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్లడం, జాతీయ వేడుకలకు, జాతీయ నాయకుల జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు, డిజిటల్ తరగతులను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. వీటితోపాటు అదనపు తరగతి గదులు, ప్రయోగశాలల నిర్మాణం, ల్యాబ్‌లలో పరికరాలు సమకూర్చడం, క్రీడా మైదానాలు అభివృద్ధి చేస్తున్నారు.

జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద 35 పాఠశాలలు ఎంపిక చేశారు. ఇందులో 125 పనులు చేసేందుకు ఎంపిక చేయగా.. ఇప్పటి వరకు 103 పనులు పూర్తయ్యాయి. రెండు విడతల్లో జిల్లా పరిధిలో రూ. 7.41 కోట్ల అంచనాతో 125 పనులు ప్రారంభం కాగా.. ఇందులో రూ. 6.4 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ. 5.2 కోట్లు ఖర్చు చేశారు.

**80 శాతానికి పైగా పనులు పూర్తి**

అనకాపల్లి జిల్లాలో పీఎంశ్రీ తొలి విడత 24, రెండో విడతలో 11 పాఠశాలలు ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో అవసరాలకు అనుగుణంగా వసతులు కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీసి.. వారి ఆలోచనలకు పదును పెట్టేందుకు ప్రయోగశాలలు నిర్మించాలని నిర్ణయించారు. ఆ మేరకు జిల్లాలో 15 పాఠశాలల్లో నూతన భవనం, ప్రయోగశాలలను నిర్మించారు. ఇందులో ఒక్కో ప్రయోగశాలకు రూ. 15 లక్షల వరకు కేటాయించారు. దీంతోపాటు 35 పాఠశాలల్లో రూ. 1.75 కోట్లతో క్రీడామైదానాలు అభివృద్ధి చేయాలని అంచనాలు రూపొందించారు. ఇందులో ఇప్పటివరకు రూ. 1.5 కోట్లు విడుదలయ్యాయి. 85 శాతానికి పైగా పనులు పూర్తయ్యాయి.

**నిర్వహణకు ప్రత్యేక నిధులు**

నీటి సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ.. 21 పాఠశాలల్లో ఇంకుడు గుంతలు తవ్వుతున్నారు. బడిలోనూ కూరగాయలు పండించి.. వినియోగించేందుకు కిచెన్ గార్డెన్ల ఏర్పాటు, వాటి రక్షణకు చర్యలు చేపడుతున్నారు. వీటితోపాటు మరుగుదొడ్ల మరమ్మతులు, గ్రంథాలయాలు ఏర్పాటు పనులు చేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా రూ. 50 వేల నుంచి రూ. 1.5 లక్షల వరకు ఆయా బడులకు నిధులిచ్చారు.

**పనులు వేగవంతం**

జిల్లాలో పీఎంశ్రీ పథకం ద్వారా ఎంపిక చేసిన పాఠశాలలకు నిధులు కేటాయింపు జరిగింది. వాటితో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రయోగశాలల నిర్మాణం, క్రీడా మైదానాల అభివృద్ధి ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నాం. పనుల్లో జాప్యం కారణంగా వెనక్కి వెళ్లిపోయిన నిధులు కూడా వచ్చేలా ప్రయత్నిస్తున్నాం. – జయప్రకాశ్, ఏపీసీ, సమగ్ర శిక్షా, అనకాపల్లి

**జిల్లాలో పీఎంశ్రీ వివరాలు ఇలా..**

ఎంపిక చేసిన పాఠశాలలు : 35
అంచనా విలువ : రూ 7.41 కోట్లు
మంజూరైన నిధులు : రూ. 6.40 కోట్లు
ఇంకా రావల్సింది : రూ. 1.01 కోట్లు

# అక్రమాలు.. చాపకింద 'నీరు'లా!!




విశాఖ : నగరంలోని టీఎస్సార్ (టౌన్ సర్వీస్ రిజర్వాయర్) లోని ట్యాంకుల నుంచి నిత్యం వివిధ హెటల్స్, వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్‌లకు జీవీఎంసీ ఆధ్వర్యంలో నీటిని విక్రయిస్తుంటారు. మహా విశాఖ నగర పాలక సంస్థ మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది అక్రమాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి. దొంగ బిల్లులతో రూ.లక్షలు నొక్కేసిన విషయం ఆలస్యంగా తెలిసింది. అధికారుల అండదండలతోనే వ్యవహారం జరగడంతో నామమాత్రంగా విచారణ జరిపారు. అక్రమాలకు పాల్పడిన ఉద్యోగి విధులు నిర్వహించే ప్రాంతాన్ని మరోచోటకు మార్చి, చేతులు దులిపేసుకున్నారు. రూ.40 లక్షలకుపైగా దోచుకున్న ఉద్యోగిని సస్పెండ్ చేసి, పోలీసులకు ఫిర్యాదు చేయాల్సిన అధికారులు ఆ విషయమే పట్టించుకోవడం లేదు.

5 కేఎల్(కిలో లీటర్) సామర్థ్యం గల ట్యాంకర్ వ్యాన్‌కు రూ.200, రెండు సింథటిక్ డబ్బాలు కలిగిన 2 కేఎల్ ఆటోకు రూ.80, ఓ సింథటిక్ డబ్బా కలిగిన 1 కేఎల్ ఆటోకు రూ.40 చెల్లిస్తూ... జీవీఎంసీ సౌకర్యం కేంద్రంలో రసీదు తీయాల్సి ఉంటుంది. ఆ రసీదును బట్టి నీటి సరఫరా సిబ్బంది నీటిని అందిస్తుంటారు.వేసవిలో రోజుకు 400 నుంచి 450 వాహనాల ద్వారా, మిగిలిన రోజుల్లో 150 నుంచి 200 వాహనాల ద్వారా నీటిని విక్రయిస్తుంటారు. అయితే ట్యాంకర్ వ్యాన్‌కు దూరాన్ని బట్టి రూ.800 నుంచి రూ.వెయ్యి, 2 కేఎల్ ఆటోకు రూ.500 నుంచి రూ.700, 1 కేఎల్ ఆటోకు రూ.450 నుంచి రూ.600 వరకు వసూలు చేస్తూ.. వాహన నిర్వాహకులు నీటిని సరఫరా చేస్తుంటారు. ఇదీ జరిగింది..నీ నీటి కొనుగోలుకు సంబంధించిన రసీదుపై ఉండే నంబర్‌ను టీఎస్సార్ వద్ద ఓ పుస్తకంలో నమోదు చేసి, రసీదులో సగ భాగాన్ని చించి, వాహన చోదకుడికి ఇస్తారు. రిజర్వాయర్ వద్ద నీటిని నింపి, బయటకు వెళ్లేటప్పుడు గేటు వద్ద వాహన చోదకుడు రసీదు ఇవ్వాల్సి ఉంటుంది.అయితే అక్కడ పని చేసే ఓ ఉద్యోగి నీటి కొనుగోలుకు సంబంధించి నకిలీ రసీదు పుస్తకాన్ని అచ్చువేయించాడు. వాహన చోదకులు జీవీఎంసీ సౌకర్యం కేంద్రంలో తీసే అవసరం లేకుండా నేరుగా తానే డబ్బులు తీసుకుని, రసీదు ఇచ్చేవాడు. ఆ రసీదు ఆధారంగానే చాలా మందికి నీటి విక్రయాలు జరిగాయి. అలా దాదాపు రూ.40 లక్షలు వరకు దారి మళ్లించినట్టు వెలుగులోకి వచ్చింది. ఆ ఉద్యోగి నాలుగేళ్ల నుంచి అక్కడే పని చేస్తుండడంతో.. ఇంకా ఎన్ని అక్రమాలకు పాల్పడ్డాడో అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గుట్టుగా విచారణ: రోజువారీ నీటి విక్రయ వాహనాలు పెరుగుతున్నా... ఆదాయం రాకపోవడంతో అనుమానం అధికారులు విచారణ చేపట్టగా.. అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. దొంగ రసీదులు సృష్టించినట్టు సదరు ఉద్యోగి అంగీకరించినా... కఠిన చర్యలు తీసుకోవడంలో మంచినీటి సరఫరా ఇంజినీరింగ్ అధికారులు నిర్లక్ష్యంగా ఉండడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి. చర్యలు తీసుకుంటాం: సదరు ఉద్యోగి అక్రమాలకు పాల్పడినట్టు నీటి సరఫరా సహాయ ఇంజినీర్ గుర్తించారు. పూర్తిస్థాయి విచారణ జరిపి, తదుపరి చర్యలు తీసుకుం టాం. ఇకపై ఆన్‌లైన్‌లో నిధులు చెల్లించి రసీదు తీసుకునేలా మార్పులు తీసుకొస్తాం. – కేవీఎన్.రవి, జీవీఎంసీ, మంచినీటి సరఫరా పర్యవేక్షక ఇంజినీర్.

# 'ప్రైవేటు' మెడలో జల విహారం!!

విశాఖపట్నం : ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)కి విశాఖలో 'సముద్ర జల విహారం' కేంద్రం నుంచి మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. కాకినాడ, మచిలీపట్నంలలో తీరాలున్నా విశాఖే పర్యాటకులకు ఎక్కువ అనుకూలంగా ఉంటుంది. కొత్త బోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తే ఆదాయం పెంచుకోవచ్చు. ఆ దిశగా అధికారుల ప్రణాళిక లేకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయి. ఇటీవల పిలిచిన టెండర్లు తీరూ అలాగే ఉంది. సంస్థ ఆదాయానికి నష్టం కలిగించే పరిస్థితి ఉన్నా ఉన్నతాధికారులు ముందుకువెళ్లడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. **ఎంతో అవకాశమున్నా:** జల విహార ప్రాజెక్టులకు ఏపీటీడీసీ గత నెలలో టెండర్లు పిలిచింది. భీమిలి, రుషికొండ, తెన్నేటిపార్క్, మంగమారిపేట, ఫిషింగ్‌హార్బర్, బర్లపేట ప్రాంతాల్లో బోట్లు తిప్పేందుకు సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. ఇక్కడే అసలు కథ నడిచింది. వీటిల్లో డిమాండున్న ప్రాంతాలకు, కొత్తగా నిర్వహించే ప్రదేశాలకు రమారమి ఒకే రకమైన ప్రాథమిక ధర నిర్ణయించడంపై విమర్శలు వచ్చాయి. ఏటా ఏపీటీడీసీకి రూ.20 లక్షలకుపైన ఆదాయం వచ్చే చోట ప్రాథమిక ధర రూ.3 లక్షలుగా నిర్ణయించడం గమనార్హం. త్వరలోనే గుత్తేదారులకు ఒప్పంద పత్రాలు అందజేయనున్నారు. – రుషికొండలో జెట్ స్కీ స్కూటర్ల నిర్వహణకు ఏపీటీడీసీ ప్రాథమిక ధర రూ.4 లక్షలు చూపిస్తే రూ.13 లక్షలకు పాడారు. అక్కడే స్కూబాడైవింగ్ కోసం పిలిచిన టెండరు రూ.17 లక్షలకు వెళ్లింది. – భీమిలి తీరంలో రూ.50 వేలకు టెండరు పిలిస్తే రూ.1.75 లక్షలకు దక్కించుకున్నారు. బర్లపేట వద్ద సుమారు అంతే ధరకు వెళ్లింది.

**అరకోటి వస్తున్నా..తక్కువ ధరకే:** టెండర్లు పిలిచే క్రమంలో ఏపీటీడీసీకి ఎక్కువ ఆదాయం వచ్చే ప్రదేశాల్లో ప్రైవేటుకు పెత్తనం అప్పగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫిషింగ్‌హార్బర్‌లో ఏపీటీడీసీ ప్రస్తుతం 8 సీట్ల బోటు నడుపుతోంది. గతంలో ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ. 60 లక్షల ఆదాయం వచ్చేది. అటువంటి చోట టెండరు పిలిచి ప్రాథమిక ధర రూ.3 లక్షలుగా నిర్ణయించారు. టెండరు పిలవడంతో ఓ గుత్తేదారు రూ.8 లక్షలకు దక్కించుకున్నారు. ఇక్కడ ప్రాథమిక ధర తక్కువగా నిర్ణయించడంపై విమర్శలున్నాయి.

**కొత్త బోట్లేవి:** విశాఖలో జల విహారం ద్వారా రూ.కోట్ల ఆదాయం వచ్చే అవకాశమున్నా ఏపీటీడీసీ నిర్లక్ష్యం వహిస్తోంది. రుషికొండ, ఫిషింగ్‌హార్బర్ వద్ద కొత్త బోట్లు నడిపేందుకు వీలున్నా కొనుగోలు చేయకుండా తాత్సారం చేస్తున్నారు. పదేళ్ల కిందట 50 సీట్ల బోటు ఒకటి ఉండేది. హుద్‌హుద్‌కు దెబ్బతినడంతో దాని స్థానంలో స్వర్ణవిహారి అనే 50 సీట్ల బోటు నడిపారు. ఆ సమయంలో ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం వచ్చేది. 2018లో ఆ బోటును ఆపేశారు. అప్పటి నుంచి 8 సీట్ల బోటు హార్బర్ వద్ద నడుపుతున్నారు. డిమాండున్న రోజుల్లో 50 సీట్ల బోటు నడిపితే రోజుకు రూ.లక్ష ఆదాయం వస్తుంది. ఈ కొత్త బోటు ప్రతిపాదనలు ఎప్పటినుంచో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

# తవ్వేయ్.. ఆక్వా సాగు చేసేయ్!

గూడూరు : ఆక్వా.. డాలర్ల పంటే కానీ.. పట్టా భూములతో పాటు అసైన్‌మెంట్, సీజేఎఫ్ఎస్, అటవీ, ప్రభుత్వ, పోరంబోకు భూములను కొందరు ఆక్రమించి సాగు చేస్తున్నారు. కట్టడి చేయాల్సిన యంత్రాంగం మనకెందుకులే అన్న చందంగా వ్యవహరిస్తోంది. ఈ క్రమంలో ముడుపులిచ్చి రాజకీయ పలుకుబడితో ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించి పట్టాలుగా మార్చుకుంటున్నారు. ఈ అక్రమాలు చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో కొనసాగుతు న్నాయి. చిల్లకూరు మండలం బెస్తపాలెం, అంకులపాటూరు, తిక్కవరం, ఏరూరు, తిప్పగుంటపాలెం, ముత్యాలపాడుబీ కోట మండలం కర్లపూడి, సిద్దవరం, దొరువుకట్ట, దైవాలదిబ్బ, గోవిందపల్లి వాకాడు మండలం తూపిలిపాలెం, పామంజి, వాలమేడు, కొండూరు, అందల మాల, వావిళ్లపాలెం, తిరుమూరు, దుగరాజపట్నం, ముట్టెంబాక, కొండూరుపాలెంబీ చిట్టమూరు మండలం ఆరూరు, పిట్టివానిపల్లి, పల్లంపర్తి, కొక్కుపాలెం, చిట్టమూరు, కోగిలి తదితర గ్రామాల్లో వేలాది ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. వీటిలో పది వేల ఎకరాల వరకు ఆక్రమణలున్నాయి. చిట్టమూరు మండలం ఆరూరు గ్రామంలో సుమారు 200 ఎకరాల్లో ప్రభుత్వ, అటవీ భూముల్లో ఆక్వా సాగు చేపట్టారు.



**ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే..**నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను ఆక్రమించిన కొందరు వీఆర్వోలు, ఆర్ఐ, తహసీల్దార్లకు వేలాది రూపాయలు అక్రమంగా ముడుపులు ముట్టజెప్పి క్రమబద్ధీకరించుకోవడం పరిపాటిగా మారింది. వైకాపా పాలనలో అత్యధికం భూములకు పట్టాలు ఇచ్చారు. వీటిని ఆన్‌లైన్‌లో పరిశీలిస్తే ఎన్నో అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది. రెవెన్యూ ఉన్నతాధికారులు ప్రతి మండలంలో ఇటీవల జరిగిన సాదాబైనమాలు.. మ్యుటేషన్లు వివరాలను పరిశీలిస్తే.. ప్రభుత్వ భూములను ఎవరికి పట్టాలు చేశారు.. ఎంత చేశారు.. ఏ గ్రామ పరిధిలో జరిగాయి.. అన్న వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

**నోటీసులిస్తాం..**దీనిపై వాకాడు తహసీల్దార్ రామయ్యను వివరణ కోరగా మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై పరిశీలించి నోటీసులు ఇస్తామన్నారు.

# జలఘోష తప్పేనా..?

భీమవరం : కూటమి ప్రభుత్వంలో పంట కాలువలకు ప్రాధాన్యం ఇస్తారని అంతా భావించారు. అందుకు తగ్గట్టుగానే జిల్లా నుంచి ప్రతిపాదనలు పంపించారు. అయితే నిధులు లేమి ఉందంటూ ఆర్థిక శాఖ అనేక మెలికలు పెడుతోంది. ఇప్పుడదే పశ్చిమ డెల్టా రైతులకు శాపంగా మారుతోంది. నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కృషితోఈ ఏడాదైనా జలఘోష తప్పేనా అని రైతులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు.

పంట కాలువల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. వేసవిలో కాల్వలు, డ్రెయిన్‌లకు మరమ్మతు పనులు చేపట్టాలి. ప్రభుత్వానికి ఏనాడో ప్రతిపాదనలు పంపారు. పశ్చిమ డెల్టా పరిధిలో వేసవి మరమ్మతులకు రూ.40 కోట్లు అవసరమని అంచనా వేశారు. ప్రణాళికలు రూపొందించారు. నీటి సంఘాలు ఏర్పడడంతో రైతుల్లోనూ ఆశలు చిగురించాయి. కాలువలు ప్రక్షాళన జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ ఏడాది రైతుల ఆశలు తల్లకిందులయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లా జలవనరుల శాఖ అధికారులు పంపిన ప్రతిపాదనలు ఆర్థికశాఖ వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. అక్కడ క్లియరెన్స్ అయితేనే నిధులు మంజూరవుతాయి. ఒక దశలో ప్రతిపాదనలను ఆర్థిక శాఖ తిరస్కరించింది. ప్రతిపాదనల విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఆమోదం పొందేలా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే పనుల నిర్వహణకు కాలాతీతమైంది. ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్నాయి. వాతావరణ శాఖ ఇదే విషయాన్ని ధ్రువీకరించింది. అదే జరిగితే మంచినీటి చెరువుల్లో నీరు అడుగంటిపోనుంది. జూన్ మొదటి వారంలోనే మళ్లీ కాలువలకు నీటిని విడుదల చేయాల్సి ఉంటుంది. ఇటువంటి లెక్కలు వేసుకుని జలవనరుల శాఖ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నెల రోజుల వ్యవధి మాత్రమే ఉంది. ఆలోగా కాలువలు, డ్రెయిన్‌లలో పూడిక తీయాలి. గుర్రపుడెక్క, తూడు, కర్రనాచు తొలగించాలి. గట్లు బలహీనంగా ఉన్నచోట పటిష్టం చేయాలి. లేదంటే గండ్లు పడి పంట పొలాలు ముంపుబారిన పడే ప్రమాదం ఉంది. గడచిన ఖరీఫ్‌లో గండ్లతో అధిక నష్టం వాటిల్లింది. మరోవైపు డ్రెయిన్‌లు ఎగదన్ని పంట పొలాలు ముంపుబారిన పడ్డాయి. వేసవిలో పనులు చేపడితే ముంపు నుంచి గట్టెక్కవచ్చని అంతా అభిప్రాయపడ్డారు.

**నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం**

వేసవి పనులు చేపట్టడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫల మైంది. ఆ ప్రభావం రైతులపై పడుతోంది. రెండు రోజులపాటు వర్షాలు కురిస్తే పొలాలు నీట మునుగుతున్నాయి. నారుమళ్లు దెబ్బతింటున్నాయి. లేదంటే నాట్లు కుళ్లిపోతున్నాయి. గడచిన ఖరీఫ్‌లో రైతులు ఇలాంటి ఇబ్బందులే పడ్డారు, రెండు పర్యాయాలు పంటకు నష్టం వాటిల్లింది. డ్రెయిన్‌లు, కాలువలు పూడుకుపోవడంతో కొద్దిపాటి వర్షాలకు డ్రెయిన్‌లు ఎగదన్నుతున్నాయి. జలవనరుల శాఖ ఈ విషయాన్ని గుర్తించింది. పనులు చేపట్టాలని ముందుగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. పశ్చిమ డెల్టా పరిధిలో కాలువలు, డ్రెయిన్‌ల మరమ్మత్తుల కోసం రూ.40 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నీటి సంఘాలను ఏర్పాటు చేయడంతో రైతుల్లోనూ ఉత్సాహం నెలకొంది. నీటి సంఘాల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించారు. కాలువులు, డ్రెయిన్‌లలో సమస్యలను గుర్తించారు. అధికారులకు వివరాలు సమర్పించారు. పనుల అవసరాన్ని గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసేలా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వ స్థాయిలో ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉండడంతో నీటి సంఘాల్లోనూ నిరుత్సాహం నెలకొంది.

**నెల రోజులే గడువు** వేసవిలో పనులు చేపట్టడానికి నెల రోజులు మాత్రమే గడువు ఉంది. జూన్ మొదటివారంలో కాలువలకు నీటిని విడుదల చేయనున్నారు. వేసవి పనులకు మే నెల కీలకం. ప్రభుత్వ స్థాయిలో నిధులు మంజూరు చేస్తే పనులు కేటాయిస్తారు. నామినేషన్ పద్ధతిలో పనులు కేటాయించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. వాస్తవానికి రూ.10 లక్షలపైన పనులు అయితే టెండర్‌లు పిలవాలి. లేదంటే నీటి సంఘాల ద్వారా నామినేషన్ పద్ధతిలో చేస్తారు. ప్రస్తుతం నిధులు మంజూరు చేసినా సరే టెండర్‌లు పిలిచే అవకాశం లేదు. అంత సమయం లేదు. స్వల్పకాలిక టెండర్లు పిలిచినా వారం రోజుల సమయం పడుతుంది. అయినా సరే టెండర్లు ఖరారవుతాయన్న భరోసా లేదు. కాంట్రాక్టర్‌లకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో జలవనరుల శాఖ పనులుంటేనే హడలి పోదుతున్నారు. దీంతో నీటి సంఘాల ద్వారానే పనులు చేయించాలని అధికారులు యోచిస్తున్నారు. ఈసారి నామినేషన్‌లోనే పనులు చేపడితే వేగవంతంగా పూర్తవుతాయన్న నమ్మకంతో అధికారులు వేచి చూస్తున్నారు.

## మీటరు తిరిగింది.. నియంత్రిక కాలింది

చిత్తూరు : జిల్లాలో తీవ్రమైన ఎండలు.. పెరిగిన ఉక్కపోతతో విద్యుత్తు వినియోగం మరింతగా పెరిగింది. గృహ, వ్యవసాయ సర్వీసుల విద్యుత్తు వాడకం పెరగడంతో ఉప కేంద్రాలు, నియంత్రికలపై అధిక లోడు ఫలితంగా నియంత్రికలు దగ్ధమవుతున్నాయి. ఏప్రిల్ నెలలోనే జిల్లాలో సుమారు 622 నియంత్రికలు దగ్ధమైనట్లు జిల్లా విద్యుత్తు శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

**శరవేగంగా మరమ్మతులు**

జిల్లాలో చిత్తూరు, పలమనేరు, పుంగనూరు ప్రాంతాల్లో నియంత్రికల మరమ్మతు కేంద్రాలున్నాయి. మార్చి నెలలో చిత్తూరు నియంత్రికల మరమ్మతు కేంద్రానికి 355, పలమనేరుకు 125, పుంగనూరుకు 165 నియంత్రికలు తరలించారు. అధికారంలోకి రాగానే కూటమి ప్రభుత్వం విద్యుత్తు శాఖ ప్రక్షాళనకు దృష్టి సారించింది. లో ఓల్టేజి, సరఫరాలో అంతరాయం ఉన్న ప్రాంతాల్లో అదనపు నియంత్రికలు, కొత్త లైన్ల ఏర్పాటు చేస్తున్నారు. నియంత్రికల మరమ్మతులకు అవసరమైన పరికరాలు, తీగలు, ఆయిల్ వంటి సామగ్రి కొరత



లేకుండా అందుబాటులో ఉంచారు. కేంద్రాలకు తరలిస్తున్న నియంత్రికలను సత్వరమే మరమ్మతులు చేసి రైతులకు అందజేస్తున్నామని జిల్లా విద్యుత్తు శాఖ ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు.

**వైకాపా నిర్లక్ష్య ఫలితమే**

ఐదేళ్ల వైకాపా పాలనలో విద్యుత్తు లైన్లు, ఉప కేంద్రాల నిర్వహణ పట్టించుకోలేదు. అయితే నిర్వహణ పేరుతో పనులు చేపట్టకనే వైకాపా పెద్దలు, గుత్తేదారులు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. లో ఓల్టేజి సమస్యలున్న ప్రాంతాల్లో అదనపు లైన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, నియంత్రికలను అమర్చలేదు. కేవలం అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలోనే అవసరం లేనప్పటికీ ఇష్టానుసారంగా ఉప కేంద్రాల ఏర్పాటుతో రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేశారని ఆ శాఖ అధికారులే బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో ఉప కేంద్రాల ఏర్పాటు ప్రతిపాదనల దశలోనే ఆగిపోగా విద్యుత్తు లైన్ల నిర్వహణ మరిచిపోయారు. నిర్లక్ష్యం ఫలితంగా పూతలపట్టు, ఎస్ఆర్‌పురం, పాలసముద్రం, పెనుమూరు, ఐరాల, నగరి, విజయపురం యాదమరి, గంగవరం, బైరెడ్డిపల్లె తదితర మండలాల్లో ప్రస్తుత వేసవిలో సరఫరాలో అంతరాయాలు, లో ఓల్టేజి సమస్యలు అధికంగా ఉన్నాయి.

జిల్లాలోని సర్వీసుల వివరాలు (లక్షల్లో)

విద్యుత్తు: 7.35

గృహ : 4.96

వ్యవసాయ : 1.92

## పత్తి సాగుపై రైతుల అనాసక్తి

బి.కోడూరు : పత్తి పంట సాగుపై రైతులు ఆసక్తి చూపడంలేదు. పత్తి పైరుకు తెగుళ్లకు మందులు, ఎరువులు, సేద్యాలు, కూలీల ఖర్చు అన్నీ పోను పైరు బాగా పండితే మిగిలేది ఎకరాకు రూ.20వేలు మాత్రమే.బి.కోడూరు మండలంలో ప్రతి సంవత్సరం పత్తి దాదాపు 7వేల ఎకరాలు పైనే సాగు చేసేవారు. రాను రాను పెట్టుబడి ఎక్కువ కావడం, రోగాలు అధికంగా రావడం, వాటికి సరైన మందులు పిచి కారి చేసేందుకు సరైన సలహాలు అందించలేని అధికారులతో రాను రాను సాగు గణనీయంగా తగ్గిపోయింది. ఈ సంవత్సరం మండలం 50ఎక రాలలోపే పత్తి సాగు చేశారు. పత్తిపైరు నవంబ రు, డిసెంబరులో సాగు చేస్తే ఏప్రిల్, మేలో కోత లకు వస్తుంది. ఆ సమయంలో ఎండలు ఎక్కువ కావడం, కూలీలు దొరక్కపోవడం, సరైన రేటు లేకపోవడంతో రాను రాను రైతులు పత్తి సాగుపై ఆసక్తి చూపడంలేదు. దీంతో మండలంలో పత్తి సాగు పూర్తిగా కనుమరుగయ్యేటట్లు ఉంది.

**ఎండలు ఎండలు.. దొరకని కూలీలు**

ఏప్రిల్, మే మాసంలో పత్తి పంట కోతకు వస్తుం ది. అయితే మంచి ఎండలు , కూలీలు దొరక్క పోవడం, కూలీలు వచ్చినా అధిక రేటు కూలీ చెబుతుండడంతో పత్తి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అష్టకష్టాలు పడి పత్తి పండిం చుకున్నా తీరా రేటు దగ్గరకు వచ్చేసరికి పెట్టుబ డి కూడా రానంతగా ఈ దళారులు చేస్తుండడం తో పూర్తిగా పత్తిని ఆపివేశారు.

**తెగుళ్లు ఉన్నా .. పర్యవేక్షణ సున్నా**

పత్తి పూత, పిందె దశకు వచ్చేసరికి అధికంగా తెగుళ్లు సోకడం, రైతులు తెలిసీ తెలియని మం దులు తీసుకువచ్చి పిచికారి చేయడంతో దిగుబ డులు పూర్తిగా తగ్గిపోయాయి. అధికారులు రైతు లకు సరైన సమయంలో సలహాలు అందించి వచ్చిన రోగాలకు సరైన మందులు పిచికారి చేసే విధంగా అవగాహన కల్పించడంలో విఫలమవ డంతో రైతులు పత్తిపై ఆసక్తి చూపడంలేదు.

**పెట్టుబడి భరించలేక పత్తిసాగు తగ్గించారు**

పత్తి పంట సాగునకు పెట్టుబడి ఎక్కువగా ఉండడంతో రైతులు పంట సాగు తగ్గించారు. అలాగే కూలీల కొరత రైతులకు ఇబ్బందికరంగా మారింది. ఇది కూడా పంట సాగు విస్తీర్ణం తగ్గడానికి మరో కారణంగా చెప్పవచ్చు.-కౌశిక, వ్యవసాయాధికారి, బి.కోడూరు

**ఏటా పది ఎకరాలు పత్తి సాగు చేసేవారం**

ప్రతి సంవత్సరం పత్తి 10 నుంచి 15 ఎకరాల వరకు సాగు చేసేవారం. రాను రాను విత్తనాల ఖర్చు ఎక్కువ కావడం, రాను రాను రోగాలు అధికంగా రావడం, దిగుబడి తగ్గు తుండడంతో పత్తిని పూర్తిగా సాగు చేయకుండా మానేశాం. ప్రస్తుతం సజ్జ, మొక్కజొన్నలాంటి పంటలు వేసు కుంటున్నాం. కనీసం క్వింటా రూ.10వేలు అమ్మితే రైతుకు కాస్తో కూస్తో పెట్టుబడి పోను మిగులు తుంది. దీంతో పత్తిని పూర్తిగా మానివేశాం.

– దుగ్గిరెడ్డి. రైతు, ఐత్రంపేట

# నకిలీ ఈ-స్టాంప్‌ల సృష్టి




అనంతపురం: నకిలీ స్టాంపులను నియంత్రించడం కోసం ప్రవేశపెట్టిన ఈ-స్టాంప్ వ్యవస్థను సైతం కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. తాజాగా కళ్యాణదుర్గంలో మీ-సేవ నిర్వాహకుడు ఈ-స్టాంప్‌లను ట్యాంపర్ చేసిన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ఫొటోషాప్ ద్వారా ఈ-స్టాంప్‌లను ఎడిట్ చేసి రూ.కోట్లల్లో కొల్లగొట్టినట్లు పోలీసులు గుర్తించారు. కళ్యాణదుర్గానికి చెందిన బోయ ఎర్రప్ప అలియాస్ బాబు స్థానికంగా మీ-సేవ నిర్వహిస్తున్నాడు. కొన్నేళ్లుగా భార్య కట్ట భార్గవి పేరుతో స్టాక్ హెూల్డింగ్ కార్పొరేషన్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. బ్యాంకుల్లో తనఖా డాక్యుమెంట్లు, ఇతర రిజిస్ట్రేషన్లకు సంబంధించి స్టాంప్‌డ్యూటీ చెల్లించేందుకు ఈ-స్టాంప్‌ను అందిస్తుంటాడు. ఈ క్రమంలో స్టాంప్ డ్యూటీ కట్టేందుకు వచ్చే వారికి నకిలీ ఈ-స్టాంప్‌లు అంటగడుతూ వస్తున్నాడు. రూ.లక్ష కట్టాల్సిన చోట రూ.100 మాత్రమే చెల్లిస్తాడు. ఫొటోషాప్ ద్వారా రూ.100 స్థానంలో మరో మూడు సున్నాలు చేర్చి రూ.1,00,000గా మార్చేస్తాడు. ఇలా సుమారు 150కి పైగా ఈ-స్టాంప్‌లను వినియోగదారులకు కట్టబెట్టినట్లు తెలుస్తోంది. కళ్యాణదుర్గం నుంచి జారీ అవుతున్న ఈ-స్టాంప్‌లో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించిన స్టాక్ హెూల్డింగ్ కార్పొరేషన్ అధికారులు గతవారం ఎర్రప్పకు సంబంధించిన మీ-సేవలో సోదాలు నిర్వహించారు. పెద్దమొత్తంలో నకిలీ ఈ-స్టాంప్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

**ఎమ్మెల్యే కంపెనీనే బురిడీ కొట్టించి..**

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుటుంబం నిర్వహిస్తున్న ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ కంపెనీకి ఎర్రప్ప నకిలీ ఈ-స్టాంప్‌లు విక్రయించినట్లు సదరు కంపెనీ ప్రతినిధులు అనంతపురం రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు ఎర్రప్పను అరెస్టు చేసి విచారిస్తున్నారు. అతడు చాలాకాలంగా ఎమ్మెల్యే కుటుంబానికి సన్నిహితంగా ఉంటూ వచ్చాడు. ఈ సాన్నిహిత్యంతోనే 2022 నుంచి తమ కంపెనీకి కావాల్సిన ఈ-స్టాంప్‌లను ఎర్రప్ప వద్ద తీసుకుంటూ వచ్చారు. ఇటీవల అనుమానం వచ్చి కొన్ని ఈ-స్టాంప్‌లను పరిశీలించగా నకిలీవని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఆర్‌సీ కంపెనీ ప్రతినిధులు పేర్కొంటున్నారు. సుమారు రూ.70 లక్షల మేర మోసం చేసినట్లు చెబుతున్నారు. ఎమ్మెల్యే సురేంద్రబాబు సమీప బంధువులకు చెందిన సురజ్ ఇన్‌ఫ్రా, నియో కన్‌స్ట్రక్షన్ కంపెనీల పేరుతోనూ నకిలీ ఈ-స్టాంప్‌లు జారీ చేసినట్లు తెలుస్తోంది.

# అలంకారప్రాయంగా పీహెచ్‌సీలు



గుత్తి : గ్రామీణులకు అందుబాటులోకి వైద్య సేవలను అందించాలన్న లక్ష్యం నీరుగారిపోతోంది. గత వైకాపా ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాకు 9 అదనపు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసింది. వైద్యఆరోగ్యశాఖ అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జనాభా ప్రాతిపదికన కేంద్రాలను ఏర్పాటు చేశారు. అనంతపురం జిల్లాకు ఐదు కేంద్రాలు, శ్రీసత్యసాయి జిల్లాకు నాలుగు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాలు నామమాత్రంగా కొనసాగుతున్నాయి.

తొమ్మిది కేంద్రాలను ఏర్పాటు చేసినా సొంత భవనాలను సమకూర్చలేదు. పైగా ఆయా కేంద్రాల్లో సిబ్బంది కొరత ఉంది. ప్రధానంగా ప్రమాదాల్లో గాయపడి వచ్చినా, ఇతరత్రా కట్లు కట్టేందుకు కావాల్సిన సిబ్బంది లేరు. మరోవైపు సూదులు వేసే నర్సులూ లేకుండాపోయారు. కేవలం వైద్యులను మాత్రమే నియమించారు.

**గ్రామీణులకు అందని వైద్యం**

పల్లె జనానికి సంపూర్ణ వైద్యసేవలందటం లేదు. వైద్యులు మాత్రమే పాత పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉపకేంద్రాల్లో విధులను నిర్వహిస్తూ వస్తున్నారు. ఇదివరకు ఉన్న పీహెచ్‌సీకి 10 కిలోమీటర్లు దూరంపైగా ఉన్న గ్రామాలకు జనాభాను బట్టి అదనపు పీహెచ్‌సీలను ఏర్పాటు చేసినా సొంత భవనాలు లేకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది.

**క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి**

అనంతపురం జిల్లాలోని శింగనమల నియోజకవర్గంలోని ఎర్రగుంట్ల కేంద్రానికి సొంత భవనం లేదు. పాత ఉప ఆరోగ్యకేంద్రంలోనే నెట్టుకొస్తున్నారు. అక్కడ వైద్యులు ఉంటూ ప్రజలకు అరకొరగా సేవలను అందిస్తున్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని ఎనుములదొడ్డిలోనూ సబ్ సెంటర్‌లో కేంద్రం కొనసాగుతోంది. కళ్యాణదుర్గంలోని నూతిమడుగులో పక్కా భవనాలను నిర్మించేందుకు భూమిపూజ చేశారు. రాయదుర్గంలోని తాళ్లకేరీ, అనంతపురం గ్రామీణంలోని రుద్రంపేటలోనూ కేంద్రాలకు సొంత భవనాలు లేవు.

**శ్రీసత్యసాయి జిల్లాలోనూ అదే తీరు**

శ్రీసత్యసాయి జిల్లాకు మంజూరైన కేంద్రాలు సైతం పాత సబ్‌సెంటర్లలో కొనసాగుతున్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. కేంద్రానికి ఇద్దరు వైద్యులు, ముగ్గురు స్టాఫ్ నర్సులు, ల్యాబ్‌టెక్నీషియన్, ఫార్మాసిస్టు, నలుగురు సూపర్‌వైజర్లు, సీనియర్ అసిస్టెంట్, అటెండర్‌తోపాటు ఎఫ్ఎన్‌వో ఉండాలి. ప్రస్తుతం సిబ్బంది లేదు.. కేంద్రాలను నిర్మించలేదని వైద్యులు వాపోతున్నారు.

# జ్వరపీడితులతో ఆసుపత్రులు కిటకిట



ఎలమంచిలి : జిల్లాలో వాతావరణ మార్పులతో జ్వరాల వ్యాప్తి పెరిగింది. వర్షాల కారణంగా పారిశుద్ధ్యం అధ్వానంగా మారి దోమలు బాగా పెరిగాయి. వీటి కారణంగా ప్రజలు మలేరియా బారినపడుతున్నారు. రోగాల బారిన పడినవారితో ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని ప్రైవేటు ఆసుపత్రులు, ప్రైవేటు ల్యాబ్‌ల వారు రోగుల నుంచి దండిగా డబ్బులు గుంజుతున్నారు. మరోవైపు కలుషిత నీరు కారణంగా టైఫాయిడ్ బారినపడుతున్న సంఖ్య పెరుగుతోందని వైద్యులు చెపుతున్నారు. జిల్లాలో అనకాపల్లి వంద పడకల సుపత్రితో పాటు ఎలమంచిలి, నక్కపల్లి, నర్సీపట్నం, కోటవురట్ల, చోడవరం, కె.కోటపాడు తదితర ప్రభుత్వ ఆసుపత్రుల్లో పది రోజులుగా రోగుల సంఖ్య బాగా పెరిగింది. వీరిలో ఎక్కువమంది జ్వరం, డయేరియాతో బాధపడుతూ ఆసుపత్రులకు వచ్చిన వారే ఉంటున్నారు. గత పదిహేను రోజుల్లో జిల్లాలోని, ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యానికి వచ్చిన వారిలో 50 మందికి పైగా డెంగీ జ్వరాలు సోకాయని గుర్తించారు. మలేరియాతో బాధపడుతున్నవారి సంఖ్య 300 లకు పైగా ఉంది. ఒక్క ఎలమంచిలిలోనే డయేరియాతో పదుల సంఖ్యలో మంచంపట్టారు. జ్వరాలకు చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి వెళితే రూ. 5 వేలకు పైగా ఖర్చవుతోంది. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లినా పరీక్షల కిట్లు లేవంటూ... బయట పరీక్ష చేయించుకోమని చెబుతున్నారని ఎలమంచిలికి చెందిన రోగి నవీన్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని అనకాపల్లి, ఎలమంచిలి, చోడవరం, నర్సీపట్నం పట్టణాల్లో పారిశుద్ధ్య నిర్వహణ గాడితప్పింది జిల్లా యంత్రాంగం అంతా ఇటీవల జరిగిన యోగాంధ్ర కార్యక్రమంపై దృష్టి సారించడంతో స్థానికంగా పర్యవేక్షణ కరవైంది. ముఖ్యంగా గ్రామాల్లో అపరిశుభ్రత తాండవిస్తుండటం రోగాలు ప్రబలడానికి కారణమవుతోంది. ఉన్నతాధికారులు స్పందించి పారిశుద్ధ్యం మెరుగుపై దృష్టి పెట్టాల్సి ఉంది.

# చెప్పినంత.. చెల్లించాలి

చిత్తూరు : ఇంటర్ విద్య.. వ్యాపార ధోరణులన్నింటినీ దాటుకుని అక్రమార్జనకు వేదికవుతోంది. ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు రకరకాల పేరుతో ఎడాపెడా దండుకుంటున్నాయి. ఎంసెట్, జేఈఈ, నీట్ ఆశలు నూరిపోస్తూ తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి మరీ అక్రమ వసూళ్లకు తెగపడుతున్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుంటే చాలని వారు చెప్పిన ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు రెండేళ్ల తరువాత లబోదిబోమంటున్నారు. అటు నీట్, జేఈఈ ర్యాంకులు రాక ఇటు ఇంటర్‌లో మార్కులు లేక అయ్యో ఎంత మోసపోయామో అంటూ అధికశాతం కన్నవారు వాపోతున్నారు.


ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు డిమాండు అధికంగా ఉంటోంది. పది ఫలితాలు రావడమే ఆలస్యం విద్యార్థుల ఇళ్ల ముంగిట వాలిపోతున్న యాజమాన్యాలు ర్యాంకుల పేరుతో ఊరిస్తున్నాయి. రూ.లక్షల్లో వసూలు చేసి పెద్దఎత్తున ప్రవేశాలు పెంచుకుంటున్నాయి. వసతిగృహాల్లో ఎక్కువమంది చేరుతుండగా ఇరుకు గదుల్లో కుక్కేస్తున్నారు. ఎక్కువ భాగం సొంత భవనాలు లేకపోయినా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఆట స్థలాలు పూర్తిగా కరవయ్యాయి.

**బట్టీ చదువులతో సరి**

నిరంతరం బట్టీ చదువులు తప్పితే ఏ అంశంలోనూ విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంపై దృష్టిసారించడం లేదు. మెటీరియల్ రూపొందించి ఆ అంశాలనే వల్లెవేయిస్తున్నారు. ప్రాక్టికల్స్ ఊసెత్తడం లేదు. అధ్యాపకుల ఏర్పాటులో వివక్ష చూపుతున్నారు. అందరి నుంచి ఒకే ఫీజు వసూలు చేసినా విద్యార్థులను విడదీసి ఒకట్రెండు బ్యాచ్‌లకు మాత్రమే రూ.లక్షల్లో వేతనాలు చెల్లించి తరగతులు చెప్పిస్తున్నారు.

**తాయిలాలకు తలొగ్గి..**

ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకంటే ఐదు నుంచి పదిరెట్లకు పైగా వసూలు చేస్తున్నారు. కళాశాలల గుర్తింపు, తరగతుల నిర్వహణ, ఫీజుల వసూళ్లలో పెద్దఎత్తున నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. తిరుపతిలో రీజినల్ అధికారి



కార్యాలయం ఉన్నప్పటికీ అందులోని అధికారులు ప్రైవేటు కళాశాలల్లో తనిఖీలు చేసిన దాఖలాలు లేవని, ఉత్తుత్తి తనిఖీలతో చేతులు దులుపుకొంటున్నారని, ఫిర్యాదులున్నా తాయిలాలతో సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

నిబంధనలు పాటించకుంటే గుర్తింపు రద్దు.. ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాలి. అందుకు తగిన రసీదులు ఇవ్వాలి. విద్యాశాఖ నిర్దేశించిన ఫీజులకు వ్యతిరేకంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు. విశాలమైన భవనాలు, తరగతి గదులు, ల్యాబ్‌లు తప్పక ఉండాలి. ఎటువంటి లోపాలున్నా నోటీసులు ఇచ్చి నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కళాశాలల గుర్తింపు రద్దు చేస్తాం. – రాజశేఖర్‌రెడ్డి, ఆర్ఐవో, తిరుపతి

## సుఖీభవ హక్కుకు రీసర్వే చిక్కు

అనకాపల్లి : రైతులకు పెట్టుబడి సాయంగా ఏటా అన్నదాత సుఖీభవ పథకం కింద పీఎం కిసాన్‌తో కలిపి రూ. 20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఇందులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పేరుతో వారికి త్వరలో ఆర్థిక సాయం అందించనున్నారు. కానీ గత వైకాపా ప్రభుత్వం చేసిన తప్పిదాలు... రైతులకు ఇప్పుడు శాపంగా మారాయి. అప్పట్లో అస్తవ్యస్తంగా సాగిన రీసర్వేతో ఇప్పుడు కొందరికి పెట్టుబడి సాయం ప్రశ్నార్థకంగా మారింది.వైకాపా ప్రభుత్వ హయాంలో సాగు భూములను రీసర్వే చేశారు. దశాబ్దాలకాలంగా ఉన్న సర్వే నంబర్ల స్థానంలో ల్యాండ్ పార్సిల్ మ్యాప్‌లను (ఎల్‌పీఎం) తీసుకువచ్చారు. సర్వే నంబరు ఒక వ్యక్తికి ఒక్కటే ఉంటుంది. ఆయన వారసులకు అదే సర్వే నంబరు ఉండేది. రీ సర్వే తర్వాత నలుగురైదుగురికి కలిపి ఒక ఎల్‌పీఎం కేటాయించి భూ హక్కు పత్రాలు అందజేశారు. ఎల్‌పీఎంలో ఏ రైతు పేరు నమోదు చేస్తే... మిగిలినవారి భూవిస్తీర్ణం మొత్తం ఆయన పేరుమీదే నమోదైంది. ఇలాంటి ఉమ్మడి ఎల్‌పీఎం నంబర్లు అన్నదాత సుఖీభవ లబ్ధికి చిక్కుముడిగా మారాయి. ఒక్క రైతు పేరే రికార్డుల్లో ఉండటంతో మిగిలిన వారికి లబ్ధి అందే పరిస్థితి కనిపించడం లేదు. పరవాడ మండలం వాడచీపురుపల్లిలో శీరంశెట్టి నూకరాజుకు రెండు వేర్వేరు ప్రాంతాల్లో భూమి ఉంది. రెండు చోట్ల రెండు వేర్వేరు ఆధార్ నెంబర్లు నమోదు చేశారు. ఇదే గ్రామానికి చెందిన గొల్లవిల్లి శ్రీనివాసరావు ఆధార్ నంబరు తప్పుగా నమోదైంది. చాలామంది ఫోన్ నెంబర్లు తప్పుగా ఉన్నాయి.

మునగపాక మండలం చూచుకొండలో 35, మునగపాకలో 55 మంది



రీసర్వే డేటా రావడం లేదు. రీసర్వే చేసిన ప్రతి గ్రామంలోనూ దాదాపు ఇదే పరిస్థితి. ఈ మండలంలో 17,536 మంది సుఖీభవ పథకానికి అర్హులుగా గుర్తించగా... ఇంతవరకు 13,199 మంది రికార్డులు మాత్రమే సరిగ్గా ఉన్నట్లు గుర్తించారు.

**అర్హత తెలిసేదిలా..**

రైతు సేవాకేంద్రాల వారీగా వెబ్‌ల్యాండ్ డేటాను గ్రామ వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయాధికారి లాగిన్లకు ఇచ్చారు. వెబ్‌ల్యాండ్‌లో సర్వే నంబర్లు, రైతు పేరు, విస్తీర్ణం సరిగా ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తారు. అక్కడ నుంచి వ్యవసాయాధికారి లాగిన్‌కు పంపుతారు. ఆ తర్వాత జిల్లా వ్యవసాయాధికారికి చేరుతుంది. అక్కడ ఏమైనా తప్పులు ఉంటే సరిచేస్తారు.

సాగుదారులు: 5,10,110

సుఖీభవకు అర్హులు: 4,47,577

పరిశీలనలో ఉన్నవి: 14,058

తిరస్కరణ: 19,284

పెండింగ్: 90,097

పరిశీలిస్తున్నాం: రీసర్వే చేసిన గ్రామాల్లో కొన్ని ఇబ్బందులు వస్తున్న మాట వాస్తవమే. ముఖ్యంగా ఆధార్ నంబర్లు సరిగా ఉండటం లేదు. ఆధార్ లింకయిన ఫోన్ నంబర్లు ఉండాలి. కొన్ని చోట్ల ఫోన్ నంబర్లు తప్పుగా ఉంటున్నాయి. కొన్నిచోట్ల ఎల్‌పీఎంలు సరిగా లేవు. వీటన్నింటిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా. అర్హులైన ప్రతి రైతుకు సుఖీభవ లబ్ధి దక్కేలా చూడాలని ప్రయత్నిస్తున్నాం. ఎం.రామారావు, ఏడీ, అనకాపల్లి

## రైల్వే జోన్ పనులు చకచకా

ఆరిలోవ : విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటు పనులు ఊపందుకున్నాయి. తెలుగు ప్రజల చిరకాల కోరిక త్వరలో నెరవేరనుంది. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదేళ్లు ఆలస్యమైంది. జోన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం భూములు కేటాయించలేదని 2023లో అప్పటి రైల్వేశాఖ మంత్రి ప్రకటన చేసిన తరువాత ముడసర్లోవ ప్రాంతంలో 54 ఎకరాల భూమిని కేటాయించింది.

ఆ భూములు రిజర్వాయర్ పరివాహక ప్రాంతంలో ఉన్నాయని రైల్వే ఇంజినీరింగ్ అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో జోన్ పనులు అడుగు కూడా ముందుకు పడలేదు.కథనంతో తొలగిన అడ్డంకి: కోల్‌కతాకు చెందిన ఓ సంస్థ టెండరు దక్కించుకుంది. మార్చి నెలలో పనులు ప్రారంభమయ్యాయి. స్థానిక రామకృష్ణాపురం ప్రజలు తమకు నష్టపరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తూ 20 రోజులపాటు



పనులు జరగనీయలేదు. ఈ సమస్యను పరిష్కరించడంలో జాప్యమవుతోందని ప్రచురితమైంది.

స్పందించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆందోళన చేస్తున్న రైతులకు దగ్గరలోని ప్రభుత్వ భూముల్లో స్థలాలు ఇప్పిస్తామని చెప్పి జోన్ పనులకు ఆటంకం లేకుండా చేశారు. దీంతో ఏప్రిల్ నెలాఖరు నుంచి తిరిగి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ప్రధాన భవనం నిర్మాణం కోసం భూమిని తవ్వుతున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన 90 మంది కార్మికులు స్థలంలోనే తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకుని పనులు వేగంగా చేస్తున్నారు.

ప్రాజెక్టు పూర్తికి రెండేళ్ల గడువు: కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైల్వే జోన్‌పై ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రధానమంత్రి, రైల్వేశాఖ మంత్రితో దఫదఫాలుగా చర్చలు జరిపి మార్గం సుగమం చేసింది. భూమి కేటాయింపు విషయంలో స్పష్టమైన ప్రకటన చేసింది. భూసార పరీక్షలు చేయించి ఫలితాలు వచ్చిన తరువాత టెండరు ప్రక్రియ ప్రారంభమయ్యేలా కృషి చేసింది. తూర్పు కోస్తా రైల్వే జోన్ కార్యాలయం గతేడాది డిసెంబరులో టెండరు పిలిచింది. జోన్ ప్రధాన కార్యాలయానికి రూ.149 కోట్ల అంచనా వ్యయంతో 12 అంతస్తుల భవనం నిర్మించాలన్నది ప్రతిపాదన. ఈ ప్రాజెక్టు రెండేళ్లలో పూర్తి చేయాలని గడువుగా పెట్టుకున్నారు.

# చామ కాల్వకు చేవ

నంద్యాల : జిల్లా కేంద్రం నంద్యాల పట్టణాన్ని వరద ముప్పు నుంచి కాపాడేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏటా ముంపునకు కారణమవుతున్న చామకాల్వ వెంట రక్షణ గోడ నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మహానంది మండలంలో కురిసిన వర్షంనీరు పాలేరువాగు ద్వారా ప్రవహించి నంద్యాల వద్ద చామకాల్వలో కలుస్తుంది. దీంతో పాటు నంద్యాలలో పడిన వర్షంనీరు, మురుగంతా ఇందులోకే చేరుతుంది. పట్టణ నడిబొడ్డున 9 కి.మీల పొడవున ప్రవహించే ఈ కాల్వ ఆక్రమణలతో కుచించుకుపోయింది. దీంతో భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో వరద నీరు పట్టణాన్ని ముంచెత్తుతోంది. ఆస్తి, ప్రాణ నష్టం కలిగిస్తోంది. ఈ సమస్య పరిష్కారం కోసం 6.70 కి.మీల పొడవున కాల్వను ఆధునికీకరించడంతో పాటు రక్షణగోడ, వంతెనలు నిర్మించాలని కేసీ కెనాల్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు.

**అవసరమైన చోటే భూ సేకరణ**

మొదటి విడతలో మూడు ప్యాకేజీలుగా చామకాల్వ విస్తరణ, రక్షణగోడ, వంతెనల నిర్మాణ పనులన్నీ ఇరిగేషన్ శాఖకు చెందిన భూముల్లో మాత్రమే చేపడతారు. వీటికి కొత్తగా భూమి సేకరించాల్సిన అవసరం లేదు. దీంతో ఖర్చు భారీగా తగ్గనుంది. అత్యవసరమైన చోట్ల మాత్రమే భూమి సేకరిస్తారు. ఎస్‌బీఐ కాలనీ నుంచి సాయిబాబానగర్, గోపాల్‌నగర్, దేవనగర్, సరస్వతినగర్, శ్యాంనగర్, హనీఫ్‌నగర్ మీదుగా ప్రథమనంది ఆలయం సమీపం వరకు బిట్లు బిట్లుగా ఈ పనులు జరుగనున్నాయి.

ఈ పనులు పూర్తయిన తర్వాత రెండో విడత కింద మరికొన్ని పనులు చేపట్టనున్నారు. అప్పుడు అవసరమైతే భూ సేకరణ చేపడతారు.

**వారి హామీలు వరదలో కలిశాయి**

2007లో నంద్యాలకు వరదలొచ్చినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నంద్యాలలో పర్యటించారు. చామకాల్వ, కుందూ, మద్దిలేరు విస్తరణ, సుందరీకరణ, రక్షణ గోడ నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఇందుకోసం రూ.100 కోట్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ఆ తర్వాత ఈ పనులకు టెండర్లు పిలిచారు. రక్షణ గోడ నిర్మాణం కొంతమేర చేపట్టి వదిలేశారు. తర్వాత ఈ పనుల ఊసే లేకుండాపోయింది. 2017లో చామకాల్వలో పూడికతీత పనులు జరుగుతున్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుడి హోదాలో నంద్యాలలో పర్యటించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చామకాల్వ, కుందూ ఆధునికీకరణ పనులు చేస్తామని హామీ ఇచ్చారు. 2019 వరదల సమయంలో సీఎం హోదాలో నంద్యాలకు వచ్చిన జగన్ మరోసారి చామకాల్వ ఆధునికీకరణకు హామీ ఇచ్చినా అమలు చేయలేదు. తండ్రీకుమారులైన ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు చామకాల్వ విస్తరణ, రక్షణగోడ నిర్మాణానికి ఇచ్చిన హామీలను విస్మరించారు.

**మూడు ప్యాకేజీలుగా పనులు**

చామకాల్వ ఆధునికీకరణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టనున్నారు. మొదటి ప్యాకేజీ కింద ముందుగా 6.70 కి.మీల పొడవున రక్షణగోడ నిర్మిస్తారు. రెండో ప్యాకేజీ కింద చామకాల్వను ఆధునీకీకరిస్తారు. కాల్వ పొడవునా పూడిక, కంపచెట్లు తొలగిస్తారు.

మూడో ప్యాకేజీలో చామకాల్వ మీద పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ఆరు వంతెనలు నిర్మిస్తారు. ఈ పనులన్నీ చేసేందుకు రూ.77.34 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు చామకాల్వకు గరిష్ఠంగా వచ్చిన వరదను దృష్టిలో ఉంచుకుని విస్తరణ పనులు చేపట్టనున్నారు. భారీ వరదలు వచ్చినా పట్టణానికి ముప్పు లేకుండా రక్షణ గోడను నిర్మించనున్నారు.

**ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం–** ప్రతాప్, ఈఈ, కేసీ కెనాల్, నంద్యాల నంద్యాలలో చామకాల్వ విస్తరణతో పాటు రక్షణగోడ, వంతెనల నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. తొలి విడతలో భూమి సేకరించడం లేదు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే పనులు చేపడతాం.

# ప్రజల ఆరోగ్యంతో చెలగాటమా?

తాడేపల్లిగూడెం : పట్టణంలోని రామారావుపేట, సుబ్బారావుపేట, కేఎన్ రోడ్డు, జూబ్లీ రోడ్డు, బేబీ సెంటర్, ఇతర ప్రాంతాల్లో అనధికారికం గా కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటు చేశారు. ఇళ్లు, వాణిజ్య సముదాయాలు, కల్యాణ మండపాలు, లాడ్జిల్లో నెలవారీ అద్దెలు చెల్లిస్తూ ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. తణుకు పట్టణంలోని పైవంతెన, ప్రభుత్వాసుపత్రి సమీపంలో, సూర్యాలయం వీధిలో తదితర ప్రాంతాల్లో పదుల సంఖ్యలో ప్రైవేటు ఆసుపత్రులు వెలిశాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో నిబంధనలకు విరుద్ధంగా వీటిని నిర్వహిస్తున్నారు. జిల్లాలో అనధికారిక ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. పురపాలికల నుంచి ఎటువంటి అనుమతులు పొందకుండానే ఇళ్లను ఆసుపత్రులుగా మార్చేస్తున్నారు. నిబంధనలు పాటించకపోవడంతో అటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడటంతో పాటు ఇటు ప్రజల ఆరోగ్యంతోనూ చెలగాటమాడు తున్నారు.



భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం ప్రాంతాల్లో ఇటీవల వెటర్నిటి, జనరల్ ఫిజిషియన్, సర్జన్, న్యూరో, ఆర్థోపెడిక్, దంత వైద్యం ఇలా పలు విభాగాల్లో ఆసుపత్రులు నిర్వహిస్తున్నారు. జనావాసాల్లో ఇళ్లను, అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకుని తర్వాత వాటిని ఆసుపత్రులుగా మార్చేస్తున్నారు. ఈ క్రమంలో అనుమతులు తీసుకోవడం లేదు. ఆసుపత్రులకు ఉండాల్సిన కనీస నిబంధనలు పాటించడం లేదు. ఇటీవల తణుకు పట్టణంలోని బొమ్మల వీధిలో ఓ ఇంట్లో నిర్వహిస్తున్న ఆసుపత్రిపై పలువురు మున్సిపాలిటీకి ఫిర్యాదు చేశారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని సుబ్బారావుపేటలో ఓ కల్యాణ మండపంలో ఆసుపత్రి నిర్వహిస్తుండటం గమనార్హం.

**అటకెక్కిన బయో వ్యర్థాల నిర్వహణ..** ఆసుపత్రులు, క్లినిక్‌లు జనావాసాల్లో ఏర్పాటు చేయాలంటే బయో వ్యర్థాల నిర్వహణ, తదితర రక్షణ చర్యలు చేపట్టాలి. కానీ ఇవేమీ పాటించడం లేదు. అత్యవసర సేవలకు వెళ్లాలంటే ఆ స్థాయికి తగిన ర్యాంపు, లిఫ్ట్, ప్రత్యేక మార్గం ఉండాలి. కానీ ఇవేమీ ఉండటం లేదు. బయోవ్యర్థాలను సైతం ఒక్కోసారి బయట పడేస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. 'ఇళ్లను ఆసుపత్రులు, క్లినిక్‌లుగా మారిస్తే అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం' అని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు అన్నారు.

# మోకీళ్ల మార్పిడా.. ఏడాది నిరీక్షించాల్సిందే..!



తిరుపతి : వచ్చిన రోజే ఓపీ వైద్యసేవలు అందుతాయనే నమ్మకం.. రోగులకు సరిపడా పడకల ఏర్పాటు.. నడవలేని వారికి మోకీళ్ల మార్పిడికి భరోసా.. నాణ్యమైన కృత్రిమ అవయవాల అమరిక.. ఇకనైనా సాధ్యమయ్యేనా అంటూ శ్రీబాలాజీ దివ్యాంగుల శస్త్రచికిత్స, పరిశోధన కేంద్రం (బర్డ్) రోగులు ఎదురుచూస్తున్నారు. గత ఐదేళ్లూ అస్తవ్యస్తమైన ఈ వైద్య వ్యవస్థను సరిదిద్దేందుకు ఆసుపత్రితో సుదీర్ఘ అనుభవం గల గుడారు జగదీష్‌ను మళ్లీ అదే స్థానంలో ప్రభుత్వం నియమించింది. బుధవారం ఆయన బాధ్యతలు తీసుకోనున్నారు.

ఒకప్పుడు వేకువజామున ఐదు గంటలకు ఓపీ సేవలు.. 350 పడకల నిండుగా రోగులు.. రోజుకు 30 పైగా శస్త్రచికిత్సలు.. రోగులు, బంధువుల తాకిడితో బర్డ్ ఆస్పత్రి కిటకిటలాడేది. వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు ఆస్పత్రిని రాజకీయ వేదికగా మార్చారు. ఆధిపత్యం కోసం సీనియర్ వైద్యులను నిర్లక్ష్యం చేయడంతో పేదలకు వైద్యం దైన్యంగా మారింది. అయినవారికి మాత్రమే ఉచిత మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు చేయడం.. మిగిలినవారి నుంచి రూ.72 వేలు, రూ.1.35 లక్షలు చొప్పున వసూలు చేయడం వంటి అస్పష్ట విధానాలు అమలు చేశారు. దీంతో దేశవ్యాప్తంగా వచ్చే రోగులు క్రమంగా తగ్గిపోయారు. ఐదు యూనిట్ల వైద్యసేవలు మూడింటికి పరిమితమయ్యాయి. రోజువారీ శస్త్రచికిత్సల సంఖ్య తగ్గడంతో రోగులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వస్తోంది. రోజువారీ ఓపీలు 300కు పడిపోయినా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల తేదీని 2026 జూన్ నాటికి ఇస్తున్నారు. సమయ కేటాయింపు పారదర్శకంగా జరగడం లేదు.

**వైద్యుల్లో సమన్వయం పెరగాలి**

సంచాలకుల పర్యవేక్షణ లేకపోవడంతో బర్డ్‌లో వైద్యుల మధ్య సమన్వయ లోపం నెలకొంది. తితిదే నిబంధనలు కాదని కొందరు ప్రైవేటు సేవలు అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కనీసం వార్డుల్లో రౌండ్లు వేయని పరిస్థితి. ఇదే సమయంలో కొందరు తితిదే.. మరికొందరు బర్డ్ ట్రస్టు నుంచి రావడంతో సమన్వయ లోపం కన్పిస్తోంది. అత్యవసర విభాగానికి ట్రామా కేసులు పెద్దగా రావడం లేదంటే సేవలపై నమ్మకం లేదనే చెప్పాలి. మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో పారదర్శకత తోడు ఇంప్లాంట్ల బిగింపులోని లోటుపాట్లను తక్షణమే సరిదిద్దాల్సి ఉంది.

**పడకల పెంపు అవశ్యం**

ఒకప్పుడు 350 పడకల ఉన్న బర్డ్ ప్రస్తుతం 200 పడకలకే పరిమితమైంది. అందులోనూ కొన్ని విభాగాలు ఖాళీగా ఉన్నాయి. రోగుల తాకిడికి తగ్గట్టుగా పడకల సంఖ్య పెంచాల్సి ఉంది. ఐదేళ్లుగా శ్రీపద్మావతి మహిళా వైద్య కళాశాల ఆర్థో విభాగం ప్రాక్టికల్ వైద్యవిద్యకు దూరమైంది. ఇకనైనా వీరికి క్లినికల్ విద్యను అందించాల్సి ఉంది.

# ఇసుక తోడేళ్లు.. ఏడవేం సంకెళ్లు?



చిత్తూరు : నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం తాటిపర్తిలో క్వార్ట్ అక్రమ మైనింగ్ కేసులో ఎట్టకేలకు మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. వైకాపా హయాంలో రూ.138 కోట్ల ఖనిజాన్ని లూటీ చేయడంలో ఈయన కీలక పాత్ర పోషించారు. ఇదే తరహాలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో జగన్ పాలనలో ఇసుకను కొల్లగొట్టారు. నదుల్లో రోడ్లు వేసి సహజ ప్రవాహాన్ని మళ్లించి మరీ దోపిడీకి పాల్పడ్డారు. వైకాపాలోని కీలక నాయకులే ఇందులో కీలక పాత్ర పోషించారు. ఏడాదవుతున్నా వారిపై చర్యలు లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. నాగలాపురం మండలం తమిళనాడుకు ఆనుకుని ఉంటుంది. ఇక్కడి అరణియార్ నదిలోని ఇసుకను అక్రమార్కులు పొరుగు రాష్ట్రానికి అక్రమంగా తరలించారు. జూన్ నుంచి అక్టోబరు వరకు తవ్వకాలు జరపకూడదనే ఆదేశాలున్నా ధిక్కరించారు. ప్రారంభంలో జరిగిన మైనింగ్‌లో ఉమ్మడి కడప జిల్లాకు చెందిన, మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు సన్నిహితుడైన నాయకుడు హవా చూపారు. ఏడాదిన్నర తర్వాత ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైకాపాలోని 'పెద్ద' నేత పెత్తనం మొదలైంది. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) హెచ్చరికలను కూడా బేఖాతరు చేసి నదిలో గ్రావెల్‌తో రోడ్డు వేసి టిప్పర్ల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఒక్క అరణియార్‌లోనే రూ.150 కోట్లకుపైగా ఇసుకను తవ్వి, తరలించి సొంత జేబుల్లోకి మళ్లించారనే ఆరోపణలున్నాయి. ఎన్‌జీటీ ఆదేశాలతో వైకాపా హయాంలోనే విచారణ జరిపినా ఇప్పటివరకూ ఒక్కరిపైనా చర్యలు లేవు.

**శ్రీకాళహస్తిలో స్వర్ణముఖి నదిని..**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో వైకాపా హయాంలో నాటి కీలక ప్రజాప్రతినిధి స్వర్ణముఖి నదిని గుల్ల చేశారు. అన్ని మండలాల్లో విచ్చలవిడిగా యంత్రాలు ఉపయోగించి ఇసుక తవ్వేశారు. పదిసార్లు ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేస్తే కేవలం ఒక్కసారి మాత్రమే వచ్చి తూతూమంత్రంగా వాహనాలు సీజ్ చేసి చేతులు దులుపుకొన్నారు. ఈ నియోజకవర్గంలో యువగళం పాదయాత్రకు వచ్చినప్పుడు నారా లోకేశ్.. ఇసుక అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నేటికీ బాధ్యులను గుర్తించలేదు.

**పుంగనూరులో రోజుకు రూ.50 లక్షల విలువైన**

పుంగనూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాలో ఒక్కరే ఆధిపత్యం ప్రదర్శించారు. వైకాపాలోని చోటా నేతలు ఎవరైనా వేలు పెడితే పోలీసులు, రవాణా, గనుల శాఖ అధికారులు రంగంలోకి దిగి జరిమానాలు విధించారు. కీలక నేత నియోజకవర్గంలోని నదులు, చెరువుల్లోని ఇసుకను స్వాహా చేశారు. సోమల మండలంలో 10–15 అడుగుల లోతు వరకు తవ్వి ప్రకృతి సంపదను పట్టపగలే బెంగళూరు తరలించారు. రోజుకు 50–60 టిప్పర్లు పొరుగు రాష్ట్రానికి క్యూ కట్టేవి. ఒక్కరోజు సంపాదనే రూ.50 లక్షల వరకు ఉందని వైకాపా నేతలే చెప్పుకొనేవారు.

**పలమనేరులోనూ ఇలాగే..**

పెద్దపంజాణి, పలమనేరు మండలాల్లోని ఇసుకను బెంగళూరు తరలించారు. ముఖ్య ప్రజాప్రతినిధి రాత్రిళ్లు తరలిస్తే పుంగనూరు నేత సమయంతో సంబంధం లేకుండా చెలరేగిపోయారు.

జీడీ నెల్లూరులోని నీవా నది ఇసుకను బెంగళూరు తరలించారు. చిత్తూరులో నీవా నదిలో ప్రత్యేకంగా రోడ్డు వేసి వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేశారు. నగరి కుశస్థలి నదిలో తవ్వకాలకు అడ్డే లేదు. ఒకానొక దశలో అక్రమ రవాణాను అడ్డుకున్న కానిస్టేబుల్‌పై నాటి మంత్రి రోజా అనుచరుడు విరుచుకుపడ్డారు.

# చిరుతలపై.. నిరంతర నిఘా

తిరుపతి : శేషాచలం కొండల్లో ప్రధానంగా యాత్రికులు రాకపోకలు సాగిస్తున్న అలిపిరి నడక మార్గంలో చిరుత పులుల దాడుల నుంచి భక్తులను రక్షించుకునేందుకు అటవీశాఖ, తితిదే తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. పరస్పర సహకారంతో చిరుతల సంచారంపై ఇప్పటికే నిరంతర పర్యవేక్షణ సెల్ ఏర్పాటైంది. రాత్రి సమయంలో అలిపిరి నడక మార్గంలో తిరుమలకు చేరుకునే భక్తులు వాటి దాడులకు గురికాకుండా ప్రత్యేక వ్యవస్థ సిద్ధం చేశారు. అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకుని భక్తులు, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

అటవీశాఖ, తితిదే యంత్రాంగం సుదీర్ఘ చర్యల అనంతరం అలిపిరి నుంచి తిరుమలకు భక్తులు చేరుకునే నడక మార్గంలో లైవ్ కెమెరాలు, థర్మల్ కెమెరాల సాయంతో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటైంది. చిరుతపులుల సంచారం ఎక్కువగా ఉన్న అలిపిరి పాదాల మండపం నుంచి ఏడో మైలు తరువాత ఉన్న నరసింహస్వామి ఆలయం వరకు అటవీ, తితిదే విజిలెన్స్ విభాగాలతో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి వారిని భక్తులకు రక్షణ కవచాలుగా వినియోగిస్తున్నారు. సమస్యాత్మక ప్రదేశాలుగా గుర్తించిన 40 ప్రదేశాల్లో 40 లైవ్ కెమెరాలు బిగించారు. రాత్రుళ్లు సైతం పనిచేసేలా థర్మల్ కెమెరాలు ఏర్పాటు చేశారు. తిరుపతి రేంజ్ కార్యాలయం, అలిపిరి కాలిబాటలోని ఏడో మైలు వద్దనున్న ఫారెస్ట్ మ్యూజియం వద్ద బేస్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. సిబ్బందితో సమాచారం పంచుకునేందుకు ప్రత్యేకంగా 20 వాకీటాకీలు సమకూర్చారు. చిరుత పులులు, ఎలుగుబంట్లు నడకమార్గం వైపు వచ్చే సమయంలో లైవ్ కెమెరాలతో గుర్తించడం, భక్తుల రక్షణ



బృందాలకు, వారిని పర్యవేక్షించే అధికారులకు సమాచారం చేరవేసేలా బేస్‌స్టేషన్లు పనిచేస్తున్నాయి.

బేస్‌స్టేషన్లు కీలకం.. చిరుతలు, ఎలుగుబంట్ల దాడుల నుంచి భక్తులను రక్షించుకునేలా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పర్యవేక్షణ కేంద్రాలకు అనుసంధానంగా బేస్‌స్టేషన్లు పనిచేస్తున్నాయి. 40 లైవ్, థర్మల్ కెమెరాలతో నడక మార్గాన్ని పర్యవేక్షిస్తూ రక్షణ బృందాలు, అధికారులను అప్రమత్తం చేస్తున్నాం. వివేక్, జిల్లా అటవీ అధికారి

# ఈ-యంత్రం.. గోదాంలో భద్రం

ఆదోని : జిల్లాలోని మార్కెట్ యార్డులకు కేటాయించిన యంత్రాలు నిరుపయోగంగా మారాయి. వాటిని వినియోగిస్తే.. రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఈ–నామ్ వ్యవస్థలో భాగంగా కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులకు రూ.లక్షలు వ్యయం చేసి గ్రేడింగ్ యంత్రాలు అందించింది. 2018లో జిల్లాలో ఈ–నామ్(ఈ–నేషనల్ అగ్రికల్చర్ మార్కెట్) విధానం అమల్లోకి వచ్చింది. అందులో భాగంగా 2022–23 ఆర్థిక ఏడాదిలో అంటే గత వైకాపా పాలనలో యంత్రాలు అందించింది. ఒక్కో యంత్రం ఖరీదు సుమారు రూ.50–55 లక్షలు. మార్కెట్ యార్డులకు రైతులు తెచ్చే మల్టీ కమోడిటీస్ పంటలు అంటే కందులు, ఆముదాలు, పూలవిత్తనాలు, శనగలు, కొర్రలు తదితర గింజ దిగుబడులను గ్రేడింగ్ చేసుకొనేందుకు వీటిని తెరపైకి తెచ్చింది.



యంత్ర సేవలు అందుబాటులో లేక రైతులు ధర రూపంలో నష్టపోవాల్సి వస్తోంది. రికార్డు స్థాయిలో ఆదాయాలు

రైతులు పండించిన పంట దిగుబడులపై యార్డులు ఒక శాతం సెస్సు వసూలు చేస్తాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా.. రైతుకు అందాల్సిన సేవలు అందటం లేదు. 2024–25 ఏడాదిలో జిల్లాలోని ఏడు యార్డులకు రికార్డు స్థాయిలో ఆదాయాలు సమకూరాయి. రూ.36 కోట్లకు రూ.39 కోట్లు ఆర్జించాయి. ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డుల ఆదాయం రూ.35 కోట్లు రావడం విశేషం.

**రికార్డు స్థాయిలో ఆదాయాలు**

రైతులు పండించిన పంట దిగుబడులపై యార్డులు ఒక శాతం సెస్సు వసూలు చేస్తాయి. ఏటా రూ.కోట్లలో ఆదాయం వస్తున్నా.. రైతుకు అందాల్సిన సేవలు అందటం లేదు. 2024–25 ఏడాదిలో జిల్లాలోని ఏడు యార్డులకు రికార్డు స్థాయిలో ఆదాయాలు సమకూరాయి. రూ.36 కోట్లకు రూ.39 కోట్లు ఆర్జించాయి. ఆదోని, ఎమ్మిగనూరు, కర్నూలు మార్కెట్ యార్డుల ఆదాయం రూ.35 కోట్లు రావడం విశేషం.

**రైతులకు దక్కని ధర**

పండించిన పంటను త్వరితగత్తిన అమ్ముకుని అప్పులు, అవసరాలు తీర్చుకోవాలనే ఆలోచనతో చాలా మంది రైతులు ఉన్న సరకును యార్డులకు తెచ్చి కుప్పగా పోసి వచ్చిన ధరకు అమ్ముకుని ఇంటి బాట పడుతున్నారు. రైతుల ఇళ్ల వద్ద స్థలం లేకపోవడం, రక్షణ సాధ్యం కాకపోవడంతో అక్కడే విక్రయించేస్తున్నారు. ఈ–నామ్ వ్యవస్థలో భాగంగా రైతులు గ్రేడింగ్ విధానం అలవాటు చేసుకుని, పంటకు మంచి ధర అందుకోవాలనే ఆలోచనతో గ్రేడింగ్ యంత్రాలు అందించింది. యార్డుకు తెచ్చిన సరకును నామమాత్రపు రుసుంతో రైతులు గ్రేడింగ్ యంత్రం వద్ద శుభ్రం చేసుకుని.. యార్డులో టెండర్‌కు ఉంచడం వల్ల సరకు నాణ్యతగా మారి మంచి ధర పొందొచ్చు. వ్యాపారులకూ ప్రయోజనకరంగానే ఉంటుంది. వీటి సేవలపై రైతులకు అవగాహన కల్పించి లాభపడేలా చేయాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తోంది. దీంతో ఈ–నామ్ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా స్పందించి రైతులకు గ్రేడింగ్ యంత్ర సేవలు అందుబాటులోకి తెచ్చేలా చేస్తే రైతులకు మేలు జరుగుతుంది.

**ఇదీ పరిస్థితి..**

ఆదోనికి ఇచ్చిన యంత్రం యార్డు ఆవరణలోని గోదాంలో ఉంచి, వాటికి తాళాలు వేశారు. ఇక్కడి యార్డుకు ఏడాదికి కందులు, పూలవిత్తనాలు, ఆముదాలు లాంటి పంట దిగుబడులు సుమారు 35 వేల క్వింటాళ్ల దాకా సరకు అమ్మకానికి వస్తోంది. యంత్రం సేవలపై అధికారులను ప్రశ్నిస్తే.. నిర్వహణకు టెండర్ ప్రకటన చేసినా గుత్తేదారులు ఎవరూ ముందుకు రాలేదని దాటవేశారు. ఆ తర్వాత మళ్లీ ప్రయత్నం కూడా చేయకపోవడం గమనార్హం. ఎమ్మిగనూరు యార్డుకు వేరుసెనగ, ఆముదాలు, కందులు తదితరాలు ఏడాదికి 6–7 లక్షల బస్తాలు అమ్మకానికి వస్తాయి. ఇక్కడి యార్డులో యంత్రం నిర్వహణకు విద్యుత్తు సౌకర్యం కల్పించి, ట్రయల్ రన్ చేశారు. ఇక్కడా నిర్వహణకు టెండర్ పిలిస్తే ఎవరూ రాలేదని సమాచారం. కర్నూలులో పంట దిగుబడులు 10–15 వేల క్వింటాళ్లకుపైగా అమ్మకానికి వస్తాయి. ఇక్కడా టెండర్ ద్వారా గుత్తేదారుకు యంత్రం సేవలు అప్పగించారు. రైతుల సేవలకంటే, వ్యాపారుల సేవలో గ్రేడింగ్ యంత్ర సేవలు అందుతాయని సమాచారం. రైతు నుంచి పంట సరకు కొనుగోలు చేసిన వ్యాపారి ఇక్కడి గ్రేడింగ్ చేసుకుని లాభపడుతున్నారు.

# పనులు అసంపూర్ణం.. పూర్తైనా నిరుపయోగం

ఏలూరు : ప్రభుత్వ బడులను అభివృద్ధి చేసేందుకు వైకాపా ప్రభుత్వం చేపట్టిన 'నాడు–నేడు' పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఈ కార్యక్రమం కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో 9 రకాల పనులను చేపట్టారు. వాటిలో ఒకటి మరుగుదొడ్ల నిర్మాణం. రెండో విడతలో చేపట్టిన పనుల్లో చాలా వరకు అసంపూర్తిగా నిలిచాయి. కొన్ని బడుల్లో వీటిని నిర్మించినప్పటికీ నిర్వహణ సరిగా లేనందున నిరుపయోగంగా ఉన్నాయి. ఫలితంగా విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తగినన్ని నిధులను విడుదల చేస్తే అసంపూర్తి మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తికాగలవు.

**మండవల్లి మండలంలో..**

చింతపాడు ఉన్నత పాఠశాలలో బాలురకు మరుగుదొడ్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. నాడు–నేడులో మంజూరైనా నేటికీ నిర్మాణం ప్రారంభం కాలేదు. ముదినేపల్లి మండలం కాకరవాడ శివారు దేవరం పాఠశాలలో మూడేళ్లుగా నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్లు పూర్తవలేదు. శ్లాబ్ లెవల్‌లో నిర్మాణం నిలిచిపోయింది.

**కొయ్యలగూడెంలో..**

రాజవరం మండల పరిషత్తు ప్రత్యేక ప్రాథమిక పాఠశాలకు 2022లో నాడు–నేడు రెండో విడతలో రూ.21 లక్షల అంచనా వ్యయంతో మరుగుదొడ్లు తదితర పనులకు అనుమతులు మంజూరయ్యాయి. పనులు మొదలుపెట్టి మరో మూడు నెలలకు మూడేళ్లవుతుంది. నిర్మాణమైతే పూర్తి చేశారు కానీ లోపల ప్లంబింగ్ పనులు చేపట్టలేదు. పూర్తయితే రంగులు వేయాల్సి ఉంది. ఇప్పటి వరకు సుమారు రూ.9 లక్షలు మాత్రమే విడుదలయ్యాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ఉంగుటూరులో..మండలంలో 22 పనులు మంజూరుకాగా ఇంకా 6 పూర్తి కావాల్సి ఉంది. నాచుగుంట పంచాయతీ పరిధిలోని కొత్తగూడెం ఎంపీపీ పాఠశాలలో మరుగుదొడ్లకు తలుపులు రావాల్సి ఉంది. కాగుపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో రంగులు వేయలేదు. బాదంపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్మాణం పూర్తయినా వినియోగించడం లేదు.

నాడు–నేడు పనుల వివరాలు రెండో విడత ఎంపిక చేసిన బడులు : 820
మంజూరైన పనులు : 2,608 పూర్తయినవి :2,005

# వేతనాలకు ఎదురుచూపులు

పుట్టపర్తి : వేతన బకాయిలు ఏడు వారాలుగా జమ కాకపోవడంతో కూలీలు నానా అగచాట్లు పడుతున్నారు. మండుటెండల్లో పనులు చేస్తున్నా.. సకాలంలో వేతనాలు అందక.. కుటుంబపోషణ భారంగా మారిందని వాపోతున్నారు. వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి హామీ పథకం పైనే ఆధారపడుతున్నారు. జిల్లాలో 2,75,364 జాబ్‌కార్డులు ఉండగా 2.74 మంది కూలీలు పనులు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వారంలోగానే వేతనం అందించాల్సి ఉన్నా అమలు కావడం లేదు. సుమారు రూ.46 కోట్లు కూలీల ఖాతాల్లో



జమ కావాల్సి ఉంది. ఉపాధి హామీ ద్వారా ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లాలో నీటికుంటలు, ఇంకుడుగుంతలు, భూమి చదును, సరిహద్దు, కందకాలు, పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు చేపడుతున్నారు. ఒక్కో కూలీకి రోజుకు సగటు వేతనం రూ.307గా నిర్ణయించారు. దీంతో కుటుంబమంతా ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఈక్రమంలో వారాల తరబడి చెల్లింపులు నిలిచిపోవడంతో అప్పు చేసి జీవనం సాగించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెల్లింపులకు చర్యలు తీసుకుంటాం విజయప్రసాద్, డ్వామా పీడీ

ఉపాధి హామీ కూలీలకు వేతనాలు జమ కావాల్సి ఉంది. ఇప్పటికే వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. వారంలో బకాయిలన్నీ చెల్లిస్తాం. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# గుట్ట.. నక్కలు

యర్రావారిపాలెం : కొండలు.. గుట్టలు.. చెరువులను భూబకాసురులు యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. గ్రావెల్ తరలించాక వాటిని కబ్జా చేయడం వీలైతే విక్రయించడం చేస్తున్నారు. మండలంలోని యల్లమంద పంచాయతీ మర్రిమాకులపల్లె సర్వే నంబరు 692లో సుమారు 300 ఎకరాల్లో కొండలు, గుట్టలు విస్తరించాయి. ఇదే అదనుగా భారీ యంత్రాలు ఉపయోగించి గుట్టలు, కొండలు పిండిచేస్తున్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన తలకోన నెరబైలు పంచాయతీలోనూ ఇదే తీరుగా యంత్రాలతో కబ్జాపర్వం కొనసాగిస్తున్నారు. ఇప్పటికే ఈ ప్రాంతాల్లో 10 నుంచి 15 ఎకరాల భూములు ఆక్రమం



చేశారు. తోటిహరిజనవాడకు చెందిన కొందరు గండుగు చెరువును ఆనుకుని ఉన్న పేటిగుట్టను చదునుచేసి ఐదెకరాలు కబ్జా చేశారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

వాల్టా చట్టం మేరకు మట్టి, ఇసుక తరలించడానికి ఎలాంటి అనుమతులు లేవు. ప్రభుత్వ ఆధీనంలోని గుట్టలు, కొండలు, చెరువులు ఆక్రమించిన వారిపై కేసులు నమోదుచేసి చర్యలు తీసుకుంటాం. పరమేశ్వరస్వామి, తహసీల్దారు, యర్రావారిపాలెం

# గుడివాడ కొండపై 'అనకొండలు'.. అక్రమంగా బ్లాక్ మెటల్ వెలికితీత

చోడవరం : రావికమతం చోడవరం నియోజకవర్గ పరిధిలోని గుడివాడ కొండపై బ్లాక్ మెటల్ తవ్వకాలు నిరాటంకంగా జరుగుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ శాఖల అనుమతులు లేకుండానే యంత్రాలతో మెటల్ తవ్వి వాహనాల్లో యథేచ్ఛగా తరలిస్తున్నారు. సర్వే నంబరు 338-2లోని కొండపై అనధికారిక తవ్వకాలను నెల రోజుల కిందట అధికారులు నిలిపివేయించారు. పొక్లెయిన్‌ను సీజ్ చేసి రూ.50 వేలు జరిమానా విధించారు. ఇటీవల ఆ మొత్తం చెల్లించడంతో పొక్లెయిన్‌ను యజమానికి అప్పగించారు. తాజాగా అదే క్వారీలో ఆదివారం రాత్రి నుంచి అనధికార తవ్వకాలకు తెరలేచింది. బ్లాక్ మెటల్‌ను పేల్చేందుకు డ్రిల్లింగ్ మిషన్లు, జనరేటర్, పీపాల్లో డీజిల్‌ను క్వారీ వద్దకు తరలించి రాత్రికి రాత్రే బ్లాస్టింగ్ చేసి వాహనాల్లో తరలించేందుకు సిద్ధం చేశారు. అనధికార తవ్వకాలపై స్థానికులు గనులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా.. గనుల శాఖ నర్సీపట్నం సహాయ సంచాలకులు శివాజీ, తహసీల్దారు వెంకటరమణ ఆదేశాల మేరకు ఉప తహసీల్దారు అప్పలనాయుడు, వీఆర్‌ఓలు నారాయణరావు, అప్పారావు, నాగరాజు క్వారీని సందర్శించారు.



అప్పటివరకు తవ్వకాలు జరిపిన వారంతా అధికారులు వస్తున్నట్లు తెలుసుకుని అక్కడ్నుంచి జారుకున్నారు. డ్రిల్లింగ్ మిషన్, జనరేటర్, స్ప్రెన్సర్లు, డీజిల్ పీపాలను సీజ్ చేసిన గనుల శాఖ అధికారులు ఉప తహసీల్దారు అప్పలనాయుడు, గుడివాడ వీఆర్‌ఓ నారాయణరావుకు అప్పగించారు.

గనుల శాఖ ఏడీ శివాజీ మాట్లాడుతూ.. 'సర్వే నంబరు 338-2లో 4.95 ఎకరాల విస్తీర్ణంలో బ్లాక్ మెటల్ తవ్వకాలకు 'నెట్ కం ఐటీ సొల్యూషన్స్ ప్రైవేటు లిమిటెడ్' ఈ-వేలంలో 16.2 లక్షలు చెల్లించి అనుమతి కోరింది. సంబంధిత ధ్రువపత్రాలు, అగ్రిమెంట్లు ఇంత వరకు గనుల శాఖకు అందజేయలేదు. నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు సమర్పించిన తర్వాతే ఈసీ జారీ చేస్తాం. ఈసీ తీసుకున్న తర్వాతే తవ్వకాలకు అనుమతిస్తాం. గుడివాడ కొండపై బ్లాక్ మెటల్ తవ్వకాలకు మైనింగ్ శాఖ ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు. ముందస్తు అనుమతుల్లేకుండా తవ్వకాలు జరపడం నేరం. తవ్వకాలకు వినియోగించిన వాహనాలను, యంత్రాలను సీజ్ చేసి రెవెన్యూ సిబ్బందికి అప్పగించా'మని పేర్కొన్నారు.

# రూ.335 కోట్లతో రైల్వే ఫ్లైఓవర్ లైన్ నిర్మాణం



గుత్తి: ఇటీవల రైళ్లలో వరుసగా జరిగిన దోపిడీ దొంగల ఆగడాలకు చెక్ పెట్టేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టారు. ప్రయాణికుల సౌకర్యార్థం గుంతకల్లు డివిజన్ గుత్తి రైల్వే స్టేషన్ సమీపంలో రూ.335 కోట్లతో ఫ్లైఓవర్ రైల్వే లైన్‌ను ఏర్పాటు చేయనుంది. దీనికి సంబంధించి బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. వెంటనే భూసేకరణ ప్రక్రియను చేపట్టాలని గుంతకల్లులోని గేజ్ కన్వర్షన్ ఇంజినీర్లకు ఆదేశాలిచ్చింది. ఇప్పటికే బెంగుళూరు, చెన్నై రైల్వేలైన్లను కలుపుతూ బైపాస్ లైన్ నిర్మించి గుత్తకోట రైల్వే స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ఈస్టేషన్ గుండా రైళ్లతో పాటు గూడ్స్ రాకపోకలు ఎక్కువగా ఉంటున్నాయి. దీంతోపాటు డీజిల్ షెడ్డు, వ్యాగన్ల మరమ్మతుల విభాగం ఉండటంతో ఇంజిన్ల, వ్యాగన్ల సర్దుబాటు ఎక్కువగా ఉంటోంది. గుత్తిలో లైన్లు తక్కువగా ఉన్నాయి. రైళ్ల రాకపోకలకే కాకుండా గూడ్సుల రాకపోకలకూ అంతరాయం ఉంటోంది. దీంతో సరకులను సకాలంలో తరలించలేక పోతున్నారు.గుత్తి స్టేషన్‌లో గూడ్సు ఆగే సమయాల్లో రైళ్లను స్టేషన్ శివారులో ఆపుతుంటే దోపిడీ దొంగలు రైళ్లపై దాడిచేసి ప్రయాణికులను దోచుకుంటున్నారు. దీనికి తాజాగా జరిగిన ఘటనలే నిదర్శనం.

గుత్తి శివారులో గంటల తరబడి రైళ్లు గుత్తి స్టేషన్‌లో ప్రస్తుతం రెండు ప్లాట్‌ఫారాలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ గూడ్స్ బండ్లు ఆగి తిరిగి వెళ్లే వరకు రైళ్లను స్టేషన్‌లోకి అనుమతించడానికి అవకాశం లేక గంటల తరబడి గుత్తి శివారులో నిలపాల్సి వస్తోంది. ఈక్రమంలో దొంగలు రైళ్లపై దాడులకు తెగబడుతున్నారు. ఇలాంటి వాటిని అధిగమించడానికి, సరకుల రవాణాను వేగవంతం చేయడానికి ఫ్లైఓవర్ వంతెను నిర్మించనున్నట్లు సంబంధిత అధికారులు చెప్పారు.

**దోపిడీలకు కళ్లెం పడుతుందిలా..**

పెండేకల్లు బైపాస్ లైన్ నుంచి వచ్చే గూడ్సు బండ్లను గుత్తి స్టేషన్‌లోకి వెళ్లాల్సిన పని లేకుండా నేరుగా ఫ్లైఓవర్ లైన్‌లో వెళ్లే విధంగా చూడనున్నారు. ఇందులో భాగంగా ఎర్రగుడి గ్రామంలో కొత్తగా రైల్వే స్టేషన్‌ను ప్రారంభించనున్నారు. ఇక్కడి నుంచి గుత్తికోట స్టేషన్ వరకు ఫ్లైఓవర్ లైన్‌ను నిర్మిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా పనులు పూర్తయితే గుత్తి రైల్వే స్టేషన్‌లో రైళ్ల రాకపోకలకు అవరోధం ఉండదని, ప్రయాణికుల భద్రత పెరుగుతుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. పనులు యుద్ధప్రాతిపదికన చేపట్టి పూర్తి చేస్తామని అధికారవర్గాలు తెలిపాయి.

# నెట్టికంటయ్యా.. అసౌకర్యాలు కనవయ్యా!



గుంతకల్లు : రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు సౌకర్యాలు కరవయ్యాయి. పాత వసతి గృహాలను సగం వరకు కూల్చి..మిగిలిన కొన్నింటిని అలాగే వదిలేశారు. ప్రముఖ ఆలయం వద్ద ఇలాంటి పరిస్థితి ఉండటం విస్మయానికి గురి చేస్తోంది. కూటమి ప్రభుత్వ ప్రగతి పనులపై దృష్టిసారించాల్సిన అవసరం ఉందని భక్తులు అంటున్నారు.

**క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇదీ..**

భక్తుల విడిది గదుల్లో సుమారు 40 గదులను ఐదు సంవత్సరాల కిందటే వినియోగించకుండా వదిలేశారు. పైఅంతస్తులో ఉండే కొన్ని గదులను తొలగించారు. మొత్తం గదులను పూర్తిగా తొలగించి వాటికి బదులుగా కొత్తవి నిర్మించాలని అధికారులు నిర్ణయించి ఏళ్లుగా గడుస్తున్నా అతీగతీ లేకుండా పోయంది. శిథిలగదులను కొందరు భక్తులు తెలిసీతెలియక వినియోగిస్తున్నారు. ఈ గదులు కూలితే భక్తుల ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదముంది. ప్రస్తుతం ఉన్న వసతిగదులు భక్తులకు ఏమాత్రం చాలడం లేదు.

ప్రధానంగా శని, ఆదివారాల్లో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ తగినన్ని గదులు లేకపోవడంతో చాలామంది భక్తులు అద్దె వసతిగదుల్లో ఎక్కువ మొత్తం డబ్బులు చెల్లించి ఉండాల్సి వస్తోంది.

**రూ.కోట్ల రాబడి ఉన్నా సౌకర్యాలేవీ?**

కసాపురం ఆలయానికి ఏటా భక్తుల నుంచి సుమారు రూ.12 కోట్లు కానుకల రూపంలో వస్తోంది. పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే గత పదేళ్లల్లో భక్తులకు అదనంగా ఎలాంటి వసతులు కల్పించకపోవడం గమనార్హం. ఆలయం విస్తరణ, పలు అభివృద్ధి పనుల ఊసేలేకుండాపోయింది. బృహత్తర ప్రణాళిక అమలును అటకెక్కించారు.

భక్తులు పార్కుల్లో నేలపైన కూర్చోవాల్సి వస్తోంది. ఆలయానికి చెందిన నిధులు బ్యాంకుల్లో రూ. 30 కోట్లకు పైన ఫిక్స్‌డ్ డిపాజిట్లున్నాయి. నిధులున్నా కూడా భక్తులకు అసౌకర్యాలు స్వాగతం పలుకుతున్నారు. ఇక్కడ సరైన స్నానాల గదులు, మరుగుదొడ్లు లేవు. కొద్ది సేపు భక్తులు సేదదీరడానికి అనువైన వాతావరణం లేదు.

**త్వరలో ప్రణాళిక అమలు**

– వెంకటేశ్వరుడు, సహాయ కార్యనిర్వహణాధికారి


పాతబడిన వసతి గదులను త్వరలో తొలగిస్తాం. వాటి స్థానంలో మొదట ఆలయానికి చెందిన ప్రాకారాన్ని నిర్మించాల్సి ఉంది. వేరే ప్రదేశంలో గదులు నిర్మిస్తాం. పనులను చేపట్టడానికి అదనంగా ప్రైవేట్ స్థలాలను సేకరించాల్సి ఉంది. మాస్టర్‌ప్లాన్ తుదిదశకు చేరింది. ప్రభుత్వం అనుమతి ఇవ్వగానే భక్తులకు పలు సౌకర్యాలు అందుబాటులోకి వచ్చే విధంగా చూస్తాం.

# త్వరలో పరిశ్రమల పార్కులు

అనంతపురం : 'ఇంటికొక పారిశ్రామికవేత్త'ను తయారీ చేయడమే ప్రధాన లక్ష్యంతో కూటమి ప్రభుత్వం వేగంగా అడుగు లేస్తోంది. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సూక్ష్మ,చిన్న, మధ్యతరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ) పార్కు నెలకొల్పడానికి నిర్మాణాత్మక చర్యలకు ఉపక్రమించింది. తొలి విడతగా ఉమ్మడి అనంత జిల్లాలో ఎనిమిది పార్కుల ఏర్పాటుకు సమాయత్తం అవుతోంది. ప్రతి నియోజకవర్గంలోనూ కనీసం పది నుంచి వంద ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. ఇప్పటికే దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ భూసేకరణ ఓ కొలిక్కి వచ్చింది. అనంత, గుంతకల్లు నియోజకవర్గాల పరిధిలో భూమి అనువుగా, తగినంత లభించలేదు. దీంతో కొనుగోలు చేయడమా.. బహుళ అంతస్తుల భవన సముదాయాన్ని నిర్మించడమా అనే దానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. తొలి విడతగా ఒక్కో పార్కుకు రూ.7కోట్లను వెచ్చిస్తున్నారు. ఈలెక్కన ఎనిమిదింటికి రూ.56 కోట్లు మంజూరయ్యాయి. త్వరలోనే నిర్మాణ పనులు మొదలు కానున్నాయి.

**కనీసం 50 ఎకరాలు**

ఉమ్మడి జిల్లాలో తొలి విడతగా ఏర్పాటు చేసే ఎంఎస్ఎంఈ పార్కు కోసం కనీసం 50 ఎకరాల భూమి సిద్ధంగా ఉంచారు. ప్రతి పార్కులోనూ 150 ప్లాట్లు ఉంటాయి. ఒకో ప్లాటును కనీసం ఏడు సెంట్లలో నిర్మిస్తారు. ఈ పార్కుల్లో అధునాతన సదుపాయాలను కల్పిస్తారు. తాగునీరు, విద్యుత్తు, రహదారులు.. తదితర వసతులను ప్రభుత్వమే ఏర్పాటు చేయనుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా పార్కుల




ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో వేగంగా పూర్తి అవుతాయని భావిస్తున్నారు. రెండో విడత లో మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎంఎస్ఎంఈ పార్కులు మంజూరు కానున్నాయి. ఇందుకు ప్రతిపాదనలు పంపడానికి జిల్లా యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

**ఉపాధి కల్పనే లక్ష్యం– సుహన సోనీ, జీఎం, ఏపీఐఐసీ**

తొలి విడతగా అనంత, శ్రీసత్యసాయి జిల్లాలకు ఎంఎస్ఎంఈ పార్కులు మంజూరు అయ్యాయి. నిర్మాణాలకు టెండర్లను ఆహ్వానించారు. త్వరలోనే పనులు చేపట్టనున్నాం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సాహించేందుకు ప్రభుత్వం పలు సదుపాయాలు, రాయితీలు ఇస్తోంది. నిరుద్యోగాన్ని నిర్మూలించడానికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఈ పార్కులు దోహదం చేస్తాయి.

# చేతుల్లో వలలు.. కళ్లల్లో కలలు!!

విశాఖ : విశాఖ చేపలరేవులో నవీకరణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇంకా జెట్టీల ఆధునికీకరణ ప్రారంభం కాలేదు. ప్రస్తుతం మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు, తాగునీటి ట్యాంకర్లు, రహదారులు, వేలం పాట షెడ్డు, వలల అల్లిక కేంద్రం, శీతల గిడ్డంగుల పనులు కొనసాగుతూ ఉన్నాయి. ఇంకొన్ని నిర్మాణాలు తొలి దశలోనే ఉన్నాయి. నిర్ణీత గడువు ముగిసే: 2023 ఆగస్టు నెలలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత పనులు ప్రారంభమైన నాటి నుంచి ఏడాది లోపు పూర్తి చేయాలని గడువు నిర్ణయించారు. అలా గతేడాది నవంబరు నాటికి పూర్తి చేయాల్సి ఉన్నా, ఇప్పటికీ పూర్తి కాలేదు.

ఆయా నిర్మాణాలకు మొత్తం రూ.162 కోట్లు కేటాయించారు. గుత్తేదారుల నిర్లక్ష్యంతోనే పనులు సాగడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని పనులు 70 నుంచి 80 శాతం పూర్తయితే, మరికొన్ని పునాది దశ దాటలేదు.వచ్చే జూన్ 15 నుంచి చేపల వేట సీజన్ ప్రారంభం కానుంది. అయితే జూన్ 10వ తేదీ నుంచే జెట్టీల్లో మత్స్యకారుల హడావుడి కనిపిస్తుంది. బోటుల్లో ఐస్ నిల్వ చేసుకోవడం, ఇంధనం నింపడం, వేట సమయంలో వంటకు అవసరమయ్యే నిత్యావసరాలు భద్రపరు చుకోవడం చేస్తారు. ఆ లోపు నవీకరణ పనులు పూర్తయితే బాగుండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని మత్స్యకార వర్గాలు చెబుతున్నాయి.

**మరో పది నెలలు కష్టమే:** ఒక్కసారి సీజన్ ప్రారంభమైతే... పది నెలల పాటు ఏకధాటిగా వేట సాగుతుంది. మత్స్య సంపద ఎగుమతి, దిగుమతి కార్యకలాపాలతో చేపలరేవు జెట్టీలు నిత్యం రద్దీగానే ఉంటాయి. ఆ సమయంలో నవీకరణ పనులు ముందుకు సాగే పరిస్థితి ఉండదు. పనుల్లో భాగంగా అదనంగా మరో ఫింగర్ జెట్టీ నిర్మాణం ప్రారంభించారు. ఆ పనులు అసంపూర్తిగానే ఉండడంతో, అది కూడా ప్రస్తుత సీజన్‌కు అందుబాటులోకి రాకపోవచ్చు.

**పరిసరాలు అస్తవ్యస్తం..:** నవీకరణ పనుల నేపథ్యంలో కొన్ని నెలల నుంచి చేపలరేవు పరిసరాలు అస్తవ్యస్తంగా ఉంటున్నాయి. ఎక్కడికక్కడ వ్యర్థాలు పేరుకుపోయి, మురుగు నిల్వ ఉంటూ తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. నిధులున్నా.. పనులు సాగకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. త్వరితగతిన పనులు పూర్తయ్యేలా పర్యవేక్షించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

# తీరంలో.. 'తోడే'ళ్లు!

విశాఖపట్నం : విశాఖ తీరంలో నిబంధనలు యథేచ్ఛగా ఉల్లంఘించి సముద్ర పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. సీఆర్‌జడ్ (తీర నియంత్రణ మండలి) నిబంధనల ప్రకారం తీరంలో ఎలాంటి శాశ్వత నిర్మాణాలు చేపట్టకూడదు. భూగర్భ జలాలను వెలికితీసి వాణిజ్య అవసరాలకు వినియోగించకూడదు. ఆర్కేబీచ్‌లో ఆ నిషేధాజ్ఞలు గాలికి కొట్టుకుపోయాయి. కార్లు, ద్విచక్రవాహనాల సర్వీసింగ్ కేంద్రాలు భూగర్భ జలాలను వెలికి తీసి బహిరంగంగా వాడుతున్నా, శాశ్వతంగా హొటల్ నిర్మించినా పట్టించుకునేవారు కరవయ్యారు.

**120అడుగుల లోతుకు బోర్లు:** అప్పుఘర్, ఎంవీపీకాలనీ డబుల్‌రోడ్డు, శివగణేష్‌నగర్, వాసవానిపాలెం, జాలరిఎండాడ, లాసన్స్‌బేకాలనీ తదితర ప్రాంతాల్లోని పలు సర్వీసింగ్ కేంద్రాల్లో సుమారు 100అడుగుల నుంచి 120 అడుగుల మేర తవ్వకాలు చేపట్టి బోర్లను ఏర్పాటు చేశారు. ఇక్కడ నిత్యం ఒక్కో చోట వేలాది లీటర్ల నీటిని తోడేస్తున్నారు. అదే విధంగా గోకుల్‌పార్కు సమీపంలో ఓ రెస్టారెంట్ నిర్మించారు. అనధికారికంగా నీటి తోడకంపై గతంలో పర్యావరణ వేత్తలు, సామాజిక వేత్తలు, మత్స్యకారులు ఆందోళన చేపడితే జీవీఎంసీ



అధికారులు మోటార్లను సీజ్ చేశారు. తర్వాత పట్టించుకోకపోడంతో మళ్లీ పూర్వ స్థితికి చేరుకుంది.

**చమురు వ్యర్థాలు నేరుగా తీరంలోకి.:** సర్వీసింగ్ కేంద్రాల్లో కార్లు, ద్విచక్రవాహనాలను శుభ్రం చేయగా వచ్చిన చమురు వ్యర్థాలను సముద్రంలోకి నేరుగా విడిచిపెడుతున్నారు. దీంతో సముద్ర పర్యావరణం దెబ్బతిని మత్స్యసంపదకు నష్టం వాటిల్లుతోంది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో తీరంలో దుకాణాలకు అనుమతులు ఇవ్వడంతో పర్యావరణవేత్తలు కోర్టును ఆశ్రయించారు. దుకాణాలను వెంటనే తొలగించాలని నాడు కోర్టు తీర్పు ఇచ్చింది. ఇదే సూత్రం గ్యారేజీలు, వాహనాల సర్వీసింగ్ కేంద్రాలకు వర్తిస్తుందనే విషయం తెలిసినా అధికారులు పట్టించుకోవడం లేదు.

**500మీటర్ల వరకు పూర్తిగా నిషిద్ధం:** కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ జారీ చేసిన సీఆర్‌జడ్ నోటిఫికేషన్లు 1991, 2011 ప్రకారం.. సముద్రపు పోటు నుంచి 500 మీటర్ల వరకు భూగర్భ జలాల వెలికితీత పూర్తిగా నిషిద్ధం. సమీపంలోని మత్స్యకార గ్రామాల్లో నీటి వనరులు అందుబాటులో లేకపోతే కేవలం తాగునీటి కోసం 200 నుంచి 500 మీటర్ల జోన్‌లో బోర్లకు అనుమతించవచ్చు.

ఈ ప్రాంతంలో నీటిని తోడాలంటే వాల్టా చట్టం ప్రకారం రెవెన్యూ అధికారుల నుంచి, సీఆర్‌జడ్ నిబంధనల ప్రకారం కాలుష్య నియంత్రణ మండలి, జీవీఎంసీ అధికారుల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. విశాఖ తీరంలో ఈ అనుమతులు లేకుండా మోటార్ల సహాయంతో నిత్యం వేలాది లీటర్ల నీటిని తోడేస్తున్నారు.

# మరింత మెరుగ్గా 108 సేవలు

ఎలమంచిలి : కూటమి ప్రభుత్వం చొరవతో 108 సేవలు మెరుగుపడనున్నాయి. జూన్ నుంచి నిర్వహణ బాధ్యతలను భవ్య సంస్థ చేపట్టనుంది. జగన్ పాలనలో 108 వాహనాల సిబ్బందికి జీతాలు కూడా సకాలంలో ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కొత్తగా ఈ బాధ్యతలను భవ్య సంస్థకు అప్పగించడంతోపాటు పాత వాహనాలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి సమకూర్చాలని నిర్ణయించింది. పాత వాహనాలను ఈ నెలాఖరుకు విజయవాడ తరలించి అక్కడ అప్పగిస్తారు. ప్రభుత్వం వీటి స్థానంలో కొత్త వాహనాలను అందిస్తుంది. జిల్లాలో 22 వాహనాలు ఉన్నాయి. వీటిలో 60 మందికి పైగా సిబ్బంది పనిచేస్తున్నారు. ప్రతి వాహనానికి ఒక పైలట్, ఒక టెక్నీషియన్ ఉంటారు. వీరు సెలవుపెట్టిన రోజు పని చేయడానికి మరొకరు ఉంటారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో 12, నర్సీపట్నం డివిజన్‌లో 10 వాహనాలు సేవలందిస్తున్నాయి. వీటిలో సగానికి పైగా వాహనాలను మార్చాల్సి ఉంది. వాస్తవానికి 108 వాహనాలకు రోజుకు రూ. 5 వేల వరకూ ఇంధనం ఖర్చు చేయడానికి అనుమతి ఉండేది. ఈ పరిమితిని రూ. 2 వేలకు తగ్గించడంతో సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.




## నెవ్వర్ బిఫోర్ అనేలా స్టై పాప గ్లామర్ ఎటాక్..

తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో నటించి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ ఐశ్వర్య మెనన్ సోషల్ మీడియాలో మళ్లీ హాట్ టాపిక్ అవుతోంది. తెల్లటి టాప్, షార్ట్ ప్యాంట్‌లో స్టన్నింగ్ లుక్‌తో పోజులిచ్చిన ఈ లేటెస్ట్ ఫోటోషూట్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. 'గ్రేస్ ఇన్ ఎవరీ గ్లాన్స్, పీస్ ఇన్ ఎవరీ బ్రీత్' అనే క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ స్టిల్స్‌కి అభిమానుల నుంచి భారీ రెస్పాన్స్ వస్తోంది. ఐశ్వర్య మెనన్ కెరీర్ విషయానికి వస్తే.. 2012లో తమిళ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆమె తరువాత కేవలం గ్లామర్‌కు పరిమితం కాకుండా, ప్రామాణికమైన పాత్రలతోనూ మెప్పిస్తోంది. కన్నడ తెలుగులో నటించి ఆకట్టుకుంది. తెలుగులో ఆమధ్య స్పై, భజే వాయు వేగం వంటి సినిమాలలో మంచి పాత్రలు



చేసింది. అయితే ఆమెకు భారీ మార్కెట్ ఉండకపోయినా, తన సొగసుతో, హావభావాలతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకుంది. తాజాగా షేర్ చేసిన ఫోటోల్లో ఆమె చూపించిన స్టైలింగ్, హేర్‌స్టైల్, ఎక్స్‌ప్రెషన్స్ అన్నీ పర్‌ఫెక్ట్‌గా ఉండటమే కాకుండా, యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. తెల్లటి కాస్ట్యూమ్‌లో ఆమె చూపించిన క్యాషువల్ యెట్ గ్లామరస్ లుక్‌కి వావ్ అంటున్నారు నెటిజన్లు. నేచురల్ లైటింగ్‌లో తీసిన ఈ ఫోటోలు ఐశ్వర్య మెనన్ అందాన్ని మరో లెవెల్‌లో చూపిస్తున్నాయనడం అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఆమె తమిళ, తెలుగు చిత్రాలతో పాటు ఓ వెబ్ సిరీస్ ప్రాజెక్ట్‌లోనూ బిజీగా ఉంది. కొంతకాలంగా సరైన హిట్ లేక పోయినా.. సోషల్ మీడియా పాపులారిటీతో మళ్లీ అవకాశాలు అందుకుంటోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె పోస్ట్ చేసిన ప్రతి ఫోటోకి వేల సంఖ్యలో లైక్స్, కామెంట్లు రావడం గమనించదగ్గ విషయం. ఐశ్వర్య మెనన్ కెరీర్ పుంజుకోవడం కోసం మంచి స్క్రిప్ట్ కోసం ఎదురుచూస్తోంది. ఇక ఫ్యాషన్, ఫోటోషూట్‌లతో యూత్‌ను కట్టిపడేస్తోంది.

## అప్పటికీ ఇప్పటికీ అమ్మడు అదే డిమాండ్..!

వారానికో సినిమా రిలీజ్ అవుతుంది. అందులో నటించేందుకు హీరోయిన్స్ వస్తున్నారు. కానీ వారిలో సక్సెస్ అయ్యే హీరోయిన్స్ మాత్రం చాలా తక్కువ. అలాంటి పరిశ్రమలో తమకంటూ ఒక స్టార్ స్టేటస్ తెచ్చుకుని మెప్పించడం అంటే మామూలు విషయం కాదు. అంతేకాదు ఆ స్టార్ డం ని దశాబ్దాలుగా కొనసాగించడం మరీ కష్టం. అలా స్టార్స్ కి ఏమాత్రం తగ్గని విధంగా తన సత్తా చాటుతూ హీరోయిన్స్ లో చాలా ప్రత్యేకంగా ఉంటుంది కోలీవుడ్ స్టార్ హీరోయిన్ నయనతార. ఓ పక్క కమర్షియల్ సినిమాల్లో నటిస్తూనే మరోపక్క ఫిమేల్ సెంట్రిక్ సినిమాలతో అదరగొట్టేస్తుంది. కోలీవుడ్ లో ఒకదశలో నయనతార సినిమా వస్తుంది అంటే స్టార్ హీరోలు కూడా భయపడే పరిస్థితి వచ్చింది. ఐతే తమిళ్ తో పాటు తెలుగులో కూడా నయనతార సినిమాలు చేస్తూ వచ్చింది. తెలుగులో స్టార్ హీరోలతో నటిస్తూ అదరగొట్టేస్తుంది. ఐతే కొన్నాళ్లుగా తమిళ




సినిమాలకే పరిమితమైంది నయనతార. ఈమధ్యనే బాలీవుడ్ లో కూడా తన మార్క్ చూపించే ప్రయత్నం చేసింది. షారుఖ్ ఖాన్ జవాన్ లో నటించి బీ టౌన్ ఆడియన్స్ ని మెప్పించింది నయనతార. ఇక ఈమధ్యలోనే ఒక తెలుగు సినిమా కోసం నయనతారని కలిశారట మేకర్స్. అనిల్ రావిపూడి డైరెక్షన్ లో చిరంజీవి చేస్తున్న సినిమాలో హీరోయిన్ గా నయన్ ని తీసుకునే ప్లాన్ లో ఉన్నారట. చిరుతో ఆల్రెడీ సైరా నరసింహా రెడ్డి, గాడ్ ఫాదర్ సినిమాల్లో నటించింది నయనతార. ఇప్పుడు అనిల్ తో చేసే సినిమాలో కూడా నయన్ నటిస్తుందని టాక్. ఐతే ఈ సినిమాలో నటించేందుకు గాను అమ్మడు 18 కోట్ల దాకా డిమాండ్ చేస్తుందని తెలుస్తుంది. రెమ్యునరేషన్ విషయంలో ఎలాంటి కాంప్రమైజ్ అవ్వని నయన్ అంత ఇస్తేనే సినిమా చేస్తానని అంటుందట. ఐతే నయన్ ఉంటే సినిమాకు మంచి బజ్ వస్తుందని ఆమెతో చర్చిస్తున్నారని తెలుస్తుంది. మెగా మూవీలో నయన్ కన్ఫర్మ్ అయితే తప్పకుండా సినిమాకు ప్లస్ అవుతుందని చెప్పొచ్చు. చిరుతో నయనతార నటించడం గురించి త్వరలోనే అఫీషియల్ అప్డేట్ వస్తుంది. ఈ సినిమాను 2026 సంక్రాంతికి రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని తెలుస్తుంది. సంక్రాంతికి వస్తున్నాం తో 300 కోట్లు కొట్టిన అనిల్ రావిపూడి డైరెక్షన్ లో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న ఈ సినిమా ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.

## ఎవరు ఇవ్వలేనంత రెమ్యునరేషన్ ఇది!



తమిళ స్టార్ హీరో విజయ్ నటిస్తున్న జన నాయకన్ సినిమాకు సంబంధించి ఒక్కొక్క అప్‌డేట్ బయటపడితే తమిళ నాటే కాదు, సౌత్ ఇండస్ట్రీ మొత్తం ఆసక్తిగా గమనిస్తోంది. ఈ సినిమా నిర్మాణ బాధ్యతలను స్వీకరించిన %ఖఎచీ% ప్రొడక్షన్స్, ఇటీవలి కాలంలో బిజినెస్ పరంగా భారీ అడుగులు వేస్తోంది. ప్రత్యేకించి కన్నడలో డిస్ట్రిబ్యూషన్ బేస్ నుంచి పటిష్ట స్థితిలో నిలిచిన ఈ సంస్థ.. ఇప్పుడు నిర్మాణ రంగంలో కూడా టాప్ ప్లేస్ కోసం తీవ్రంగా ట్రై చేస్తోంది. యశ్‌తో తెరకెక్కుతోన్న టాక్సిక్, లోకేష్ కనగరాజ్‌తో డీల్, ప్రభాస్, ఎన్టీఆర్, రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోలతో చర్చలు.. ఇవన్నీ ఒక్కసారి చూస్తే గమనించదగ్గ ఎత్తుగడలు. అందులో భాగంగా విజయ్‌కు ఇచ్చిన భారీ రెమ్యునరేషన్ కచ్చితంగా ఇండస్ట్రీని షేక్ చేయడంలో కచ్చితంగా సరిపోతుంది. విజయ్‌కు ఈ సినిమాకు రూ.275 కోట్లు రెమ్యునరేషన్ రూపంలో డైరెక్ట్‌గా చెల్లించారట. ఎలాంటి షేర్ కట్ లేకుండా పూర్తిగా ఫుల్ పేమెంట్ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఇది దక్షిణాదిన ఏ హీరోకూ ఇప్పటి వరకు లభించని రెమ్యునరేషన్ కావడం గమనార్హం. ఇంతవరకు సౌత్ ఇండస్ట్రీలో స్టార్ హీరోలు ఎక్కువగా ప్రాఫిట్ షేరింగ్ లేదా పార్షియల్ రెమ్యునరేషన్ మోడల్ మీద సినిమాలు చేయడం చూసాం. కానీ ఇక్కడ మాత్రం %ఖఎచీ% వర్గాలు ముందస్తుగా అన్ని అమౌంట్లను చెల్లించడం.. వారికి మార్కెట్ మీద ఉన్న నమ్మకాన్ని అలాగే విజయ్ సినిమా మీద ఉన్న బిజినెస్ బలాన్ని చాటుతోంది. అసలు విజయ్ నటిస్తున్న చివరి సినిమా అన్న బ్యాక్‌డ్రాప్, %ఎ%.వినోత్ డైరెక్షన్, అనిరుధ్ మ్యూజిక్.. ఇవన్నీ కలవడంతో ఈ సినిమా ముందు నుంచి భారీ స్థాయిలో ఫైర్ అవుతోంది. క్రియేటివ్ లెవెల్‌లో ఏమి ఉన్నా, ఈ ప్రాజెక్ట్ మీద బడ్జెట్ లెక్కలు మాత్రం ఇండస్ట్రీకి కొత్త పాఠాలు చెబుతున్నాయి. కేవలం విజయ్‌కి రెమ్యునరేషన్ రూపంలో రూ.275 కోట్లు అంటే, మొత్తం బడ్జెట్, మార్కెటింగ్ కాస్ట్, డిజిటల్ రైట్స్ వేరు లెక్క. దీన్ని బట్టి చూస్తే %ఖఎచీ% ప్రొడక్షన్స్ అగ్ర నిర్మాణ సంస్థలైన హొంబాలే, మైత్రీ మూవీస్‌కు ప్రత్యర్థిగా ఎదగాలని సీరియస్‌గా చూస్తోందని అర్థమవుతుంది. ఇది కేవలం ఓ సినిమా కోసం కాకుండా.. భవిష్యత్తులో స్టార్ హీరోలు, టాప్ డైరెక్టర్లకు తమ బ్యానర్‌పై ఓ సేఫ్ బెట్ అనే మెసేజ్ స్పష్టంగా ఇస్తోంది. అంతే కాకుండా, సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్, మ్యూజిక్, ట్రైలర్ అన్ని పాన్-ఇండియా లెవెల్లో రూపొందించి జనవరి 9, 2026 విడుదలకు ప్లాన్ చేస్తున్నారు. ఆ సమయానికి దేశవ్యాప్తంగా రాజకీయంగా కూడా విజయ్ ఎంట్రీ చేసే అవకాశం ఉండడంతో.. సినిమా మీద హైప్ మరింత పెరగనుంది. మొత్తానికి ఈ సినిమాతో విజయ్ సినిమా జర్నీ ముగుస్తుందా లేక రాజకీయ రంగంలోనూ సినిమా ప్రచారాన్ని బలంగా వాడుకుంటారా? అన్నది చూడాలి. కానీ %ఖఎచీ% మాత్రం ఎవరు ఇవ్వలేని రెమ్యునరేషన్ కూడా మేం ఇస్తాం.. అని ఒక స్ట్రాంగ్ అనౌన్స్ మెంట్ ఇస్తున్నట్లు అర్థమవుతుంది.

## మరోసారి సెంచరీ కొట్టేసిన ధనుష్




మెల్లగా తన మార్కెట్‌ను బలోపేతం చేసుకుంటున్న తమిళ స్టార్ హీరో ధనుష్‌కు 'కుబేర' సినిమా మరో పెద్ద విజయాన్ని అందించింది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా, విడుదలైన తొలి రోజు నుంచే మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. నాగార్జున, రష్మిక మందన్నా వంటి స్టార్ కాస్ట్, ధనుష్ ఆకట్టుకునే నటన కలిసి ఈ సినిమాను ప్రత్యేకంగా నిలిపాయి. లేటెస్ట్ గా 'కుబేర' సినిమా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను దాటి గణనీయమైన ఘనత సాధించిందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఇది విడుదలైన 6 రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం విశేషం. సినిమాపై ముందు నుంచి ఉన్న అంచనాలు, ధనుష్‌కు టాలీవుడ్‌లో ఏర్పడిన క్రేజ్ కారణంగా ఈ విజయాన్ని సాధించినట్టు సినీ విశ్లేషకులు చెబుతున్నారు. 'కుబేర' సినిమా ఒక ధనవంతుడు, ఒక పేదవాడు మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో రూపొందింది. ఇందులో ధనుష్ నటించిన దేవా పాత్రకి విశేషంగా స్పందన లభించింది. నాగార్జున నటించిన దీపక్ పాత్ర కూడా ఇంటెన్స్ గా ఉండటంతో ప్రేక్షకులను మరింతగా ఆకట్టుకుంది.

రష్మిక పాత్రకు మంచి సీట్ టైం ఉండగా, కథానాయికగా ఆమె కథను మలుపు తిప్పే పాత్రలో కనిపించగా సినిమా ఎమోషన్‌కి బలాన్నిచ్చింది. సుమారు 3 గంటల నిడివితో తెరకెక్కిన ఈ చిత్రం టెక్నికల్‌గా కూడా ప్రశంసలు అందుకుంది. నేపథ్య సంగీతం, విజువల్స్, ప్రొడక్షన్ వాల్యూస్ అన్ని కూడా హైలైట్‌గా నిలిచాయి. ముఖ్యంగా ధనుష్ నటనలో భిక్షగాడి యాంగిల్‌కి ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఈ హైఎమోషనల్ కమర్షియల్ డ్రామా, టికెట్ల రేట్లు పెరిగినా కూడా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను బాగా ఆకర్షించింది. ఇక ఇటీవల కాలంలో ధనుష్ నటించిన నాలుగు సినిమాలు వరుసగా రూ.100 కోట్ల క్లబ్‌లో చేరడం విశేషం. తిరు, సార్, రాయన్, కుబేర ఈ విజయాలతో ధనుష్ తెలుగులో తన స్థాయిని పెంచుకుంటూ పోతున్నారు. ఇక 'కుబేర' వంటి హిట్‌తో ఆయనకు టాలీవుడ్‌లో మరిన్ని అవకాశాలు రావడం ఖాయం అని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక నెక్స్ట్ ఎలాంటి విజయాలు అందుతాయో చూడాలి

## ఖిలాడీ బ్యూటీ గ్లామర్ షో

తెలుగు అమ్మాయిలు టాలీవుడ్‌లో హీరోయిన్స్‌గా రాణించడం సాధ్యం కాదని చాలా మంది అనుకుంటూ ఉంటారు. నిజంగానే తెలుగు మాట్లాడే హీరోయిన్స్ స్టార్ హీరోల సినిమాల్లో నటించడం చాలా అరుదుగా చూస్తూ ఉంటాం. అయితే కొద్ది మంది అమ్మాయిలు మాత్రం ఉత్తరాది ముద్దుగుమ్మలకు ఏ మాత్రం తీసి పోకుండా అందంగా కనిపించడంతో పాటు, స్కిన్ షో చేయడం ద్వారా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కించుకుంటారు. ఏపీకి చెందిన డింపుల్ హయతి టాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించింది. రవితేజతో కలిసి 'ఖిలాడీ' సినిమాలో నటించడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. పలు సినిమాల్లో నటించిన డింపుల్ తమిళ్ సినిమాల్లోనూ నటించి మెప్పించేందుకు ప్రయత్నించింది. 19 ఏళ్ల వయసులోనే 'గల్ఫ్' అనే సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్‌లో అడుగు పెట్టింది. 2017లో విడుదల అయిన ఆ సినిమా డింపుల్‌కి నటిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. 2019లో ఈమె నటించిన మూడు సినిమాలు ప్రేక్షకుల ముందుకు వచ్చాయి. ముఖ్యంగా వరుణ్ తేజ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన గద్దలకొండ గణేష్ సినిమాలో చేసిన ఐటెం సాంగ్‌తో టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. జర్రా



జర్రా... అంటూ సాగే ఆ పాటకు మంచి రెస్పాన్స్ దక్కింది. దాంతో డింపుల్ హయతి కెరీర్ స్పీడ్ అందుకుంది. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా ఈమె అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా వార్తల్లో నిలుస్తూ ఉంటుంది. తాజాగా బ్లాక్ అండ్ వైట్ సింపుల్ అండ్ గ్లామర్ ఔట్ ఫిట్‌ను ధరించింది. చూపు తిప్పుకోనివ్వకుండా హొయలు పోతూ ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. అందమైన ఈ ఖిలాడీ బ్యూటీని ఈ ఫోటోల్లో చూస్తూ ఉంటే గుండె జారి గల్లంతవుతుంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ స్థాయిలో ఖిలాడీ బ్యూటీ గ్లామర్ షో చేస్తున్నా కూడా టాలీవుడ్‌లో ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తున్నారు. డీ గ్లామర్ పాత్రలతో పాటు, గ్లామర్ పాత్రలకు రెడీ అంటూ అన్ని రకాలుగా నటించేందుకు సిద్ధ పడే ఈ అమ్మడు ముందు ముందు టాలీవుడ్‌లో పెద్ద సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంటుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో తమిళ తండ్రి, తెలుగు తల్లికి 1998లో ఆగస్టు 21న డింపుల్ హయతి జన్మించింది. పుట్టడం ఏపీలో అయినా పెరగడం మాత్రం హైదరాబాద్‌లోనే జరిగింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టడం కోసం కొన్ని జాతకాలు, ఇతర విషయాల ను పరిగణలోకి తీసుకుని తన పేరుకు ముందు హయతిని జత చేసుకుంది. టాలీవుడ్‌లో ఈమెకు చాలా ప్రయత్నాల తర్వాత అవకాశం దక్కింది. మొదటి సినిమా విజయం దక్కించుకోక పోవడంతో ఆఫర్ల కోసం ఎక్కువ రోజులు వెయిట్ చేయాల్సి వచ్చింది. ఐటెం సాంగ్స్‌కి, వెబ్ సిరీస్‌లకు ఈ అమ్మడు మోస్ట్ వాంటెడ్‌గా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కాస్త సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తే తమిళనాట ఈ అమ్మడికి వరుస ఆఫర్లు దక్కవచ్చు అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

## రష్మిక మందన్న రిప్లైకి అర్థం అదేనా?

వెండితెరపై కొన్ని జంటలకున్న క్రేజ్ మరే జంటకూ ఉండదు. కారణం వారిద్దరి మధ్య కనిపించే కెమిస్ట్రీనే. ఆ కెమిస్ట్రీ కారణంగానే ప్రేక్షకులు హిట్ పెయిర్ మళ్లీ మళ్లీ కలిసి నటిస్తే చూడాలని ముచ్చటపడుతుంటారు. ఇప్పుడు అలాంటి ఓ క్రేజీ జోడీ కలిసి నటించే చూడాలని అభిమానులు, సినీలవర్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ జోడీ మరెవరో కాదు రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న. వీరిద్దరు కలిసి 'గీత గోవిందం'లో తొలిసారి నటించారు. వీరి కెమిస్ట్రీ వర్కవుట్ కావడంతో సినిమా వంద కోట్ల క్లబ్‌లో చేరి రికార్డు సృష్టించింది. ఇక ఆ తరువాత కలిసి చేసిన మూవీ 'డియర్ కామ్రేడ్'. ఇది కేవలం రష్మిక కోసమే విజయ్ చేసినట్టుగా ఉంటుంది. 'గీత గోవిందం' అంత కాకపోయినా ఆడియన్స్‌ని మాత్రం విశేషంగా ఆకట్టుకుని ఈ జంటకు హిట్ పెయిర్ అనే ముద్ర వేసింది. 2019లో ఈ మూవీ విడుదలైంది. ఆ తరువాత నుంచి వీరిద్దరు కలిసి మరో సినిమాలో నటించలేదు. మళ్లీ ఇన్నేళ్లకు వీరిద్దరు కలిసి నటించబోతున్నారనే వార్తలు తాజాగా వినిపిస్తున్నాయి. తాజాగా మైత్రీ మూవీమేకర్స్ వారు పెట్టిన ఓ పోస్ట్‌కు రష్మిక రిప్లై



ఇవ్వడంతో ఆ వార్తలు నిజమేనని క్లారిటీ వచ్చేసింది. విజయ్ దేవరకొండ ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో రూపొందుతున్న 'కింగ్‌డమ్'లో నటిస్తున్న విషయం తెలిసిందే. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాని ఈ నెల 30న భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. దీని తరువాత రాహుల్ సంక్రీత్యన్ దర్శకత్వంలో తెరకెక్కనున్న పీరియాడిక్ డ్రామాలో నటించనున్నాడు. దీన్ని మైత్రీ మూవీ మేకర్స్ వారు నిర్మించబోతున్నారు. ఈ భారీ మూవీ వచ్చే నెల హైదరాబాద్‌లో ప్రారంభం కాబోతోంది. ఇందులో విజయ్‌కి జోడీగా రష్మిక నటించనుందనే వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై నిర్మాణ సంస్థ తాజాగా 'వేచి చూద్దాం' అని అర్థం వచ్చేలా ఓ పోస్ట్ పెట్టింది. దానికి రష్మికను ట్యాగ్ చేసింది. దీనికి రష్మిక రిప్లైగా 'ఓకె' అంటూ నవ్వుతున్న ఎమోజీలను పోస్ట్ చేసింది. దీంతో చాలా గ్యాప్ తరువాత రౌడీ, రష్మికల జోడీ ఖరారైందని అభిమానులు భావిస్తున్నారు. రష్మిక ఇదే విషయాన్ని తాజాగా కన్ఫర్మ్ చేసిందని చెబుతున్నారు. ఇదే నిజమైతే మరో సారి క్రేజీ జోడీ స్క్రీన్‌పై సందడి చేయడం ఇక లాంఛనమే.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536